



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును

భూమి ప్లాట్ నిర్వహణ - అమ్మకం, అద్దె, కొనుగోలు లేదా పెట్టుబడి కోసం నివాస ప్రాంతంలో భవన నిర్మాణం మరియు గృహ ఉపవిభాగానికి అందుబాటులో ఉన్న ఖాళీ పొడి నేల భూమి ప్లాట్‌తో రియల్ ఎస్టేట్ భావన.




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066
సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 135 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 06 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-




## సాగునీటి సంఘాలు చేసే పనులకు
# జీఎస్టీ మినహాయింపు

- ప్రతీ ఎకరాకు తాగునీరు అందేలా సాగు నీటి సంఘాలు కృషి
- అనంతపురం జిల్లాను పండ్ల తోటల వనంగా మార్చిన ఘనత ఎన్డీఏదే
- రాయలసీమ ఎత్తిపోతల పేరిట మభ్యపెట్టే ప్రయత్నాలు
- సాగునీటి సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతీ ఎకరాకు సాగు నీరు అందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సాగు నీటి సంఘాలు చేసే పనులకు జీఎస్టీ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న ఏపీని సమర్థ పాలన, నిర్దిష్ట ప్రణాళికలతో రైతు సానుకూల రాష్ట్రంగా మార్చామని స్పష్టం చేశారు. గురువారం అమరావతిలోని నేలపాడు వద్ద ఉన్న పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన నీరు-ప్రగతి, జల హారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ముందుగా సమావేశ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ...."మన జీవన విధానంలో నీరు చాలా ముఖ్యం. రాయలసీమలో ఊట కాల్వలు ఉండేవి. వాటిలో నీరు సమృద్ధిగా ఉండటంతో పంటలు పండేవి. కాలక్రమంలో నీటిపై నిర్లక్ష్యంతో సమస్యలు వచ్చాయి. సీమ ఎడారిగా మారుతుందని మిగతా .. 2లో..

రోజుకో ఊరు తిరుగుతూ
## పెద్ద పులి హడల్..

మరో మూడు ఆవులను చంపి..



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లాలో గత ఐదు రోజులుగా ప్రజలు, అటవీ అధికారులకు పెద్ద పులి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. రోజుకో ఊరు తిరుగుతూ హడలెత్తిస్తోంది. మంగళవారం రఘునాథపురంలో పశువును చంపిన పులి.. బుధవారం రాత్రి రాజానగరం మండలంలో మళ్లీ పంజా విసిరింది. పుణ్యక్షేత్రం - జి.యర్రంపాలెం గ్రామాల మధ్య మూడు ఆవులు, ఓ దూడను చంపేసింది. పుణ్యక్షేత్రం గ్రామంలోని ఓ పామాయిల్ తోటలో ఆవును బలితీసుకుంది. అనంతరం జి.యర్రంపాలెంలోని మరో తోటలో రెండు ఆవులు, దూడను చంపింది. గురువారం ఉదయం స్థానికులు ఈ విషయాన్ని గుర్తించి అధికారులకు తెలిపారు. దీంతో అటవీశాఖ అధికారులతో పాటు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మిగతా .. 2లో..

కాంగ్రెస్‌కు
## దూరదృష్టి లేదు

రాజ్యసభలో ప్రధాని మోదీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోందన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటు చేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు.

**భారత్ పరపతి పెరుగుతోంది..**

"దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో మిగతా .. 2లో..

## రూ.49 కోట్ల లాటరీ..

కన్నడ యువకుడికి జాక్‌పాట్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ ప్రవాస భారతీయుడికి లాటరీ రూపంలో అదృష్టం వరించింది. తన స్నేహితుడితో కలిసి అబుధాబీ బిగ్ టికెట్‌లో దాదాపు రూ.49 కోట్లు గెలుచుకున్నాడు. కర్ణాటకలోని ఉడుపికి చెందిన శంతను శెట్టిగర్ (33).. మిగతా .. 2లో..

## తెలంగాణలో ఎస్ఐఆర్..

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో సమావేశం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కోసం ఏప్రిల్, మే నెలల్లో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ఎలక్ట్రోల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎస్ఐఆర్ కోసం ముందస్తు ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఈవో వెల్లడించారు. సన్నాహక చర్యల్లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో సీఈవో సుదర్శన్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్ స్థాయి ఏజెంట్లను నియమించ్నుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ కోసం రాజకీయ పార్టీల బీఎల్ఏలు, బూత్ స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఓటర్ల జాబితా సవరణలో కచ్చితత్వం, పారదర్శకత, మిగతా .. 2లో..

తిరుమల లడ్డూ విషయంలో
## వైసీపీది మహాపాపం

- శ్రీవారి పవిత్రత దెబ్బతీసేందుకే కుట్ర
- కల్తీ నెయ్యి సరఫరాపై 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు
- భగవంతుడు అంటే లెక్క లేదు...హిందూమతం పట్ల విశ్వాసం లేదు
- ఈ వ్యవహారాన్ని వదిలి పెట్టం..దోషులపై చర్యలు తీసుకుంటాం
- కల్తీ వ్యవహారంలో తప్పును అంగీకరించకపోగా క్లీన్ చిట్ అంటూ తప్పుడు ప్రచారం
- కరడు గట్టిన నేరస్తులే అసత్యాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తారు
- ఎన్డీఏ కూటమి హిందువుల సెంటిమెంట్‌ను పరిరక్షిస్తుంది
- కూటమి తరపున ప్రజలకు వాస్తవాలు వివరిస్తాం
- మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంతో డబ్బు దోచుకోవడంతో పాటు శ్రీవారి పవిత్రత దెబ్బతీయాలనేదే అసలైన కుట్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భగవంతుడు అంటే లెక్క లేదు... హిందూమతం అంటే విశ్వాసం లేదని, కల్తీ నెయ్యి వ్యవహారంలో దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. తిరుమల లడ్డూ విషయంలో గత పాలకులు మహా పాపం చేశారని ఆగ్రహం మిగతా .. 2లో..

భాజపా, బీఆర్ఎస్‌ది
## ఫెవికాల్ బంధం

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**కరీంనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధిపనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. "తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పలేదు. తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి మిగతా .. 2లో..

ఎన్నికలకు ముందు
## 'ఉచిత' హామీలపై పిల్..

విచారణకు సుప్రీం అంగీకారం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఎక్కువగా ఉచితాల వైపే దృష్టిసారిస్తాయి. ఈ ఉచిత హామీలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. తాజాగా దాన్ని విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ ఈ పిల్‌ను దాఖలు చేశారు. అందులో ఎన్నికలకు ముందు అసంబద్ధమైన 'ఉచిత' హామీలు ఇచ్చే రాజకీయ పార్టీల మిగతా .. 2లో..

రెండున్నర కిలోల బంగారం, 20 కిలోలకుపైగా వెండి..
## విశ్రాంత ఎస్ఈ అరెస్ట్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత ఎస్ఈ కల్లేపల్లి శ్రీనివాసరావును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. విశాఖ, సాలూరు, హైదరాబాద్ సహా ఐదు చోట్ల ఏసీబీ అధికారులు జరిపిన సోదాల్లో అక్రమ ఆస్తులకు సంబంధించిన కీలక ఆధారాలను స్వాధీనం మిగతా .. 2లో..

## గ్యాంగ్‌స్టర్ అబూసలేంకు పెరోల్ నిరాకరణ



**విశ్వం వాయిస్ న్యూస్ :** ముంబయి పేలుళ్ల ఘటన (1993)లో కీలక సూత్రధారి అబూసలేంకు బాంబే హైకోర్టులో ఊరట లభించలేదు. తన సోదరుడి మరణం నేపథ్యంలో 14 రోజుల పెరోల్ కోరుతూ చేసిన దరఖాస్తును కోర్టు కొట్టివేసింది. పోలీస్ ఎస్కార్ట్ ఛార్జీలు చెల్లించలేనని చెప్పడంతో పెరోల్‌ను నిరాకరించింది. రూ.లక్షలోపు మాత్రమే పోలీసు ఎస్కార్ట్ ఛార్జీలను నిందితుడు మిగతా .. 2లో..

ఒక్క రోజే రూ.30వేలు
## తగ్గిన వెండి ధర..

కాస్త దిగొచ్చిన పసిడి




**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు గురువారం దిగొచ్చాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.6,600 తగ్గి రూ.1,59,680 పలికింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,550గా ఉంది. ఇక, వెండి ధర భారీగాపడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.30వేల మేర తగ్గింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,69,000గా మిగతా .. 2లో..

బొగ్గుగనిలో పేలుడు..
## 16 మంది కూలీల మృతి

**విశ్వం వాయిస్ న్యూస్ :** మేఘాలయలో బొగ్గుగనిలో గురువారం భారీ ప్రమాదం జరిగింది. అందులో పేలుడు సంభవించడంతో 16 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన కథనాల ప్రకారం.. గనిలో బొగ్గు తవ్వకాలు చేపడుతోన్న సమయంలో ఈ పేలుడు జరిగింది. దాంతో కూలీలు అందులో చిక్కుకుపోయారు. వారిలో ఎక్కువమంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా మిగతా .. 2లో..

## నేను పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నా

ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ వ్యవహారంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడయ్యాయి. దీనిపై తాజాగా గేట్స్ స్పందించారు. అతడితో ఉన్న ప్రతీ క్షణానికి చింతిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# జీఎస్టీ మినహాయింపు

చాలామంది అనేవారు. సీమను రతనాల సీమ చేయాలని ఎన్టీఆర్ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులు రావడానికి నాడు తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణం. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నీరు-చెట్టు వంటి కార్యక్రమాలు చేపట్టాం. భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతలు సహా అనేక కార్యక్రమాలు చేపట్టాం. దేశంలోనే తక్కువ వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లాగా ఉన్న అనంతపురం నేడు పండ్ల తోటల వనంగా మారిందంటే అందుకు ప్రభుత్వ దూరదృష్టే కారణం. ఒక్క ఏడాదిలోనే 10 లక్షల ఇంకుడు గుంతలు తవ్వాం. మైక్రో ఇరిగేషన్ కింద 90 శాతం సబ్సిడీ ఇచ్చి పండ్ల తోటలకు శ్రీకారం చుట్టాం. రాయలసీమను రతనాల సీమగా చేసే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వానిది. భవిష్యత్ లో సీమకు బంగారు భవిష్యత్ ఉంటుంది. హార్టికల్చర్ పై శ్రద్ధ పెట్టాం. నీటిని మనం సమర్థవంతంగా ఉపయోగించుకుంటే కరువు అనే మాటే వినపడదు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. పరిగెత్తే నీటిని నడిపించాలి. నడిచే నీటిని నిలబెట్టాలి. నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి. ఒకప్పుడు సీమ అంటే నీరు లేని ప్రాంతం. ఇప్పుడు కోస్తాంధ్రతో పోటీ పడి నీటి వృద్ధి చెందుతోంది."అని సీఎం చెప్పారు.

### క్షేత్రస్థాయిలో సాగునీటి సంఘాల పనితీరు బాగుంది

"ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చేలా తాగు నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాలి. సమర్థ నీటి వినియోగంలో రైతుల భాగస్వామ్యం కీలకం. ఈ ఉద్దేశంతోనే 1997లో దేశంలోనే మొదటిసారిగా సాగు నీటి సంఘాలు ఏర్పాటు చేశాం. ఈ వ్యవస్థ ద్వారా 14 లక్షల నీటి సంరక్షణ కట్టడాలు నిర్మించాం. ఎంతో ప్రాధాన్యత కలిగిన సాగునీటి సంఘాలు గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత పాలకులు సాగునీటి సంఘాలు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వంలో వారి బిల్లులన్నీ క్లియర్ చేశాం. 2024 డిసెంబర్లో 6,047 నీటి వినియోగదారుల సంఘాలకు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 58 ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాం. నీటి సంఘాల అధ్యక్షులు పనులు సమర్థవంతంగా చేస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు 60 వేల మంది ఉన్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులంతా ఓ సైన్యం తలుచుకుంటే రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగలరు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.344 కోట్లతో 7,197 ఆపరేషన్ అండ్ మేనేజ్మెంట్ పనులు రైతు సంఘాల ద్వారా చేపట్టాం. సాగు నీటి నిర్వహణ పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించే పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాం. కాలువల నిర్వహణ, నీటి పన్నుల వసూలు, వివాదాల పరిష్కారంలో నీటి వినియోగదారుల సంఘాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇస్తాం. సమర్థ నీటి నిర్వహణతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది నారు మళ్లకు మే 15 నాటికే నీరు అందిస్తాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

### ప్రతి ఎకరాకు నీరివ్వడమే నిజమైన జల హారతి

"నదుల అనుసంధానం జరిగి, ప్రతి ఎకరాకు నీరు ఇవ్వగలిగితే అదే నిజమైన జల హారతి. 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. సాగునీటిపైనే రూ.68 వేల కోట్లు ఖర్చు చేశాం. వ్యవసాయానికి 900 టీఎంసీలు, పరిశ్రమలకు 40 టీఎంసీలు, తాగు నీటి కోసం 200 టీఎంసీల నీరు అవసరం. ప్రతీ ఏటా 1300 టీఎంసీల నీటితో మన రాష్ట్ర అవసరాలు తీరతాయి. మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయి. వీటన్నిటిలో 1300 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలం. ఈ ఏడాది 862 టీఎంసీల నీళ్లు మన జలాశయాల్లో ఉంది. మన ప్రాజెక్టులను ఈ ఏడాది గరిష్టంగా 91 శాతం మేర నింపాం. ప్రస్తుతం మన జలాశయాల్లో రూ. 846 టీఎంసీల మేర నీటి నిల్వలు ఉన్నాయి. ఏపీ జీవ నాడి పోలవరాన్ని గత ప్రభుత్వం గోదావరిలో కలిపేసింది. దుర్మార్గపు పాలనలో నిర్లక్ష్యం వల్ల డయాఫ్రాంవాల్ దెబ్బతిని అదనంగా రూ.1000 కోట్లు ఖర్చు అయ్యింది. సమయం కూడా వృధా అయ్యింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2027 జూన్ కంటే ముందే పోలవరం కల సాకారమై జాతికి అంకితం చేస్తాం. పోలవరం పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతాం. పట్టి సీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరిచ్చాం. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ మార్చి లోగా పూర్తి చేసి అనకాపల్లి, విశాఖకు నీరు అందిస్తాం. తారక రామ తీర్థసాగర్ సహా అన్ని ప్రాజెక్టులు రాబోయే మూడేళ్లలో పూర్తి చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం. గోదావరి నీళ్లు వంశ ధారకు అనుసంధానం చేస్తాం. పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్ కు తీసుకెళ్తాం. గత పాలకులు వెలిగొండ పూర్తి చేసినట్టు భ్రమ కల్పించారు. ఈ సీజన్ లోనే ప్రాజెక్టును పూర్తి చేసి కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

### రాయలసీమ ఎత్తిపోతలతో మళ్లీ మభ్యపెట్టే ప్రయత్నాలు

"ఈ ఏడాది గోదావరి నుంచి 5000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయింది. 200 టీఎంసీల వరద జలాలు పోలవరం నుంచి నల్లమల సాగర్ కు తీసుకొస్తాం. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మిస్తుంటే మేము ఏనాడు అడ్డు చెప్పలేదు. ఇదే తరహా స్పందనను తెలంగాణ నుంచి కోరుకుంటున్నాం. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు చిత్తూరు, మడకశిరకు తీసుకొచ్చాం. రాష్ట్రంలోని అన్ని చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. అప్పుడు కరువు అనే మాట వినపడదు. మొన్నటి వరకూ ఇంజనీర్లే ప్రణాళికలు తయారు చేసేవారు. నేడు మన సాగునీటి సంఘాల అధ్యక్షులు ఇంజనీర్లు కావాలి. వినూత్న ఆలోచనలతో నీటి సమస్యలు పరిష్కారం చేయాలి. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ చేసి మహాపాపం చేశారు. ఘోర అపచారం చేశారు. రసాయనాలతో నెయ్యి తయారు చేసి ప్రసాదంలో వినియోగించారని తేలింది. వారు చేసిన అపచారం క్షమార్హం కాదు. కూటమి అధికారంలోకి వచ్చాక 20 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రధాని మోదీ, మిత్రుడు పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఇతరులపై బురద చల్లటం వైసీపీకి అలవాటైంది. రాయలసీమ ఎత్తిపోతల ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక పెద్ద ఎత్తున మన రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళుతోంది. మిత్రుడు పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఇతరులపై బురద వేయడం వైసీపీ వాళ్లకు అలవాటైంది. రాయలసీమ ఎత్తిపోతల అంశంతో మళ్లీ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించిన ఆ ప్రాజెక్టును ఎన్జీటీ నిలిపేసింది. అప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు మళ్లీ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. మచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా అన్ని ప్రాంతాలకూ నీరసిస్తాం. బ్రహ్మంసాగర్, గండికోట, చెర్లోపల్లి తదితర ప్రాజెక్టులకు నీరు రావటం ఎన్డీఏ ఘనతే. సీమలో నీటి ఇబ్బందులు రాకుండా చూస్తాం. అని ముఖ్యమంత్రి అన్నారు. నీటి వినియోగదారుల సంఘాల సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కె.అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్ , బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# దూరదృష్టి లేదు

భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. ఈయూ కూటమితో అనేక ఒప్పందాలు చేసుకున్నాం. వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. అమెరికాతో ట్రేడ్ డీల్ తర్వాత భారత్‌కు మరింత బలం పెరుగుతుంది. మన యువతకు ఎక్కువ లబ్ధి జరగనుంది.

### ప్రపంచ దేశాలు స్వాగతం పలుకుతున్నాయి..

తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి.

### ఎన్నో సంస్కరణలు తెచ్చాం..

బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ధి పొందారు. 2014 తర్వాత ప్లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది.

### చొరబాటుదారులను రక్షిస్తున్నారు..

అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారు" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# రూ.49 కోట్ల లాటరీ..

మస్కట్‌లో రిటైల్ రంగంలో పనిచేస్తున్నాడు. తన స్నేహితుడితో కలిసి బిగ్ టికెట్ లాటరీ కొనుగోలు చేశాడు. ఇటీవల డ్రా తీయగా.. అతడి టికెట్ నంబర్ వచ్చింది. ఊహించని జాక్‌పాట్‌పై అతడు ఆనందం వ్యక్తం చేశాడు. మరోవైపు.. ఈ విషయం తెలియగానే ఉడుపిలోని శంతను ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది.

# పెద్ద పులి హడల్..

అక్కడికి చేరుకుని పరిశీలించారు. పులి ఎక్కడ ఉందో గుర్తించి బంధించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. దీనికోసం పుణె, దిల్లీ నుంచి నిపుణుల బృందం రాజమహేంద్రవరం చేరుకుంది. పులిని గుర్తిస్తే తుపాకీలో మత్తు ఇంజక్షన్ లోడ్ చేసి షూట్ చేయనున్నారు.

# తెలంగాణలో ఎస్ఐఆర్..

సమస్యల సకాల పరిష్కారం కోసం స్థానికులనే బీఎల్‌ఏగా నియమించాలని సూచించారు. ప్రస్తుతం 2025 జాబితాలోని ఓటర్లను 2002 ఎస్ఐఆర్‌లో నమోదైన ఓటర్లతో అనుసంధానించేలా టేబుల్ టాప్ మ్యాపింగ్‌తో పాటు.. క్షేత్రస్థాయి మ్యాపింగ్ కొనసాగుతోందన్నారు. పట్టణ ప్రాంతాల్లో నివాసాలను గుర్తించి ధ్రువీకరించేందుకు బీఎల్ఓలు ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నట్లు సీఈవో వివరించారు. ఎస్ఐఆర్ సమయంలో ప్రతీ పోలింగ్ ప్రాంతాన్ని బీఎల్ఓలు మూడు, నాలుగు సార్లు సందర్శిస్తారని తెలిపారు. మొదట వెళ్లినప్పుడు ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారు. అందుబాటులో లేని కుటుంబాలను ధ్రువీకరించేందుకు మరోసారి వెళ్తారన్నారు. సన్నాహక దశలో మ్యాపింగ్ కాకపోయిన ఓటర్లు కూడా ఎస్ఐఆర్ సమయంలో తమ వివరాలు సమర్పించుకునే అవకాశం ఉంటుందని సీఈఓ స్పష్టం చేశారు. బూత్ స్థాయిలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యమైతే ఫిర్యాదులను తగ్గించి.. అర్హులైన ఓటర్లు జాబితా నుంచి మిస్ కాకుండా ఉంటారని పేర్కొన్నారు.

# 'ఉచిత' హామీలపై పిల్..

గుర్తులు, వాటి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని ఆయన కోరారు. తన పిల్‌పై 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ అయ్యాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం దృష్టికి పిటిషనర్ తీసుకెళ్లారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఓటర్లను ప్రభావితం చేస్తాయని.. ఇది ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఓ చట్టాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరారు. ధర్మాసనం దీన్ని తీవ్రమైన సమస్యగా పేర్కొంటూ.. దీనిపై మార్చి చివరిలో విచారణ జరిపేందుకు అంగీకరించింది.

# వైసీపీది మహాపాపం

వ్యక్తం చేశారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మంత్రులు లోకేష్, సత్యకుమార్, పార్థసారధి, ఆనం రామనారాయణరెడ్డి, కేశవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. భేటీ అనంతరం ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారం ప్రజలు, భక్తుల మనోభావాలకు సంబంధించింది. గత పాలనలో శ్రీవారి ప్రసాదం విషయంలో అపచారం చోటు చేసుకుంది. ఏడు కొండలవాడికి రెండు కొండలు చాలు అని నాడు అన్నారు. గత పాలనలో తిరుమల విషయంలో ఘోర అపచారానికి పాల్పడ్డారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ చాలా స్పష్టంగా కల్తీ జరుగుతోందని చెప్పినా పట్టించుకోకుండా యథేచ్ఛగా కొనసాగించారు. లక్షల మంది భక్తులకు అదే కల్తీ నెయ్యిని వాడిన లడ్డూను ప్రసాదంగా ఇచ్చి గత పాలకులు మహా పాపానికి పాల్పడ్డారు. గత ఐదేళ్లలో లడ్డూ ప్రసాదం తినాలంటేనే భక్తులు భయపడిన పరిస్థితి. మానసికంగా ఇబ్బందులు పడ్డారు. 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు. ఉద్దేశపూర్వకంగా అక్రమాలు చేయడానికే గత పాలకులు నాటి నివేదికను దాచేశారు. గతంలో పని చేసిన చైర్మన్ పీఏ రూ.4 కోట్ల డబ్బులు లంచంగా తీసుకున్నారు"అని సీఎం వెల్లడించారు.

### నాడు తెలిసే తప్పు చేసి..నేడు ఎదురు దాడి

"అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లో ప్రక్షాళన చేయటంలో భాగంగా తిరుమల పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకున్నాం. నెయ్యి ట్యాంకర్ల నుంచి శాంపిళ్లు తీయించాం. శాంపిళ్లు తీసి ఎన్డీడీబీకి పంపాం. ఇక సిట్ నివేదిక చూస్తే అన్ని రసాయనాలు, పామాయిల్‌తో నెయ్యి తయారు చేసినట్టు వెలుగు చూసింది. భగవంతుడు అంటే లెక్కలేని తనంగా వ్యవహరించారు. హైందవం పట్ల జగన్ కు విశ్వాసం లేదు. తిరుమల లడ్డూ విషయంలో దుర్మార్గం, మహాపాపం చేశారు. చరిత్రలో శ్రీవేంకటేశ్వర స్వామితో ఎవరూ ఆటలాడుకోలేదు. బ్రిటీషర్లు కూడా సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించారు. వాళ్లకంటే హీనంగా గత పాలకులు వ్యవహరించారు. నాడు లడ్డూ కల్తీకి పాల్పడిందే కాక ఇప్పుడు మళ్లీ ఎదురుదాడి చేసి, జరిగిన ఘటనను డైవర్ట్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. సీబీఐ నివేదికలో కల్తీలేదని ఎక్కడా నిర్ధారించలేదు. కరడు గట్టిన నేరస్తులు అసత్యాన్ని ఎలా నమ్మించాలో ప్రయత్నిస్తారు. ఇప్పుడు వైసీపీ అదే పని చేస్తోంది. ఏ ల్యాబ్‌లో అయినా ఒకే తరహా నివేదిక వచ్చింది. టీటీడీ బోర్డు చైర్మన్ కు, పర్చేజ్ కమిటీకి తెలిసే ఈ నిర్ణయాలు జరిగాయి. ఇప్పుడు వాళ్లే ఎదురు దాడి చేస్తున్నారు. దౌర్జన్యం, రౌడీయిజం చేయాలనుకుంటే మీ ఆటలు సాగవు. గత పాలనలో అంతర్వేది రథం తగలబెడితే, రామతీర్థంలో విగ్రహం ధ్వంసం చేస్తే చర్యలు తీసుకోకుండా తిరిగి మాపైనే ఆరోపణలు చేశారు. బూతులు తిట్టినా భరించాను. వారు ఏం చేసినా నిస్సహాయంగా మిగిలిపోవాలా? నాడు వివేకానందరెడ్డిని హత్య చేసి నాపై ఆరోపణలు చేశారు. ఇప్పుడు శ్రీవారి ప్రసాదం కల్తీ చేసి మళ్లీ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. భక్తుల విశ్వాసం, నమ్మకంపైనా దాడి చేస్తున్నారు" అని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

### పరకామణి చోరీని సెటిల్మెంట్లు చేస్తారా?

"జగన్ మోహన్ రెడ్డికి వేంకటేశ్వరస్వామిపై భక్తి ఉంటే డిక్లరేషన్ పై ఎందుకు సంతకం పెట్టలేదు.? అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్ పై సంతకం చేశారు. టీటీడీ నిబంధనల ప్రకారం అన్యమతస్తులు డిక్లరేషన్ పై సంతకం చేయాల్సిందే. డిక్లరేషన్ ఇవ్వకుండా ఇష్టానుసారం వ్యవహరించిన వ్యక్తులు మాపై నిందారోపణలు వేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన దోషులు ఎవరైనా, ప్రజల మనోభావాలతో ఆడుకున్న వారిని ఉపేక్షించే సమస్యే లేదు. మానవ సేవే..మాధవ సేవ అంటాం. అలాంటి ఆ భగవంతుడి ప్రసాదాన్నే కల్తీ చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీయడానికి కావాలనే చేసిన పనిగా మేం భావిస్తున్నాం. పామాయిల్, లాక్టిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్ లాంటి రసాయనాలు ప్రసాదంలో ఉన్నప్పుడు మహాపాపం కాదా? ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి వీళ్లెవరు. ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తారా.? ఇష్టప్రకారం చేస్తాను అనే వ్యక్తులకు ప్రజలే సమాధానం చెబుతారు. 219 ఆలయాలపై గత పాలకులు దాడి చేసి అపవిత్రం చేసే ప్రయత్నం చేశారు. శ్రీవారి పరకామణిలో చోరీ కేసులో సెటిల్మెంట్ చేసే ప్రయత్నం చేస్తారా.? ఇదెక్కడి విడ్డూరం? జరిగిన తప్పును సమర్థించేసి సెటిల్ చేయాలని ప్రయత్నం చేసే వ్యక్తులను ఏమనాలి..? నెయ్యి కల్తీ జరగలేదని సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని నివేదికలో ఎక్కడుంది..? ఏమైనా కలకన్నారా.? క్షమించరాని మహాపాపం చేశారు. ఈ మహాపాపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించలేం. ఉద్దేశపూర్వకంగానే శ్రీవేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయడానికి కుట్ర చేశారు. అన్ని నివేదికలనూ ప్రజల ముందే ఉంచుతాం. తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడుకోవటం మనందరి బాధ్యత. ఈ తరహా విషయాలను ముక్తకంఠంతో ఖండించాలి. తిరిగి ఈ తరహా మహాపచారం చేయాలంటే భయపడాలి. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని వదిలిపెట్టబోం. దోషులను కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుంది. తిరుమల పవిత్రతను కాపాడతాం, అదే మాధవ సేవ. ఈ అంశంపై పీఠాధిపతులలోనూ చర్చించి ముందుకు వెళ్తాం."అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### బూతులు తిడితే సహించాలా?

"ఇష్టానుసారంగా బూతులు మాట్లాడితే సహించాలా.? అసెంబ్లీలో నా కుటుంబంపై మాట్లాడిన బూతుల కారణంగా జీవితంలో తొలిసారి నేను కన్నీళ్లు పెట్టుకున్నాను. ఇప్పుడు మళ్లీ అదే తరహా నన్ను విమర్శిస్తున్నారు. బూతులు తిట్టిన వారిని వెనకేసుకొస్తున్నారు. ఇదీ వారి నైజం. నేను శ్రీ వారి భక్తుడ్ని. శ్రీ వేంకటేశ్వర స్వామి మా ఇంటి కులదైవం. 2003లో టీటీడీలో ప్రాణదానం కార్యక్రమం చేపట్టాం. శ్రీవారి కృపతోనే 23 క్లైమోర్ మైన్స్ దాడి నుంచి బయపడ్డాను. శ్రీ వేంకటేశ్వర స్వామి నాకు పునర్జన్మ ఇచ్చారు"అని సీఎం చంద్రబాబు చెప్పారు.

# ఫెవికాల్ బంధం

కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోంది. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారు? దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే.. ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలి" అని సీఎం డిమాండ్ చేశారు.సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్రాంత ఎస్ఈ అరెస్ట్

చేసుకున్నారు. వివిధ డాక్యుమెంట్లతో పాటు మూడు ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు, రెండు ఫ్లాట్లు, 18.57 ఎకరాల వ్యవసాయ భూమిని గుర్తించారు. రూ.61.87 లక్షల నగదు, సుమారు రెండున్నర కిలోల బంగారం, 20 కిలోలకు పైగా వెండి, కారు, ద్విచక్రవాహనంతో పాటు విలువైన గృహోపకరణాలు గుర్తించినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. సోదాల్లో ఐదు బ్యాంక్ లాకర్ తాళాలు లభించాయని.. శుక్రవారం లాకర్లు తెరుస్తామని చెప్పారు. కళ్లేపల్లి శ్రీనివాసరావును ఏసీబీ కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా 1990లో చేరిన శ్రీనివాసరావు.. ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో పని చేశారు. పదోన్నతిపై సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) ర్యాంకు పొంది 2025 డిసెంబర్ 31న పదవీ విరమణ చేశారు.

# గ్యాంగ్‌స్టర్ అబూసలేంకు పెరోల్ నిరాకరణ

చెల్లించగలడని అతడి తరఫు న్యాయవాది గతంలో కోర్టుకు తెలిపారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని తన నివాస ప్రాంతానికి వెళ్లాలనుకుంటే ప్రభుత్వం కోరిన ఎస్కార్ట్ ఛార్జీలు చెల్లించాల్సిందేనని, లేదంటే పెరోల్ ఇవ్వడం కుదరదని న్యాయస్థానం స్పష్టంచేసింది. ముంబయి పేలుళ్లు, బెదిరింపులు, హత్య కేసుల్లో 2015లో అతడికి జీవిత ఖైదు పడింది. నాటి నుంచి మహారాష్ట్రలోని తలోజా సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్నాడు. మరోవైపు అబూసలేంకు పెరోల్ ఇస్తే పారిపోతాడని మహారాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

# తగ్గిన వెండి ధర..

ఉంది. అంతర్జాతీయంగానూ ఈ లోహాల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పుత్తడి ధర 4,919 డాలర్లు, ఔన్సు వెండి ధర 79 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు వెండి దాదాపు 7శాతం కుంగి కిలో ధర రూ.2.49 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.53 లక్షలకు చేరింది.

# 16 మంది కూలీల మృతి

నిర్వహిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే పేలుడుకు గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. మేఘాలయలో ర్యాట్‌హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలను 2014లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. సమాంతరంగా సన్నని గుంతలు తవ్వుతూ బొగ్గును బయటకు తీసే పద్ధతినే ర్యాట్ హోల్ మైనింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలా నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా పేర్కొంటారు. సుమారు నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటుంది. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలడు. కాగా.. ఎన్‌జీటీ నిషేధాన్ని నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

# నేను పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నా

మీడియా సంస్థతో మాట్లాడారు. "ఎప్‌స్టీన్ కోసం కేటాయించిన ప్రతీ క్షణానికి ఇప్పుడు నేను చింతిస్తున్నాను. అందుకు క్షమాపణలు కోరుతున్నాను. అయితే ఆ ఈ-మెయిల్‌లో ఉన్నది నిజం కాదు. అప్పుడు అతడి ఆలోచన ఏంటో నాకు తెలియదు. ఏదోఒక రూపంలో అతడు నన్ను టార్గెట్ చేయాలని ప్రయత్నించాడా..?" అని వ్యాఖ్యలు చేశారు. ఆ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో గేట్స్‌కు సంబంధించిన ఓ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారినపడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడు. 2013లో తనకి తాను రాసుకున్న ఈ-మెయిల్‌లో అతడు ఈ విషయాలు ప్రస్తావించాడు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన మిలిందా (గేట్స్ మాజీ భార్య)కు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్‌ను అడిగారని రాసుకొచ్చాడు. ఆ పరిణామాల తర్వాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నాడని ఎప్‌స్టీన్ వెల్లడించాడు. అయితే ఈ-మెయిల్‌లోని అంశాలను గేట్స్ బృందం ఖండించింది. ఇదిలాఉంటే.. ఈ ఫైళ్ల విడుదల తర్వాత మిలిందా స్పందించిన సంగతి తెలిసిందే. "నా వివాహంలో ఎంతో బాధించే కొన్ని విషయాలు ఉన్నాయి. ఇప్పుడు బయటకు వచ్చిన వాటిపై సమాధానం ఇవ్వాల్సింది బిల్‌గేట్స్.. నేను కాదు. బాధిత మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్‌గేట్స్ - మిలిందా దంపతులు 2021లో విడాకులు తీసుకున్నారు. ఎప్‌స్టీన్‌తో గేట్స్‌కు సంబంధాలు ఉండడం నచ్చని మిలిందా ఆయన నుంచి విడాకులు తీసుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి.

# ఎడిటర్ వాయిస్

## గల్లా మాధవి వర్సెస్ అంబటి మౌనిక?

ఆలూ లేదు చూలూ లేదు కొడుకు పేరు సోమలింగం అని అంటారు. అయితే రాజకీయాల్లో మాత్రం ఈ సామెత అసలు పనికిరాదు ఊహలు ఎపుడూ ఆకాశాన్ని అంటి సాగుతూంటాయి. ఆచరణలో ఏమి జరిగినా జరగకపోయినా ప్రచారాలూ ఊహాగానాలు ఒక రేంజిలో సాగుతూంటాయి. ఇపుడు అలాంటి వింత అయిన ప్రచారం అయితే హోరెత్తుతోంది. మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎపిసోడ్ ఏపీ రాజకీయాల్లో ఇపుడు హాటెస్ట్ టాపిక్. వైసీపీ అధినేత జగన్ అంబటి ఇంటికి వెళ్ళి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇద్దరు కుమార్తెలతో ఆయన మాట్లాడారు. అండగా ఉంటాను అని చెప్పారు. ఇక జగన్ ప్రెస్ మీట్ లో ఆయన పక్కనే అంబటి మౌనిక ఉన్నారు. దాంతో పాటుగా ఆమె జగన్ కి తమ ఇంటి దాడికి సంబంధించిన అంశాలను పత్రాలను ఫోటోలను అందిస్తూ సహకరించారు. జగన్ సైతం ఆమెకి విశేష ప్రాధాన్యత ఇచ్చారు.

**గుంటూరు పశ్చిమలో :**

ఇదిలా ఉంటే గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జిగా మాజీ మంత్రి అంబటి రాంబాబు ఉన్నారు ఆయనకు గత మూడు సార్లూ సత్తెనపల్లి అసెంబ్లీ నుంచి టికెట్ ఇచ్చిన వైసీపీ 2029 లో పశ్చిమ నుంచి నిలబెట్టాలని చూస్తోంది. దానికి తగినట్లుగా అంబటి ఈసారి సంక్రాంతి సంబరాలను కూడా పశ్చిమలో జరిపారు. తన పొలిటికల్ యాక్టివిటీని అక్కడకు మార్చారు. ఇక అంబటి రాంబాబు 2029లో పోటీకి ఉత్సాహంగా ఉన్నారు అన్నది ఇప్పటిదాకా అంతా అనుకుంటున్న నేపథ్యం ఉంది. అయితే తాజాగా మారిన దానిని బట్టి వైసీపీ నేతలు మరో విధంగా ప్రచారం మొదలెట్టేశారు.

**మాధవికి ధీటుగా :** అంబటి ఇంటి మీదకు దాడికి వచ్చిన పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యేని ఓడించాలని వైసీపీ నేతలు అంటున్నారు. జగన్ సైతం మాధవి ప్రస్తావన తెస్తూ ఆమె ఫోటోలను మీడియా ముందు పెట్టారు. దాంతో పాటుగా మాధవి కి సరి జోడుగా అంబటి మౌనికనే వచ్చే ఎన్నికల్లో పోటీకి పెడితే పోరు రసవత్తరంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. దాని మీదనే ప్రచారం కూడా చేస్తున్నారు. ఆమె అంబటి అరెస్ట్ తరువాత మీడియా ముందు మాట్లాడిన తీరు ఆమె జగన్ పరామర్శకు వచ్చినపుడు మాట్లాడిన విధానం అన్నీ చూసిన వారు ఆమె అంబటి వారసురాలుగా రాజకీయాల్లోకి రావాలని బలంగా కోరుకుంటున్నారు.

**వైసీపీకి ట్రాక్ రికార్డు :** ఇదిలా ఉంటే గుంటూరు పశ్చిమలో వైసీపీకి ఇప్పటిదాకా గెలుపు లేదు, మూడు ఎన్నికలు వరసగా జరిగితే మూడు సార్లూ వైసీపీ ఓటమిని చవి చూసింది. 2029 లో అంబటిని నిలబెట్టాలన్న దాని మీద ఆలోచనలు ఉన్నాయి కానీ గెలుపు గుర్రాలు కూడా చూస్తారు అన్న మాట అప్పట్లో ఉంది. ఇపుడు ఏకంగా అంబటి కుమార్తె మౌనిక ధీటుగా రాజకీయాల్లో నిలబడితే మాత్రం ఆమెకు చాన్స్ కచ్చితంగా ఉండొచ్చు అని అంటున్నారు. అంబటి సైతం తన కుమార్తె పొలిటికల్ ఎంట్రీకి నూరు శాతం సహకరిస్తారు అని అంటున్నారు. దాంతో గల్లా మాధవి మీద వైసీపీ కూడా మహిళా అభ్యర్ధినే నిలబెట్టి ఈసారి అయినా పశ్చిమం గెలుచుకునేందుకు వీలు ఉంటుందని మహిళా కార్డుతో పాటు విక్టిమ్ కార్డు కూడా పండుతుందని వైసీపీ లో అయితే ప్రచారంగా ఉంది. దీని మీదనే సోషల్ మీడియాలో చర్చ అయితే సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

# క్రైం వాయిస్

## రూ.1.40 కోట్ల బిల్లుకు రూ.30 లక్షల లంచం

### అనిశా వలలో జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ ఎస్ఈ చిన్నారెడ్డి
### రూ.15 లక్షలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



**కూకట్‌పల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** పాత బిల్లుల విడుదలకు లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోన్ సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) పొద్దుటూరి చిన్నారెడ్డి అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కాడు. బుధవారం తన కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ బాలసాని ప్రవీణ్‌కుమార్ ద్వారా రూ.15 లక్షలు తీసుకుంటుండగా... అనిశా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనిశా రంగారెడ్డి రేంజ్ ఏసీపీ ఆనంద్‌కుమార్ కథనం ప్రకారం... కూకట్‌పల్లి, మూసాపేట, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించడంతోపాటు వాటి నిర్వహణ పనులు చేసినందుకు గతేడాదికి సంబంధించిన రూ.1.40 కోట్ల బిల్లు పెండింగులో ఉంది. నిధులు విడుదల చేయాలంటూ గుత్తేదారు ఎస్ఈని సంప్రదించగా...రూ.30 లక్షల లంచం రెండు విడతలుగా ఇచ్చేలా డిమాండ్ చేశారు. మొదటి విడత లంచం సొమ్ము రూ.15 లక్షలతో గుత్తేదారు బుధవారం మధ్యాహ్నం ఎస్ఈ కార్యాలయానికి వచ్చారు. ఎస్ఈ సూచన మేరకు కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్‌కుమార్ డబ్బులు తీసుకుంటుండగా అనిశా అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకుని..నాంపల్లి అనిశా కోర్టులో హాజరుపరిచినట్లు ఏసీపీ ఆనంద్‌కుమార్ తెలిపారు. ఎస్ఈ కార్యాలయంతోపాటు పేట్‌బషీరాబాద్‌లోని చిన్నారెడ్డి నివాసంలోనూ రాత్రివరకు అనిశా తనిఖీలు నిర్వహించింది. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నంబరు 1064 లేదా వాట్సప్ నంబరు 9440446106కు సమాచారం ఇవ్వాలని సూచించింది.

## క్షమించండి నాన్నా.. కొరియా అంటే ప్రాణం

### ఆన్‌లైన్ 'లవ్‌గేమ్'కు బానిసలై ముగ్గురు అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

**గాజియాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** కొరియన్ ఆన్‌లైన్ గేమ్ 'లవ్‌గేమ్'కు బానిసలై ముగ్గురు మైనర్ అక్కాచెల్లెళ్లు తమ ప్రాణాలు తీసుకోవడం కలకలం సృష్టించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌కు చెందిన చేతన్ కుమార్‌కు ఇద్దరు భార్యలు. వారిద్దరూ సొంత అక్కాచెల్లెళ్లే. వారికి ఐదుగురు సంతానం. అందులో నలుగురు అమ్మాయిలు. వీరిలో ముగ్గురు అమ్మాయిలు నిషిక (16), ప్రాచీ (14), పఖీ (12) దాదాపు మూడేళ్లుగా ఆన్‌లైన్ గేమ్‌కు బానిసలయ్యారు. పాఠశాలకు వెళ్లకుండా, ఎవరితోనూ మాట్లాడకుండా ఫోన్‌కే అతుక్కుపోయేవారు. ప్రాచీ మిగిలిన ఇద్దరికి గేమ్ ఎలా ఆడాలో, అందులోని టాస్క్‌లు ఎలా పూర్తి చేయాలో తెలిపేది. తీవ్ర ఆందోళన చెందిన తల్లిదండ్రులు.. గేమ్‌ను ఆడొద్దంటూ కొన్నిరోజులుగా ఒత్తిడి పెంచారు. ఈ క్రమంలో ఒత్తిడికి లోనైన ముగ్గురు అక్కాచెల్లెళ్లు బుధవారం తెల్లవారుజామున తమ అపార్ట్‌మెంటు 9వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు అమ్మాయిలు ఒకరి చేయి మరొకరు పట్టుకొని దూకేయగా, మరొకరు ఒంటరిగా దూకారని పోలీసులు చెప్పారు. బాలికలు వినియోగించిన ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకుని సైబర్ నిపుణుల సాయంతో విశ్లేషిస్తున్నట్లు వివరించారు. ఆత్మహత్య చేసుకున్న అక్కాచెల్లెళ్లు కొరియన్ సంస్కృతికి బాగా ప్రభావితమైనట్లు వారి ఇంట్లో లభించిన నోట్ ద్వారా తెలిసిందని డీసీపీ నిమిశ్ పాటిల్ తెలిపారు. 'క్షమించండి నాన్న' అని అందులో రాసి ఉన్నట్లు చెప్పారు. 'నేను ఒంటరిదాన్ని' అంటూ గది గోడపై రాసి ఉన్నట్లు తెలుస్తోంది. తాము కొరియాను ఎంత ఇష్టపడుతున్నామో బాలికలు డైరీలోని 8 పేజీల్లో వివరించినట్లు సమాచారం. కొరియా గేమ్‌లను ఆడకుండా ఉండలేమని, కొరియానే తమ ప్రాణమని, అందుకే ప్రాణాలను తీసుకుంటున్నామని రాసుకొచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు, బాలికలు ఆడిన ఆన్‌లైన్ గేమ్‌లో ఆత్మహత్య చివరి టాస్క్‌గా ఉన్నట్లు సమాచారం. గేమ్‌లో ఆత్మహత్య టాస్క్ ఉంటుందని తనకు తెలియదని, తెలిస్తే ఇలా జరిగి ఉండేది కాదని చేతన్ కుమార్ రోదించారు.

## బైక్‌పై విన్యాసాలు.. కడపలో రీల్స్ చేస్తూ యువకుడి మృతి

**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** రీల్స్ మోజులో పడి యువకుడు దుర్మరణం చెందిన ఘటన కడపలో చోటు చేసుకుంది. కడపకు చెందిన ముబారక్ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. నిన్న రాత్రి అతడు తన స్నేహితుడితో ద్విచక్ర వాహనంపై రీల్స్ చేస్తూ దాదాపు మూడు కిలోమీటర్లు వెళ్లాడు. ద్విచక్ర వాహనాన్ని పైకి లేపుతూ విన్యాసాలు చేశారు. కొద్ది దూరం వెళ్లిన తర్వాత వాహనం అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడ్డారు. ఈ ఘటనలో ముబారక్ అక్కడికక్కడే మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కడప నగరంలో రీల్స్ మోజులో పడి చాలామంది బైక్‌లపై స్టంట్స్ చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. బైక్‌లపై విన్యాసాలు చేస్తూ స్థానికులను భయాందోళనకు గురి చేస్తున్నవారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## బధిర యువతిపై అత్యాచారం..

### 17 మందికి డీఎన్ఏ టెస్ట్ చేస్తే..

**విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలో సభ్యసమాజం తలదించుకునే ఘటన చోటుచేసుకుంది. అత్యాచారానికి గురికావడంతో 20 ఏళ్ల ఓ బధిర యువతి గర్భం దాల్చింది. ఆమె దుస్థితికి కన్నతండ్రే కారణమయ్యాడు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ అమానవీయ ఘటన గతేడాదే చోటుచేసుకోగా.. కేసు విచారణలో భాగంగా సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ముంబయికి చెందిన 20 ఏళ్ల యువతి గతేడాది సెప్టెంబర్‌లో అనారోగ్యానికి గురైంది. దానిని గుర్తించిన నానమ్మ ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లగా.. గర్భం దాల్చిందని వైద్యులు గుర్తించి ఐదోనెల అని వెల్లడించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ఆమె బధిరురాలు కావడం, స్పందించడానికి ఇష్టపడకపోవడంతో తొలుత పోలీసులు వాంగ్మూలాన్ని నమోదు చేయలేకపోయారు. దాంతో వారు బాధితురాలి తండ్రితో మాట్లాడగా.. ఆమె ఎలా గర్భం దాల్చిందో తనకు తెలియదని బుకాయించాడు. అంతేగాకుండా ఫిర్యాదు చేసేందుకు నిరాకరించాడు. దీనిపై అనుమానం వచ్చిన పోలీసులు ఆమెకు కౌన్సిలింగ్ చేయడంతో.. ఫిర్యాదు చేసేందుకు అంగీకరించింది. దర్యాప్తులో భాగంగా 17 మంది అనుమానితుల డీఎన్ఏలను టెస్ట్‌కు పంపించారు. ఆ అనుమానితుల్లో కన్నతండ్రి కూడా ఉన్నాడు. ఇటీవల వచ్చిన ఫలితాలను చూసి, పోలీసులు విస్తుపోయారు. పిండం డీఎన్ఏ, ఆమె తండ్రి డీఎన్ఏతో మ్యాచ్ అయింది. దాంతో అతడిని అరెస్టు చేశారు. అయితే ఈ అత్యాచారం కేసులో గతంలో ఓ టీనేజర్‌ని అరెస్టు చేశారు. బాధితురాలు అతడిని గుర్తించడంతో ఆ అరెస్టు చోటుచేసుకుంది. దాంతో మిగతా వారి పాత్ర పైనా దర్యాప్తు జరుగుతోంది.

### తక్కువ ధరకు బంగారు నాణేలంటూ నమ్మించి..

## రూ.20 లక్షలు కాజేశారు

**కంకిపాడు రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారం రేటు సామాన్యుడికి అందనంతగా పెరిగిపోయింది. ఇదే అదనుగా మోసం చేసేందుకు కేటుగాళ్లు సిద్ధమైపోయారు. తక్కువ ధరకు బంగారు నాణేలను ఇస్తామని రూ.20.25 లక్షలు కాజేశారు. ఈ ఘటన పెనమలూరు శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసరావుపేటకు చెందిన తిరుపతిరెడ్డి విజయవాడలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. బిల్లులు లేని బంగారు నాణేలు ఇస్తానని పేర్కొంటూ శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తి అతడికి పరిచయమయ్యాడు. వీడియో కాల్ చేయగా కొన్ని బంగారు నాణేలను ఆయన చూపించాడు. దీంతో అవి కొనుగోలు చేసేందుకు తిరుపతిరెడ్డి అంగీకరించాడు. 20 గ్రాములున్న 17 నాణేలు రూ.37.40 లక్షలు ఉంటాయని శ్రీనివాసరెడ్డి తెలిపాడు. తన వద్ద రూ.20.50లక్షలు మాత్రమే ఉన్నట్లు తిరుపతిరెడ్డి, అతడి బంధువు మల్లారెడ్డి చెప్పారు. నగదు తీసుకుని పెనమలూరు శివారు గంగూరులోని డీమార్ట్ వద్దకు రమ్మని చెప్పిన కేటుగాళ్లు వారికి సూచించారు. దీంతో తిరుపతిరెడ్డి, మల్లారెడ్డి అక్కడికి వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తి అక్కడికి వచ్చి రోడ్డు అవతల వైపు కారులో నాణేలు ఉన్నాయని చెప్పాడు. నగదు బ్యాగ్ తనకు ఇచ్చి కారు వద్దకు వెళ్లాలని సూచించాడు. బ్యాగ్ ఇచ్చిన అనంతరం తిరుపతిరెడ్డి ఎక్కేలోపే శ్రీనివాసరెడ్డితో పాటు మరో వ్యక్తి ఒక్కసారిగా కారులో ఉడాయించారు. ఈ క్రమంలో తిరుపతిరెడ్డి డోర్‌ను గట్టిగా పట్టుకోవడంతో ఆయనకు గాయాలయ్యాయి. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

### నిద్రమత్తులో రసాయన ద్రావణం తాగిన వ్యక్తి

## చికిత్స పొందుతూ మృతి

**చౌటుప్పల్, విశ్వం వాయిస్ న్యూస్ :** నిద్రమత్తులో ఉన్న ఓ వ్యక్తి మంచినీళ్లు అనుకొని రసాయన ద్రావణం తాగి మృతిచెందిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపిన ప్రకారం... కైతాపురానికి చెందిన గుడ్డెటి రవి(43) ఎల్లగిరి శివారులోని కోళ్లఫారంలో పని చేస్తున్నారు. ఎప్పటిలాగే మంగళవారం(ఈ నెల 3) రాత్రి 9:30 గంటలకు కోళ్లఫారం వద్దకు వెళ్లారు. అర్ధరాత్రి దాహం వేయడంతో నిద్రమత్తులో ఉన్న రవి.. మంచినీళ్లు అనుకొని కోళ్ల షెడ్డు ఫ్లోర్‌ను శుభ్రం చేసే సర్మోలిన్ అనే రసాయన ద్రావణం ఉన్న సీసాను తీసుకొని తాగారు. కొద్దిసేపటి తర్వాత కడుపులో మంట వస్తుందని చెప్పడంతో అక్కడ పని చేసేవారు చౌటుప్పల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందారు.

# వనిత వాయిస్

## వ్యవసాయం... నీ వల్ల కాదన్నారు..






అనారోగ్యాలు వచ్చాక చికిత్స తీసుకోవడం కంటే... వ్యాధులు రాకుండా నివారించడమే మంచిది అంటారు కావ్య ధోబలే. ఇందుకు ప్రధాన కారణం కలుషిత ఆహారం తినడమే అని గుర్తించి దాన్ని నివారించడానికి సేంద్రియ సాగులోకి అడుగుపెట్టారు. ఇందుకోసం ప్రభుత్వోద్యోగాన్ని సైతం వదులుకున్నారు. నలుగురికీ సహాయపడాలనే మనస్తత్వం కావ్యది. ఈ క్రమంలోనే ఆరోగ్య రంగంలోకి రావాలనుకున్నారామె. దాంతో ముంబయిలోని 'లోకమాన్య తిలక్ మున్సిపల్ మెడికల్ కాలేజీ'నుంచి నర్సింగ్‌లో డిప్లొమా చేశారీమె. చదువయ్యాక అదే కాలేజీలో ట్యూటర్‌గానూ పనిచేశారు. టాటా ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుగా పనిచేసే అవకాశమూ వచ్చింది. 2019లో నర్సుగా ప్రభుత్వోద్యోగం సంపాదించారు. అదే సమయంలో కొవిడ్ విజృంభించడంతో ఎంతోమంది కొవిడ్ బాధితులకు సేవలందించి కరోనా వారియర్‌గానూ పేరు తెచ్చుకున్నారు కావ్య. 'ఆ సమయంలోనే నాకూ వైరస్ సోకింది. దాదాపు మరణపు అంచుల వరకూ వెళ్లొచ్చా. అప్పుడే జీవితం ఎంత విలువైందో తెలిసింది. నిజానికి మన రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటం వల్ల వైరస్ బారిన పడ్డాం. మార్కెట్లో దొరికే పండ్ల దగ్గర నుంచి కాయగూరల వరకూ ప్రతిదీ రసాయన ఎరువులతో పండినవే. అవి మన ఇమ్యూనిటీపై దాడి చేయడంతో... రోగనిరోధక శక్తి బలహీనం అవుతుంది. అందుకే సేంద్రియ ఎరువుల తయారీ మొదలుపెట్టా. దీనికోసం కష్టపడి తెచ్చుకున్న ప్రభుత్వ ఉద్యోగాన్నీ వదిలేశా'నంటారు కావ్య.

**ఉద్యోగం వదలొద్దన్నారు...**

'మంచి జీతం. ప్రభుత్వ ఉద్యోగం. మానేస్తానంటే ఇంట్లో ఒప్పుకోలేదు. 'వర్మీ కంపోస్ట్ తయారీకి ముంబయి నుంచి పుణెలోని దత్‌కిల్‌వాడీ గ్రామం వచ్చా. అక్కడ మా భూమిలో దీన్ని మొదలుపెట్టా. మా కుటుంబంతో సహా ఇరుగుపొరుగు వాళ్లు ఇది నీ వల్ల కాదంటూ నిరాశపరిచారు. ఆ సమయంలో మావారే నన్ను ప్రోత్సహించారు. రూ.5లక్షల పెట్టుబడితో చిన్న షెడ్డులో తక్కువ మొత్తంలో మొదలుపెట్టా. ఆవుపేడ, వానపాములు, పంట, కాయగూరల వ్యర్థాలతో సేంద్రియ ఎరువుని తయారుచేశా. అంతేకాదు, వర్మీ కంపోస్ట్ ఉపయోగించడం వల్ల కలిగే లాభాలను స్థానిక రైతులకి వివరించా. మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డా క్రమంగా మంచి స్పందన వచ్చింది. దాంతో మా ఉత్పత్తి పెరిగింది. ప్రస్తుతం మహారాష్ట్రతోపాటు పలు రాష్ట్రాల్లో ఎరువుల్ని విక్రయిస్తూ సంవత్సరానికి రూ.30లక్షలు సంపాదిస్తున్నా. మరోవైపు 'కృషి కావ్య ఆగ్రో వర్మీ కంపోస్ట్ ట్రైనింగ్ సెంటర్'ను ఏర్పాటుచేసి సేంద్రియ వ్యవసాయంపై స్థానిక రైతులకు అవగాహన కల్పిస్తున్నా'నంటారామె. మహారాష్ట్ర, కర్ణాటక, పశ్చిమబెంగాల్, గోవా వంటి ప్రాంతాల్లో మహిళా రైతులకు శిక్షణ తరగతులు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. 'సేంద్రియ పంటలు భూమిని కలుషితం చేయవు. మనం నేలను కాపాడగలిగితే, అది మన ఆరోగ్యాన్ని సంరక్షిస్తుంది. అందుకే ప్రతి రైతూ సేంద్రియ వ్యవసాయం వైపు సాగాల'ని చెప్పే కావ్య ప్రయత్నానికి అనేక అవార్డులూ, రివార్డులూ అందుకున్నారు.

# ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి

## జి.ఎర్రంపాలెం గ్రామంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పర్యటన



**రాజానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం జీ.ఎర్రంపాలెం గ్రామంలో గురువారం మధ్యాహ్నం 3.00 గంటలకు తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా ఎస్పీ జి.నరసింహం కిషోర్, శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ,ఉన్నత అధికారులు పర్యటించారు. ఈ ప్రాంతంలో కొన్ని ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామ ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. థర్మల్ డ్రోన్స్ ద్వారా పులి జాడల గుర్తింపుకు వేగవంతమైన చర్యలు చేశాం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పులి కదలికలపై విశ్లేషణ, పులిని సురక్షితంగా బంధించేందుకు చర్యలు చెప్తున్నామన్నారు. పులి తిరిగి ఇదే ప్రాంతానికి వచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అవసరం లేకుండా ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. పులి దర్శనమైతే వెంటనే అటవీ శాఖ లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల సహకారమే అత్యంత కీలకమని అధికారులు స్పష్టమన్నారు. పులి అత్యంత సున్నితమైన జంతువు, చుట్టుపక్కల పరిస్థితులను గమనిస్తుందని అధికారులు తెలిపారన్నారు. పులిని గుర్తించిన సందర్భాల్లో ఫోటోలు, వీడియోలు తీయడం దాని కదలికలపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. పులి జాడలు కనిపించినా శబ్దాలు చేయడం లేదా దృష్టి మళ్లించే ప్రయత్నాలు చేయవద్దని సూచించారు. ఇప్పటివరకు మనుషులపై పులి దాడి చేసిన ఘటనలు జరగలేదని స్పష్టమన్నారు. పులిని డిస్టర్బ్ చేస్తే అటవీ, ఎక్స్‌పర్ట్ టీమ్ పులిని బంధించే చర్యలకు ఆటంకం కలిగే అవకాశం ఉందన్నారు. పులి సంచరించే ప్రాంతాల ప్రజలు ఎవ్వరూ బయటకు రావద్దని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేశారు.

# ఏపీలో గద్దర్ విగ్రహం.. చంద్రబాబు రియాక్షన్ ఇదే!

ప్రజా గాయకుడు.. కమ్యూనిస్టు భావజాలాలు పుణికి పుచ్చుకున్న గద్దర్ విగ్రహాన్ని ఏపీలో ఏర్పాటు చేయాలని.. ఆయన కుమార్తె వెన్నెల సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లా ఉండవల్లికి వచ్చిన ఆమె.. సీఎం చంద్రబాబును కలుసుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ప్రత్యేకంగా తీరిక చేసుకున్న చంద్రబాబు.. వెన్నెలతో భేటీ అయ్యారు. వాస్తవానికి ఉదయం నుంచి చంద్రబాబు చాలా బిజీగా ఉన్నారు. ఉదయం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు. తర్వాత.. బీసీ సంక్షేమ శాఖపై సమీక్షించారు. ఈ కార్యక్రమాల మధ్యలో గుంటూరులో జగన్ పర్యటనకు సంబంధించిన పరిస్థితులు.. శాంతి భద్రతలు వంటి అంశాలపై ఎప్పటి కప్పుడు ఉన్నతాధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటూ.. తగు సూచనలు చేస్తూ వచ్చారు. దీంతో వెన్నెల ఎక్కువ సేపు నిరీక్షించాల్సి వచ్చింది. అనంతరం సీఎం తన ఛాంబర్‌లోకి ఆమెను ఆహ్వానించి.. ప్రత్యేకంగా సంభాషించారు. ఈ సందర్భంగా వెన్నెల తన మనసులోని మాటను సీఎంకు వివరించారు. తన తండ్రి విగ్రహాన్ని విజయవాడ లేదా అమరావతిలో ఏర్పాటు చేయాలని.. కోరారు. విజయవాడతో తన తండ్రికి ఎంతో అనుబంధం ఉందని వివరించారు. అలానే.. విశాఖలోని ప్రతిష్ఠాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని కళలు-సంస్కృతి విభాగానికి గద్దర్ పేరు పెట్టాలని వెన్నెల కోరా రు. విశాఖతోనూ తన తండ్రికి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఆయావిషయాలను ఆసక్తిగా ఆలకించిన సీఎం చంద్రబాబు.. గద్దర్ విగ్రహ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించినట్టు వెన్నెల తెలిపారు. ఈ పర్యటనలో ఆమె ఒక్కరే రావడం గమనార్హం.



ఇదిలావుంటే.. గతంలో చంద్రబాబు పాలనలో లోపాలు ఉన్నాయంటూ పలు సందర్భాల్లో గద్దర్ విమర్శించారు. అయినప్పటికీ.. చంద్రబాబు ఆయన మృతి చెందినప్పుడు నివాళు లర్పించారు.

# చంద్రబాబుతో పవన్ కీలక భేటీ.. సంచలన నిర్ణయం?



ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య బుధవారం కీలక సమావేశం జరిగింది. సుమారు రెండున్నర గంటల పాటు ఈ సమావేశం కొనసాగింది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్ని రాజకీయ పరిణామాలతోపాటు భవిష్యత్తులో తీసుకోబోయే నిర్ణయాలపై ఇద్దరు నేతలు చర్చించినట్లు చెబుతున్నారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ భేటీ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం కలుసుకున్నారు. తిరుమల లడ్డూ వ్యవహారంలో విచారణ కమిషన్ వేయాలని ఆ సమావేశంలో తీర్మానించుకున్నారు. ఇది జరిగిన 24 గంటల్లోనే ముఖ్య నేతలు మరోసారి కలుసుకోవడం, సుమారు రెండున్నర గంటల పాటు సుదీర్ఘంగా చర్చించడం రాజకీయంగా విస్తృత చర్చకు దారి తీసింది. నిజానికి ముఖ్యమంత్రి షెడ్యూల్ లో ఈ రోజు పవన్ తో సమావేశాన్ని ముందుగా ప్రకటించలేదు. బుధవారం ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ లో ఉదయం 12.15 నిమిషాలకు సచివాలయానికి వెళ్లాల్సివుంది. 12.30 నిమిషాలకు సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖపై సమీక్ష జరగాల్సివుంది. అయితే ఉప ముఖ్యమంత్రి పవన్ తో సమావేశం కారణంగా సీఎం షెడ్యూల్ లో స్వల్ప మార్పు చోటుచేసుకుందని చెబుతున్నారు. ఉదయం 10.30 గంటల సమయంలో డిప్యూటీ సీఎం పవన్ ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. అనంతరం సుమారు రెండున్నర గంటల పాటు సీఎంతో చర్చించారు. సీఎం, డిప్యూటీ సీఎం భేటీపై రాజకీయ వర్గాల్లో విస్తృత చర్చ జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో టీటీడీ లడ్డూ ప్రసాదంపై రాజకీయ దుమారం కొనసాగుతోంది. కల్తీ నెయ్యి సరఫరాపై అధికార, విపక్షాల మధ్య వాదనలు సాగుతున్నాయి. లడ్డూ ప్రసాదంలో కల్తీపై సుప్రీంకోర్టు సూచనలతో సీబీఐ సిట్ విచారణ పూర్తి చేసింది. అయినప్పటికీ ప్రభుత్వం ఈ విషయంపై మరింత లోతుగా విచారణ జరిపించాలని విచారణ కమిషన్ వేయాలని నిర్ణయించింది. మంగళవారం కేబినెట్ భేటీలో ఈ నిర్ణయం తీసుకోగా, విచారణ కమిషన్ లో ఎవరు ఉంటారు? కమిషన్ తోపాటు సభ్యులుగా ఎవరినైనా నియమిస్తారా? కమిషన్ కు కాలపరిమితి ఎంత ఇస్తారు? అన్న విషయాలపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వలేదు. విశ్వసనీయ సమాచారం ప్రకారం, సీఎం, డిప్యూటీ సీఎం మధ్య ఈ అంశంపై చర్చ జరిగినట్లు ప్రచారం జరుగుతోంది. నిర్ణీత గడువు ప్రకారం విచారణ పూర్తి చేయించి నివేదిక తెప్పించుకోవాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ముఖ్య నేతలు ఇద్దరు నిర్ణయించినట్లు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా లడ్డూ వ్యవహారంలో రాజకీయ దాడిని మరింత ఉధృతం చేయాలనే అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్లు చెబుతున్నారు. అదే సమయంలో ప్రతిపక్షం ట్రాప్ లో పడకుండా అధికార పార్టీ నేతలు సంయమనంతో నడుచుకోవాలని కూడా చర్చ జరిగినట్లు చెబుతున్నారు. ఇక ఈ నెల 11న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, త్వరలో జరగబోయే రాజ్యసభ సభ్యుల ఎన్నికపైనా ఇద్దరు నేతల మధ్య చర్చ జరిగిందని చెబుతున్నారు. అదేవిధంగా పెండింగులో ఉన్న నామినేటెడ్ పదవులను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేయాలని డిప్యూటీ సీఎం పవన్ కోరినట్లు చెబుతున్నారు. మరోవైపు పదవుల భర్తీలో జనసేన కేడర్ కు అన్యాయం జరుగుతోందన్న విషయంపైనా చర్చ జరిగిందని, త్వరలో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీకి ఒక సీటు కేటాయించాలని పవన్ సీఎం చంద్రబాబుకు విన్నవించినట్లు చెబుతున్నారు.

# నైజీరియాలో ఘోరం.. 200 మంది ఊచకోత..

**విశ్వం వాయిస్ న్యూస్ :** నైజీరియాలో సాయుధమూక నరమేధం సృష్టించింది. రెండు గ్రామాల్లోని ప్రజలపై దాడులు చేసి.. 200 మందిని అతి దారుణంగా చంపేశారు. పలు ఇళ్లు, దుకాణాలను కూడా తగలబెట్టారు. క్వారా రాష్ట్రంలోని వోరో, నూక అనే రెండు గ్రామాల్లో ఈ దాడులు జరిగాయి. వోరో స్థానిక నాయకుడు సైదు బాబాఅహ్మద్ మాట్లాడుతూ.. ప్రజలను చుట్టుముట్టి, వారి చేతులను వెనక్కి కట్టి ఆ తర్వాత కాల్చి చంపేశారని తెలిపారు. దాడి సమయంలో కొంతమంది ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారని.. ప్రస్తుతం వారి ఆచూకీ తెలియడం లేదని వెల్లడించారు. తాజా ఘటనకు సంబంధించి స్థానిక మీడియాలో వీడియోలు ప్రసారమయ్యాయి. అందులో వీధుల్లో పెద్దఎత్తున మృతదేహాలు పడి ఉన్నట్లు కన్పించాయి. ఈ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమ్నెస్టి ఇంటర్నేషనల్ మానవ హక్కుల సంఘం ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. దుండగులు దాదాపు ఐదు నెలల నుంచి గ్రామస్థులకు హెచ్చరిక లేఖలు పంపుతున్నారని.. అయినా భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని మండిపడింది. ఇటీవల నైజీరియా సైన్యం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్లు నిర్వహించి 150 మందిని మట్టుబెట్టింది. ఈ సైనిక



చర్యకు ప్రతిస్పందనగానే తాజా దాడులు జరిగాయని క్వారా గవర్నర్ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. దీన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇదిలాఉండగా.. కాట్సినా రాష్ట్రంలో కూడా దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక పోలీసులు తెలిపారు.

# జిల్లా సర్వసభ్య సమావేశం

### - అవయవదానంపై అవగాహనా ర్యాలీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది.పి.ఎం పి అసోసియేషన్) పోలవరం జిల్లా ఆధ్వర్యంలో జిల్లా సర్వ సభ్యసమావేశం గురువారం జిల్లా కన్వీనర్ కే జగదీష్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నందు జగదీష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా తూర్పు గోదావరి జిల్లా అద్యక్షులు బళ్ళా శ్రీ నివాసరావు, జిల్లా కార్యదర్శి పీ దేవానంద్, కోశాధికారి పి.చిన్ని హాజరైనారు .ఈ సందర్భంగా తూర్పు గోదావరి జిల్లా అద్యక్షులు బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ అవయవదానం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహనతో ప్రజలకు అవగాహన కల్పించాలని ,జీవన దాన్,'అవయవదానం 'గురించి అవగాహన కల్పించారు,జీవన్ దాన్ యాప్ లో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా కార్యదర్శి పి దేవానంద్ మాట్లాడుతూ అవయవదానం ఎంతో గొప్పదని ,ప్రతి ఒక్కరూ అవయవదానం లో భాగస్వాములు కావాలి పిలుపునిచ్చారు.పీ చిన్ని మాట్లాడుతూ ఐకమత్యమే మహాబలంగా సాగుతున్న పీఎంపీ అసోసియేషన్ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. పోలవరం జిల్లా కన్వీనర్ కే జగదీష్ మాట్లాడుతూ అవయవ దాన్ లో అందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని 'అవయవదానం 'అనేది మన జీవితం ముగించినా,ఇతరులకు శాశ్వత మైన బహుమతిని అందించే గొప్ప అవకాశం అని ,తమ అంగీకారంతో జీవన్ దాన్ లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.అనంతరం పెద్ద ఎత్తున అవయవదానం పై ర్యాలీ నిర్వహించారు జాతీయ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విబిటి రాజు గారి సూచన ప్రకారం ప్రతి మండలం లో 'అవయవ దానం' పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించడమైనది. ఈ ర్యాలీ లో జిల్లా కో.కన్వీనర్ సిల్వెష్టర్, వెలమలకోట వెకటేశ్వరరావు, వెల్ఫేర్ కో.కన్వీనర్, సిహెచ్.రవికుమార్, సభ్యులు నాగబాబు, ఐ.గంగాధర్, కాసాని వెంకటేశ్వరరావు తదితర సబ్యులు పాల్గొని విజయవంతం చేశారు.

# విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోకవరం మండలం గుమ్మళ్ళదొడ్డి గ్రామం జిల్లా ప్రజ పరిషత్ ఉన్నత పాఠశాల నందు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్( ది పిఎంపి అసోసియేషన్) గోకవరం మండలం ఆధ్వర్యంలో గత జనవరిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో అవసరమైన విద్యార్థులకు గురువారం జిల్లా కోశాధికారి,మండల కన్వీనర్ పి చిన్ని సారధ్యంలో కళ్ళజోళ్ళ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీకిరణ్ కంటి ఆసుపత్రి వారి చే ముప్పై మందికి మందికి కళ్ళజోళ్ళ సమకూర్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు,రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి దేవానందం, జి వెంకటేష్, ఎస్ సూరిబాబు,కాసాని వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే.లక్ష్మీకాంతం,ఆసుపత్రి వీసీ కోఆర్డినేటర్ రమా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల హక్కుల పరిరక్షణలో ఆర్‌టిఐ కీలకం : కొమ్మోజు

### విజయవాడలో ఘనంగా ఫోరం రాష్ట్ర స్థాయి సమావేశం



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలో ఫోరం ఫర్ ఆర్టీఐ అండ్ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐ వేమేశ్వరి అధ్యక్షతన రాష్ట్రస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జాతీయ చైర్మన్ డా కొమ్మోజు రమేష్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.ఈ సందర్భంగా డా రమేష్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఒక వజ్రాయుధమని, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత,బాధ్యతాయుత పరిపాలన తీసుకురావడంలో ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. అవినీతి నిర్మూలన, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సేవలలో జవాబుదారీతనం పెంపొందించడానికి ప్రతి పౌరుడు ఆర్టీఐ చట్టాన్ని సమర్థంగా వినియోగించు కోవాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు ప్రజలు తమ హక్కులను సాధించుకోవడానికి ఈ చట్టం గొప్ప సాధనమని, యువత సామాజిక కార్యకర్తలు దీనిపై అవగాహన పెంచాలని పెంపొందించుకోవాలన్నారు.ఇటీవల అమెరికా లాస్ యాంజిల్స్ నుండి యునైటెడ్ ఫర్ హ్యూమన్ రైట్స్ సంస్థ పంపిన అధికారిక లేఖను సభ్యులందరికీ చూపించి,అంతర్జాతీయ స్థాయిలో కూడా మానవ హక్కుల పరిరక్షణలో మన సంస్థ చేస్తున్న సేవలకు గుర్తింపు లభించడం గర్వకారణమని తెలిపారు. అనంతరశీ విజయవాడ రాష్ట్ర కార్యాలయం వద్ద సమాచార హక్కు చట్టం హ్యాండ్బుక్‌ను ఆవిష్కరించి, సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్చార్జ్ పంగులూరు బుచ్చిబాబు, గుంటూరు ఇంచార్జ్ అస్సన్ వల్లి, ముఖ్య సలహాదారులు కె వెంకట వేణు, లీగల్ అడ్వైజర్ మేడా శ్రీనివాస్, ముఖ్య సభ్యులు ఎం వెంకటేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు, షేక్ అజారుద్దీన్, కె శ్రీకాంత్, నరసింహారావు, శశి తదితరులు పాల్గొన్నారు.

# నోరు జారొద్దు..

## అవసరమైతే ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు చూస్తాం.. తేల్చిచెప్పిన భారత్

**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా- భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఒప్పందానికి కొన్ని నెలల ముందు ఇరుదేశాలకు చెందిన నాయకుల మధ్య జరిగిన కీలక సమావేశానికి సంబంధించిన విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ట్రేడ్ డీల్ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి చూస్తామని నాడు భారత్ తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్లూమ్ బర్గ్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. కథనం ప్రకారం.. సెప్టెంబరు ప్రారంభంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియోల మధ్య సమావేశం జరిగింది. ఆ సమయంలో భారత ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై ట్రంప్, ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సహా పలువురు అధికారులు నోరు పారేసుకోవడం, టారిఫ్‌ల విషయంలో పలుమార్లు బెదిరింపులకు పాల్పడిన విషయం కూడా తెలిసిందే. నాడు జరిగిన భేటీలో భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసింది. 'ట్రంప్, ఆయన పరిపాలనాధికారుల బెదిరింపులకు భారత్ తలొగ్గదు. ట్రేడ్ డీల్ కోసం ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి ఉండటానికి కూడా సిద్ధంగా ఉన్నాం' అని డోభాల్ రూబియోతో చెప్పినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. దీంతోపాటు భారత్‌పై బహిరంగ విమర్శలు తగ్గిస్తే ఇరుదేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిలోకి వస్తాయని డోభాల్ స్పష్టం చేశారు. ఈ సమావేశం జరిగిన కొన్ని రోజులకే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ప్రధాని మోదీకి ట్రంప్ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆ సమయంలో ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ప్రశంసలు కురిపించారు. ఈ సమావేశం గురించి అమెరికా విదేశాంగ ప్రతినిధి మాట్లాడుతూ.. ప్రైవేటు చర్చల వివరాలు బయటకు వెల్లడించలేమన్నారు. ఇక, భారత్ దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.





వైసీపీ పాలన కాలంలో కల్తీ నెయ్యి రసాయనాలతో నిండి ఉందని

# సిట్ దర్యాప్తులో తేలింది : బండారు శ్రీనివాస్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల లడ్డు ప్రసాద కల్తీ నెయ్యి వ్యవహారంపై యాస్ ఐటి రిపోర్ట్ ప్రకారం వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డు తయారీలో కల్తీ నెయ్యి వాడకం నిజమే!.కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి పవిత్ర ప్రసాదం లడ్డూ తయారీలో వైసీపీ పాలన కాలంలో కల్తీ నెయ్యి రసాయనాలతో నిండి ఉందని సిట్ దర్యాప్తులో తేలింది.బండారు శ్రీనివాస్, జనసేన పార్టీ అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త మరియు కొత్తపేట నియోజకవర్గ ఇంఛార్జి.కల్తీ నెయ్యి వివాదం పై స్పందిస్తూ యాస్ ఐ టి కి నేషనల్ డెయిరీ డెవలప్మెంట్ బోర్డు రిపోర్ట్లో నెయ్యి పేరుతో పామాయిల్, పామ్ కర్నెల్ ఆయిల్, పామ్ స్టీరింగ్ లాంటి ద్రవాలుకు నెయ్యి రంగు, వాసన వచ్చే విధంగా కెమికల్స్ కలిపి సప్లై చేసినట్టు నివేదిక ఇస్తే వైసీపీ వాళ్ళు అసలు కల్తీనే జరగలేద స్వచ్ఛమైన నెయ్యిగా సిట్ రిపోర్ట్ ఇచ్చినట్టు విష ప్రచారం చేస్తున్నారు.సిట్ నివేదిక ప్రకారం గడిచిన 5ఏళ్లలో ఈ కల్తీ నెయ్యిని సుమారు 68లక్షల కిలోలు సప్లై చేసి భారీ స్కాం చేసి కోట్లు రూపాయలు అక్రమార్జన చేసినట్టు తెలుస్తుంటే వైసీపీ వాళ్ళు వితండవాదం చేస్తున్నారు. అసలు నెయ్యి సప్లై చేసే సామర్థ్యం లేని ఒక బోలె బాబా డెయిరీకి ఎటువంటి డెయిరీ పామ్స్ కానీ, నెయ్యిని సేకరించిన ఆధారం కానీ లేని కంపెనీ ఇంత నెయ్యిని ఈవిధంగా ఎలా సప్లై చేసిందో వైసీపీ నాయకులే చెప్పాలి అన్నారు. ప్రస్తుతం మార్కెట్లో స్వచ్ఛమైన నెయ్యి కిలో సుమారు వెయ్యి రూపాయలు ఉంటే వీరు 400-450 రూపాయలకు ఎలా కొనుగోలు చేశారు. అక్కడే తెలుస్తుంది ఇది కల్తీ నెయ్యి అని అన్నారు.ఈ కల్తీ నెయ్యి స్కాం దారి మళ్లించడం కోసం వై వి పి విశ్వ ప్రయత్నం చేస్తుంది. రకరకాల గొడవలు సృష్టిస్తుంది అన్నారు. దానిలో భాగమే ఈ అంబటి రాంబాబు వివాదం.అంబటి రాంబాబుని జగన్ కాపు నాయకుడుగా, కాపు టైగర్ అని సంబోధిస్తున్నారు. అతను ఏ విధంగా కాపు నాయకుడు అయ్యాడో, కాపు టైగర్ అయ్యాడో కొంచెం చెప్పాలి. ఏనాడు కూడా కాపుల కోసం చేసింది ఏమి లేదు. గత ప్రభుత్వంలో కాకినాడ నడిబొడ్డున ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కాపు మహిళలు మీద విచక్షణరహితంగా రాళ్ళుతోనూ, కర్రలతోనూ దాడి చేయిస్తే ఈ కాపునాయకుడు ఆ రోజు ఎక్కడ ఉన్నాడు? అలాగే కాపు ఐకాన్ మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనమ్మ ని దూషించినప్పుడు గుర్తుకు రాలేదా? పవన్ కళ్యాణ్ ని ఇంట్లో ఆడపిల్లలు మీద పసిపిల్లలు అనికూడా చూడకుండా సభ్యత, సంస్కారం లేకుండా నీచంగా మాట్లాడించినప్పుడు ఈ కాపు నాయకుడు ఎక్కడ ఉన్నాడు? ఈ రోజు అంబటి రాంబాబు మీద దాడి జరిగితే వాళ్ళ కుమార్తె వచ్చి దీని మీద పవన్ కళ్యాణ్ బాధ్యత తీసుకోవాలి అని చెప్పుతున్నారు. ఆ రోజు పవన్ కళ్యాణ్ ఇంట్లో ఆడవాళ్ల మీద మాటలతో దాడి చేసినప్పుడు దీనిని ఖండించాలి అని మీ నాన్న కి ఎందుకు హితవు పలకలేకపోయావమ్మ? అని ఎద్దేవా చేశారు.ఇలా కులాలు మధ్య, మతాలు మధ్య చిచ్చు పెట్టి రాజకీయం చేయడం వై సి పి లక్ష్యంగా పెట్టుకున్నట్టుంది. రాష్ట్ర స్థాయిలో జగన్ రెడ్డి, జిల్లా స్థాయిలో జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఈ విధమైన కులాలు, మతాలు మధ్య చిచ్చుపెట్టే రాజకీయం చేస్తున్నారు. ఈ పంథానే కొనసాగితే ఇప్పుడు వచ్చిన 11 సీట్లు కూడా మళ్ళీ వచ్చే పరిస్థితి వైసీపీకి లేదని, పూర్తిగా వైసీపీ కనుమరుగు అవుతుందని హెచ్చరించారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబాజీపేట మండలం మోసలపల్లి గ్రామం లో నిర్వహించిన పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం రైతుల పట్ల అత్యంత దారుణంగా వ్యవహరించిందని విమర్శించారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను తీసుకొచ్చి రైతులపై భారాన్ని మోపిందని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసి, రైతే రాజు అనే భావనతో రైతు సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. రైతుల కృషి వల్లనే రాష్ట్రం సస్యశ్యామలంగా ఉందని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందిస్తున్న పట్టాదార్ పాస్ పుస్తకాలు ప్రత్యేకతను సంతరించుకున్నాయని అన్నారు. రైతుకు సంబంధించిన వివరాలు పూర్తిగా, ఖచ్చితంగా ఉన్నప్పుడే రైతు ఆమోదంతోనే పట్టాదార్ పాస్ పుస్తకం జారీ అవుతుందని వివరించారు. గత ప్రభుత్వం నాయకుల ఫోటోలకు ప్రాముఖ్యత ఇస్తూ పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేసిందని, అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఎలాంటి నాయకుల ఫోటోలు లేకుండా కేవలం రాజముద్రతోనే పట్టాదార్ పాస్ పుస్తకాలు జారీ చేస్తున్నామని తెలిపారు. ఇది కూటమి ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిబద్ధతతో, పారదర్శకంగా పనిచేస్తోందనడానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అమరావతి బయలుదేరిన నీటి సంఘాలు నాయకులు



**కాత్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాత్రేనికోన మండలం నుండి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం మధ్యాహ్నం అమరావతిలో నీటి సంఘాల నాయకులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ మేరకు అందిన ఆహ్వానంతో కాత్రేనికోన మండలంలోని నీటి సంఘాల అధ్యక్షులు ఈ సమావేశానికి బయలుదేరి వెళ్లారు. కాత్రేనికోన మండలం డిసి చైర్మన్ ఆకాశం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వాసంశెట్టి రాజేశ్వరరావు, బండారు ఏసు, ఇసుకపట్ల వెంకటరమణ, రంగరాజు మొదలైన వారు తరలి వెళ్లారు.

# శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రసాదం పవిత్రతను కాపాడవలసిన బాధ్యత మనందరిది



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇది రాజకీయ సమస్య కాదు దేశవ్యాప్తంగా కోటాను కోట్ల మంది స్వామి వారి భక్తులకు సంబంధించిన అంశం,ప్రసాదంలో నెయ్యి రూపంలో జంతు కొవ్వు కలిసిందా నెయ్యిని కల్తీ చేసారా అనే దానికన్నా ముందు ప్రసాదంలో ఆవు పాలు నుండి తీసిన నెయ్యి కలిపారా లేదా అనేది ప్రశ్న,తిరుపతి లడ్డూ ప్రసాదంలో శనగపిండి, చక్కెర, ఆవు నెయ్యి, యాలకులు, జీడిపప్పు, పంచదార మిఠాయి, ఎండుద్రాక్ష, పచ్చకర్పూరం ఉపయోగిస్తారు. పూర్వం నుంచి ఇదే పద్దతిలో స్వామి వారి ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేస్తారు. వైసీపీ ప్రభుత్వంలో ఆవు నెయ్యి రేటు ఇచ్చి మరీ సింథటిక్ ఆయిల్ కొనడం,ఆవునెయ్యి బదులు పామాయిల్ ఎందుకు కలపాల్సి వచ్చింది ముందుగా చెప్పాలి ఇంత వికృతమైన ఆలోచన ఎవరిది.?

పాత్రదారి ఎవరు..? సూత్రధారి ఎవరు?

## జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు ముత్యాల బాబ్జి

2022లో కల్తీ విషయం తెలిసినా ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదు?బ్లాక్ లిస్టులో పెట్టిన డెయిరీని చివరిదాకా ఎందుకు కొనసాగించారు.?అన్ని సంవత్సరాలు నిరాటంకంగా పామాయిల్ కల్తీ జరుగుతుంటే ఎందుకు అడ్డుకోలేదు? కేవలం డబ్బుకోసమే చేసారా.? ఇది 240 కోట్లు కుంభకోణం మాత్రమే కాదు 32 మంది నిందితులకు చెందిన విషయం కాదు.స్వామివారి భక్తుల మనోభావాలపై దాడి? భక్తులు అంటే చులకన, వారి విశ్వాసాలు, నమ్మకాలు పట్ల ఎటువంటి గౌరవ మర్యాదలు లేనివారు.దైవం పట్ల ఎటువంటి భయభక్తులు లేని వారు చేసిన అపచారం ఇది. తెలియకుండా జరిగిన విషయం కాదు తెలిసి చేసిన మహాపచారం! కేవలం 2019 నుంచే మొదలైంది. ఈ కల్తీ వల్ల లడ్డూ రుచి, నాణ్యత దెబ్బతిన్నాయి. ల్యాబ్ రిపోర్టులు మేనేజ్ చేసి, తక్కువ ధరకు టెండర్లు ద్వారా జరిగింది.కల్తీ చేయడానికి నిబంధనలు మార్చారు అన్నది వాస్తవం వైసీపీ నేతలు ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకోవాలి. స్వామివారి ముందు చెంపలు వాయించుకోవాలి. చట్టప్రకారం శిక్షలు అనుభవించాలని ముత్యాల బాబ్జి జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

# కార్యకర్తల అభిప్రాయానికి పెద్దపీట



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల నెల గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ సమావేశాలు జరుగుతాయని మండల టిడిపి అధ్యక్షుడు గనిశెట్టి వీరేష్ అన్నారు. కొత్తపేట మండలం మోడేకుర్రు గ్రామ పార్టీ సమావేశం గ్రామ పార్టీ అధ్యక్షుడు గొలకోటి సత్తిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వీరేష్ మాట్లాడుతూ కార్యకర్తల అభిప్రాయం మేరకు గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలు జరుగుతాయి అన్నారు కార్యకర్తల సూచనలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా మీడియా కన్వీనర్ రెడ్డి శ్రీనివాస్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కడలి భీమేశ్వరరావు, క్లస్టర్ ఇంచార్జ్ బూసి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల నివారణే లక్ష్యంగా

# జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్ష



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లాలో రహదారి భద్రతా ప్రమాణాలను మరింత బలోపేతం చేసి, రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమీక్ష సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, ఐఏఎస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత సంవత్సరం 2024తో పోలిస్తే 2025 సంవత్సరంలో జిల్లాలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రమాదాల నివారణ కోసం చేపట్టిన చర్యలు ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంచేందుకు ట్రాఫిక్ నిబంధనలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐపిఎస్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, జరిమానాలు విధిస్తూ రికవరీ చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో తక్షణ రక్షణ చర్యలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రోడ్డు భద్రతపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై వెలుతురు సదుపాయాలను మెరుగుపరచాలని, పాదచారుల వంతెనలపై అడ్డుగా ఉన్న ఫ్లెక్సీ బ్యానర్లను తొలగించాలని ఆదేశించారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాల అమలు నివేదికలను పరిశీలించాలని తెలిపారు. అదేవిధంగా రోడ్డు మలుపుల వద్ద రాత్రి సమయంలో వాహనదారులకు స్పష్టమైన దృశ్యమానత కల్పించేందుకు ప్రతిబింబించే కళ్లద్దాలుగా పనిచేసే క్యాట్ ఐస్ ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. ఇవి రోడ్డు ప్రమాదాల నివారణలో కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా అధికారి, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, రహదారులు భవనాల శాఖ, జాతీయ రహదారి ప్రాధికార సంస్థతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

డోర్ టు డోర్ చెత్త సేకరణపై

# నూటికి నూరు శాతం సంతృప్తి సాధించాలి




**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామ పంచాయతీల్లో ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవిఆర్ఎస్) ద్వారా ప్రజల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచి ప్రజా సంతృప్తి స్థాయిలను పెంచడంతో పాటు, ఇండ్ల పన్నులు, నీటి కుళాయి పన్నుల వసూలు ద్వారా గ్రామ పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ఉప కమిషనర్ వి. నాగార్జున సాగర్ గ్రామ కార్యదర్శులకు పిలుపునిచ్చారు. గురువారం అమలాపురంలోని గోదావరి భవన్‌లో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పన్నుల వసూలు, పారిశుద్ధ్యం, ప్రజా సంతృప్తి స్థాయిలపై సిబ్బందికి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా ఇంటింటి చెత్త సేకరణపై ఐవిఆర్ఎస్ ద్వారా నూటికి నూరు శాతం సంతృప్తి స్థాయిలు సాధించాలన్నారు. చెత్త నిల్వలను తొలగించే చర్యలను సమాంతరంగా చేపట్టాలని, వరదలకు అవకాశం ఉన్న ప్రాంతాల్లో డ్రెయిన్ల డీ-సిల్టింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో రోజువారీ చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. ఐవిఆర్ఎస్ సర్వేల ద్వారా వస్తున్న ప్రజాభిప్రాయాలను మెరుగుపరచడంలో క్లాప్ మిత్రులు, పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఇండ్ల పన్నులు సక్రమంగా విధించి వసూలు చర్యలను వేగవంతం చేయడం ద్వారా గ్రామ పంచాయతీల ఆర్థిక స్థిరత్వానికి తోడ్పడాలని పేర్కొన్నారు. ఇండ్ల పన్ను, నీటి ఛార్జీల వసూలుకు మొబైల్ యూనిట్లు, డిజిటల్ అనువర్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రజా గృహాల ఫిర్యాదు పరిష్కార వ్యవస్థ (పీ.జి.ఆర్.ఎస్) ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడంతో పాటు, తిరిగి ఫిర్యాదులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ తనిఖీలు, పారిశుద్ధ్య సిబ్బంది మార్గాల సమీకరణ వంటి మానిటరింగ్ ప్రక్రియల ద్వారా సంతృప్తి స్థాయిలను పెంచాలని సూచించారు. గ్రామ సచివాలయాలపై పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి మాట్లాడుతూ, ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. దీని ద్వారా పథకాలు, పౌర సేవలపై ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం నేరుగా సేకరిస్తోందన్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్త సేకరణ, పారిశుద్ధ్యంపై అసంతృప్తి ఎక్కువగా ఉన్నట్లు ఫీడ్‌బ్యాక్‌లో వెల్లడైందని, దీనిపై క్షేత్రస్థాయి సిబ్బంది ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. గ్రామ పంచాయతీల్లో వర్మీ కంపోస్ట్ యూనిట్లు, డ్రై డేలు, ట్రైసైకిళ్ల ద్వారా చెత్త సేకరణ విధానాలను ప్రోత్సహించాలని, ఐవిఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పారిశుద్ధ్యం, పన్నుల వసూలు వంటి సేవలపై నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# మాదిగల విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

## అమలాపురంలో కరపత్రం విడుదల - ఎమ్మార్పీఎస్ సమీక్ష సమావేశం



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫిబ్రవరి 25న అమలాపురంలో నిర్వహించనున్న మాదిగల విజయోత్సవ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ కరపత్రం విడుదల కార్యక్రమం, అమలాపురం నియోజకవర్గ ఎంఆర్పీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం అమలాపురం నియోజకవర్గ ఎంఆర్పీఎస్ ఇన్‌చార్జి ఆకుమర్తి రమేష్ అధ్యక్షత జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లాల ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి డాన్ సూరి మాదిగ హాజరై మాట్లాడారు. వారు మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల పేరుతో జిల్లాలోని అన్ని రాజకీయ పార్టీలు మాదిగలను కేవలం ఓటర్లుగానే చూస్తున్నాయని, కానీ వార్డు మెంబర్ స్థాయి నుంచి జిల్లా పరిషత్ సభ్యులు, జడ్పీటీసీ, ఎమ్మెల్యే, ఎంపీ వంటి పదవుల్లో మాదిగలకు తగిన రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదిగల రాజకీయ భవిష్యత్తుపై అన్ని పార్టీలు దృష్టి సారించేలా ఈ విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. సభా వేదిక నుంచి మాదిగల రాజకీయ హక్కులపై గళం విప్పేందుకు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా మాదిగ మహాకూటమి జేఏసీ నాయకులు ఆకుమర్తి ఆశీర్వాదం మాదిగ, గంపల సత్యప్రసాద్ మాదిగ, చుట్టుకొల కిషోర్ మాదిగ, రాష్ట్ర హెచ్‌ఆర్డీ సభ్యులు నేదునూరి వీర్రాజు మాదిగ, అమలాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు నేదునూరి నతనీయులు మాదిగ పాల్గొన్నారు. అలాగే జిల్లా ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుమర్తి మోహన్ మాదిగ, అమలాపురం రూరల్ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు చుట్టుగుల్ల సత్తిబాబు మాదిగ, ఉప్పలగుప్తం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సత్తాల దుర్గారావు మాదిగ, జిల్లా ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు కొమర రాఘవ మాదిగ, జిల్లా ఎమ్మార్పీఎస్ కోశాధికారి కందవెల్లి ఏలియా మాదిగ పాల్గొన్నారు. అల్లవరం మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు యార్లగడ్డ రామకృష్ణ మాదిగ, అమలాపురం టౌన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు గంపల విజయ మాదిగ, ఎమ్మార్పీఎస్ మహిళా నాయకురాలు పెదపూడి రుక్మిణి మాదిగ, గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు చేట్ల రామారావు మాదిగ, అమలాపురం టీడీపీ నాయకులు నూటికి చిన్న మాదిగ, దండోరా సీనియర్ నాయకులు నూటికి మూర్తి మాదిగ, మిరియాల అశోక్ మాదిగ పాల్గొన్నారు. ఇంకా అంబాజీపేట మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు తత్రముడి గోవింద మాదిగ, నేదునూరి లక్ష్మణరావు మాదిగ, నామాడి నాగరాజు మాదిగ, మల్లవరపు సత్తిబాబు మాదిగ, నవ్వుండు నాగరాజు మాదిగ, ఈతకోట నాగరాజు మాదిగ, చేట్ల రవి మాదిగ, ముమ్మిడివరపు సోమేశ్ మాదిగ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### జిల్లాలో 100 రోజుల ప్రణాళికను

# పకడ్బందీగా అమలు చేయాలి

**సి,డి గ్రేడు వచ్చిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు లక్ష్యంగా కృషి చేయాలి : జిల్లా కలెక్టర్ షణ్మోహన్**



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలను సాధించేందుకు జిల్లాలో 100 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశం మందిరంలో జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశానికి జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులు నిర్వహించిన జీఎఫ్ఎల్ఎన్ విద్యార్థులు ప్రగతి, పదో తరగతి కార్యాచరణ ప్రణాళిక, వెనుకబడిన విద్యార్థులను మెరుగు పరిచేందుకు తీసుకుంటున్న చర్యలను ఎంఈవో, హెచ్ఎం, క్లస్టర్ ఇన్చార్జులతో ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసే చర్యలు భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకటించిందన్నారు. గత ఏడాది డిసెంబరు 06 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం మార్చి 15 వరకు జరుగుతుందన్నారు. ఈ 100 ప్రణాళికలో భాగంగా సబ్జెక్టుల వారీగా సిలబస్ పూర్తి చేసి, ప్రతిరోజు స్లిప్ టెస్ట్ నిర్వహించడం ద్వారా వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుందన్నారు. సి,డిగ్రేడు వచ్చిన విద్యార్థులపైన ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు. మార్చి 16 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో విద్యార్థుల ఉత్తీర్ణతా శాతాన్ని మెరుగుపరిచేందుకు జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలలోని 100 రోజుల ప్రణాళికను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల ఎంఈవోలు, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సమిష్టిగా పనిచేసి నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఇందుకు సబ్జెక్టుల వారిగా లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఆయన సూచించారు. 1-5 తరగతులు చదువుతున్న విద్యార్థులందరు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న జీఎఫ్ఎల్ఎన్ పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి. రమేష్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వంద రోజుల ప్రణాళిక భవిష్యత్తులో మంచి ఫలితాలు సాధనకు ప్రయోజనకరంగా మారుతుందన్నారు. ఈ వందరోజుల ప్రణాళిక ద్వారా ప్రధానంగా వెనుకబడిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులతో ఉపాధ్యాయులు ఎక్కువ సమయం గడపడం ద్వారా వారిలో ఏకాగ్రత పెంచడంతోపాటు మానసిక స్థైర్యాన్ని పెంచేందుకు దోహదపడుతుందన్నారు. దీని ద్వారా విద్యార్థుల మార్కుల్లో గణనీయంగా మార్పు కనిపిస్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో కాకినాడ, పెద్దాపురం డీవైఈవోలు కెవివి.సత్యనారాయణ, శర్మ, డీసీఈజీ ఎం.వెంకటరావు, ఏసీ రమణి, ఏడి శ్రీరాం అన్ని మండలాల ఎంఈవోలు, హెచ్ఎంలు, క్లస్టర్ హెడ్ లు తదితరులు పాల్గొన్నారు

### ప్రజాసేవకు గొల్లప్రోలు జనసేన పునరంకితానికి

# జ్యోతుల శ్రీనివాస్ పిలుపు



**గొల్లప్రోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ కమిటీల ఎన్నికలు అనంతరం పార్టీ శ్రేణులు అంతా ఏకమై తిరిగి ప్రజా సేవకు పునరంకితం కావాలని గొల్లప్రోలు మండల జనసేనపార్టీ తాజా అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాసు పిలుపును ఇచ్చారు. పార్టీ సంస్థాగత ఎన్నికలు సజావుగా ముగిసాయని, మళ్ళీ మనమందరం కలిసి ఒక కుటుంబంగా జనసేన పార్టీ అధ్యక్షులు, పిఠాపురం నియోజకవర్గ శాసన సభ్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వర్యులు పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జనసేన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకుల నాయకత్వంలో గొల్లప్రోలు మండల పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మన జనసేన పార్టీ వివిధ శ్రేణులు, సీనియర్ నాయకులు, జన సైనికులు నిస్వార్థ సేవలను, సహాయ సహకారాలు అందించాలని శ్రీనివాస్ కోరారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం జనసేన పార్టీ తాజా అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్ నేతృత్వంలో మండల పార్టీ శ్రేణులు అంతా కలసి మాజీ అధ్యక్షులు అమరాది వల్లీని తాటిపర్తిలోని ఆయన స్వగృహానికి గురువారం వెళ్ళి మర్యాద పూర్వకంగా కలిశారు. అమరాది వల్లీ ఇచ్చిన ప్రేమ పూర్వక తేనీటి విందును స్వీకరించారు. అనంతరం అక్కడే మండల పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభికులను ఉద్దేశించి తాజా అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్ ప్రసంగించారు. జనసేన పార్టీలోని సీనియర్ జనసేన నాయకులు, జన సైనికులు, జనసేన కార్యకర్తలు, వీర మహిళలు, ప్రజలు అందరూ నాకు పూర్తి మద్దతు ఇచ్చి నన్ను మండల జనసేన పార్టీ అధ్యక్షునిగా అఖండ ఆధిక్యంతో గెలిపించి నందుకు చాలా సంతోషంగా ఉన్నదని తెలిపారు. అందుకు పార్టీలోని అందరికీ సర్వదా కృతజ్ఞుడను అంటూ జ్యోతుల శ్రీనివాస్ సభికులకు ధన్యవాదాలు తెలిపారు. రాజకీయ పార్టీల్లో పదవులను చేపట్టడం, త్యాగం చేయడం అంతా సర్వ సాధారణంగా జరిగేవేనని, జనసేన కమిటీల అంతర్గత ఎన్నికలు, కమిటీల కూర్పు ప్రక్రియ అంతా సజావుగా ముగిసిన నేపథ్యంలో ఇకపై మళ్లీ మండల ప్రజలకు పార్టీ సేవలను అందించడానికి యధావిధిగా పునరంకితం అవుదామని సభికుల హర్షధ్వానాల మధ్య మండల పార్టీ తాజా అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్ పిలుపును ఇచ్చారు. తాజా అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాసుకు శాలువాలను కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భవిరిశెట్టి రాంబాబు, పినకా వెంకట్రావు, మండలం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పాలశెట్టి తమ్మారావు, రాష్ట్ర సగర కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా జనసేన కార్యదర్శి మొగిలి అప్పారావు, చెందుర్తి గ్రామ జనసేనపార్టీ అధ్యక్షులు సూర్నీడి శ్రీను, పి.జగ్గంపేట జనసేన పార్టీ అధ్యక్షులు నక్కా అప్పారావు, తాటిపర్తి జనసేన పార్టీ సినీయర్ నాయకులు గొల్లపల్లి వీరబాబు, సరిపల్లి వెంకటరమణ, విసరపు శ్రీనివాసు, గారపాటి శివ, కుంపట్ల శ్రీను, స్వామినీడి దొరబాబు, పంతం విష్ణు, అడపా నూకరాజు, సాదా వీరబాబు తదితరులు ఉన్నారు.

### దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా

# కేంద్ర బడ్జెట్ ఆశాజనకంగా ఉంది : బీజేపీ నేతలు



**కాకినాడసిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశం అనేక అవాంతరాలను ఎదుర్కొని సంక్షోభంలో ఉన్నా 2026బి 27 సంవత్సరానికి కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దేశ బడ్జెట్ ఆశాజనకంగా ఉందని బీజేపీ నేతలు వెల్లడించారు. దేశంలోని కీలక రంగాలకు అత్యధిక శాతం నిధులు కేటాయించిందని వారు వెల్లడించారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ గురించి గురువారం కాకినాడలోని స్థానికంగా ఉన్న ఓ హాలులో బీజేపీ నేతలు విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బడ్జెట్ పైన అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి మాట్లాడుతూ గత ఏడాది ఐటీ వసూలు తగ్గడం, జీఎస్టీ తగ్గింపు వల్ల కేంద్రంలోని ప్రభుత్వం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొందన్నారు. వాటి అంతటిని సరిచేస్తూ కేంద్ర బడ్జెట్ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టడం ఎంతో ఆశాజనకంగా ఉంటుందని నల్లమిల్లి హర్షం వ్యక్తం చేశారు. 53 లక్షల 47 వేల కోట్లకు పైగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టగా దీనిలో రక్షణ శాఖకు 2 రెండు లక్షల 55 వేల కోట్లు, రవాణా శాఖకు 5 లక్షల 98 వేల కోట్లు, రైల్వే రెండు లక్షల ఎనిమిది వేల కోట్లు, పర్యావరణానికి ఐదు లక్షల 165 కోట్లు, వ్యవసాయ రంగానికి 1 కోటీ 53 లక్షల కోట్ల రూపాయలు, వీజీ రాంజి (ఉపాధి హామీ) పథకానికి 92 వేల కోట్లు కాటాయింపులు చేసింది చెప్పారు. ఐటీ రంగ అభివృద్ధికి ఆయా కంపెనీలకు 2047 వరకు పన్ను రాయితీని కల్పించినట్లు చెప్పారు. దేశీయ ఉత్పత్తులైన ఖాదీ, చేనేతకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లు రామకృష్ణారెడ్డి చెప్పారు. ఈ బడ్జెట్ దేశ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని నల్లమిల్లి వివరించారు. ఈ సమావేశంలో బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, బీజేపీ నాయకులు యెనిమిరెడ్డి మాల కొండయ్య, గట్టి సత్యనారాయణ, కుండల సాయికుమార్, గోడి సత్యవతి, పెండెం శ్రీదేవి దువ్వూరి సుబ్రహ్మణ్యం, యార్లగడ్డ రామ్ కుమార్, చక్క రమేష్, గోడి వెంకట్, అపర్ణ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నేడే రత్నగిరిపై కోటి తులసిపత్రి పూజ ప్రారంభం



**అన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని రత్నగిరిపై వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో మాఘ బహుళ పంచమి శుక్రవారము ఉదయం 7.30 గంటలకు కోటి తులసి పత్రి పూజను ప్రారంభించడానికి ఆలయం పాలనా యంత్రాంగం అన్ని ఏర్పాట్లనూ సంపూర్ణం చేసింది. నేటి నుంచి ఇదే మాసం 15 వ తేదీ మాఘ బహుళ త్రయోదశి, ఆదివారం వరకు ప్రతీ రోజూ నిరవధికంగా ఈ కోటి తులసి పత్రి పూజను నిర్వహిస్తారు. ప్రతీ రోజూ గణపతిపూజ, పుణ్యాహ వచనం, ఋత్విగ్వరుణలు, మంటపారాధన, కలశస్థాపనతో 60 మందికి ఋత్వికులతో సదరు కోటి తులసి పత్రి పూజ నందు ప్రతి రోజూ ఉదయం లింగార్చన, సూర్య నమస్కారాలు, వేదపారాయణలను నిర్వహిస్తారు. ప్రతి రోజూ 8 నుండి 11.30ల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుండి 5.30 గంటల వరకు నిర్వహిస్తారు. అనంతరం రాత్రి 7 గంటలకు నుండి మహా నివేదన, నీరాజన మంత్ర పుష్పములు, కైవారములు, చతుర్వేద స్వస్తి, ప్రసాద వితరణ కోటి తులసి పూజ జరుగు ప్రదేశంలో జరుగుతాయి. అందువల్ల ఆసక్తి గల భక్తులు, గ్రామస్తులు శ్రీ స్వామి వారి సన్నిధిలో నిర్వహించు ఈ మహోత్తర కార్యక్రమమైన కోటి తులసి పత్రి పూజ కార్యక్రమాల్లో విరివిగా పాల్గొని శ్రీ స్వామి వారి ఆశీస్సులకు పాత్రులు కావాలని దేవస్థానం కార్యనిర్వహక యంత్రాంగం ఒక ప్రకటనలో కోరింది.

### బ్రహ్మకుమారీల బోధనలు

# భగవత్ గీత ఆధారంగానే ఉంటాయి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రహ్మకుమారిల బోధనలు శ్రీకృష్ణుడు రాసిన భగవద్గీత ఆధారంగానే ఉంటాయని వాటిలో ఉన్న జీవన విధానం, జీవిత పరివర్తన వంటి సారాంశాలను వివరిస్తామని ప్రజాపిత బ్రహ్మకుమారి ఐశ్వర్య విశ్వవిద్యాలయ గోదావరి జోన్ ఇంచార్జ్ రజినీ దీదీ పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన కాకినాడలోని జెఎన్టియు క్యాంపస్లో సాయంత్రం 6 గంటల నుండి సంబంధాలలో సఖ్యతకు తాళం చెవి అనే పేరుతో ఇంటర్నేషనల్ బ్రహ్మకుమారీస్ మోటివేషనల్ స్పీకర్ సిస్టర్ బికే శివాని బోధన చేస్తారని చెప్పారు. ఈ శివాని కార్యక్రమానికి సంబంధించి వివరాలను రజినీ గురువారం కాకినాడ సర్పవరం సెంటర్లో ఉన్న బ్రహ్మకుమారి కార్యాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రజనీ మాట్లాడుతూ ప్రజల మానసిక ఆరోగ్యం ఆధ్యాత్మిక వికాస లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ సంబంధాలలో ఎదురయ్యే సమస్యలు వాటి ఆధ్యాత్మిక పరిష్కారాలు, మానసిక ప్రశాంతతను ఎలా సాధించాలన్న అంశాలను శివాని స్పష్టంగా వివరిస్తారని తెలిపారు. శివాని గత 27 ఏళ్లుగా రాజయోగ ధ్యానం, ఆత్మ వికాసంపై ప్రసంగాలు చేస్తూ కోట్లాదిమందికి మార్గదర్శకంగా నిలిచారన్నారు. ఆమె 2019లో రాష్ట్రపతి చేతుల మీదుగా నారీశక్తి పురస్కారం అవార్డును అందుకున్నట్లు రజనీ చెప్పారు. ఏడవ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని మానసిక ప్రశాంతతను పొందాలని కోరారు. ఈ సమావేశంలో వైద్యులు కళ్యాణ్ చక్రవర్తి, రాజీవ్ నందన్ రాయ్, లక్ష్మీ సిస్టర్ తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ సభ్యులు సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** లయన్స్ క్లబ్ సభ్యులు వారు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆయా క్లబ్బులలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని లయన్స్ జిల్లా గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు అన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరిలో గవర్నర్ల సన్మానించే కార్యక్రమాన్ని వారు గురువారం కాకినాడలోని లయన్స్ క్లబ్ హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న 19 క్లబ్బుల సభ్యులను ఉద్దేశించి కోటేశ్వరరావు మాట్లాడారు. లయన్స్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దానిని ప్రతి ఒక్కరు విధిగా అమలు చేసి క్లబ్ ప్రతిష్టను పెంచాలని సూచించారు. కాకినాడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సీమకుర్తి పాపారావు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ బాదం బాలకృష్ణ కుసుమ, ఇవివి ఈశ్వర్ కుమార్ మంగాదేవి దంపతులను, ముంజులూరి ఈశ్వరరావు తదితరులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, పెద్దిరెడ్డి ఉమామహేశ్వరరావు, లయన్స్ క్లబ్ కార్యదర్శి కొమ్మిశెట్టి కుమార్, ప్రాజెక్ట్ చైర్మన్లు డి రామ సుబ్రహ్మణ్యం, ఎంవిఆర్ మోహన్ కుమార్, జడ్జీలు గంటి భాస్కరరావు, ఎమ్మెస్సార్వి సత్యనారాయణ, 19 క్లబ్బుల అధ్యక్షులు, తదితర లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

### డివిజన్ పర్యటనలతో

# సమస్యలకు తక్షణ పరిష్కారం

**నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ**



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ నగరంలో నెలకొన్న ప్రజా సమస్యలను నేరుగా పరిశీలించి వేగంగా పరిష్కరించేందుకు డివిజన్ స్థాయి పర్యటనలు ఎంతో ఉపకరిస్తాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ అన్నారు. గురువారం ఉదయం ఆయన కాకినాడ నగరంలోని రెవెన్యూ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని పార్క్ను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను స్థానికులు, మాజీ కార్పొరేటర్ వమ్మి బాలాజీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం డివిజన్లో త్రాగునీటి సాంద్రతను స్వయంగా పరిశీలించిన కమిషనర్, నీటి నాణ్యత వివరాలను అక్కడి ప్రజలకు వివరించారు. అలాగే డివిజన్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లిను సందర్శించి, పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంతో వెంటనే శుభ్రత చర్యలు చేపట్టాలని హెల్త్ ఆఫీసర్కు ఆదేశాలు జారీ చేశారు.ఇటీవల కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సచివాలయాన్ని కూడా ఆయన పరిశీలించి, అక్కడి సమస్యలను సచివాలయ అడ్మిన్ ద్వారా తెలుసుకున్నారు. డైరీ ఫార్మ్ ప్రధాన రహదారిపై పశువులను కట్టడం వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గమనించిన కమిషనర్, సంబంధిత పశు యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్డుపై పశువులను కట్టితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం డైరీ ఫార్మ్ సెంటర్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్ను సందర్శించి, అక్కడ అల్పాహారం స్వీకరిస్తున్న ప్రజలను పలకరించారు. క్యాంటీన్లో అందుతున్న సేవలపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ "ప్రతిరోజూ డివిజన్ పర్యటనల ద్వారా పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి నాణ్యత, అన్న క్యాంటీన్ సేవలను నేరుగా పర్యవేక్షించి ప్రజా సమస్యలకు వేగంగా పరిష్కారం చూపుతాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్, శానిటేషన్ సూపర్వైజర్ రాంబాబు, ఇంజనీరింగ్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పవర్ లిఫ్టర్‌లో

# మూడు పసిడి పతకాలు

### శ్రీనివాసరావును సత్కరించిన జిల్లా కలెక్టర్



**కాకినాడ కలెక్టరేట్, విశ్వం వాయిస్ న్యూస్ :** జాతీయస్థాయిలో మరో 3 బంగారు పతకాలు సాధించిన పవర్ లిఫ్టర్ ఎం. శ్రీనివాసరావు కు జిల్లా కలెక్టర్ సగిలి షాన్మోహన్ సత్కరించి అభినందించారు మరింత మంచి పేరు తేవాలని సూచించారు..ఈ నెలల 17, 18 తేదీలలో హర్యానా (శానిపాట్) లో జరిగిన జాతీయస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో బెంచ్ ప్రెస్, బ్యాక్ స్కిట్, డెడ్ లిఫ్ట్ విభాగాలలో... మరో 3 బంగారు పతకాలు సాధించి, ఇప్పటివరకు రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 97 పతకాలు సాధించిన కాకినాడ డిపో ఆర్టీసీ డ్రైవర్ మందపల్లి శ్రీనివాసరావు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. వివిధ రాష్ట్రాలనుండి సుమారు 400 మంది క్రీడాకారులు పాల్గొనగా వారందరి లోనూఆంధ్రప్రదేశ్ కాకినాడ కాకినాడ జిల్లా కు చెందిన మన సోదరుడు 3 విభాగాలలో వరల్డ్ వైడ్ పవరలిఫ్టింగ్ పోటీలకు ఎంపికై, అక్టోబర్ లో పోలాండ్ లో జరిగే అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు, ఎంపికకు సెలెక్ట్ అయ్యారని తెలిపారు.

# మేరా యువ భారత్ యువజన క్లబ్‌ల నుండి దరఖాస్తుల స్వీకరణ

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మేరా యువ భారత్ తూర్పు గోదావరి జిల్లా (గతంలో నెహ్రూ యువ కేంద్రం),భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ 2025-26 సంవత్సరానికి క్రీడా సామగ్రి పంపిణీ కోసం తూర్పు గోదావరి జిల్లాలోని యువజన క్లబ్‌ల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల యువజన క్లబ్‌లు 18-02-2026న లేదా అంతకు ముందు ఎం వై బి కార్యాలయానికి వచ్చి స్పోర్ట్స్ కిట్‌ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తులను సమర్పించడానికి ఎం వై బి కాకినాడ చిరునామా ఈ క్రింది విధంగా ఉంది. ఫస్ట్ ఫ్లోర్ , సెట్ రెజ్ బిల్డింగ్ ప్లాట్ నెంబర్-1, ఇండస్ట్రియల్ ఎస్టేట్, రమణయ్య పేట,కాకినాడ, ఆంధ్రప్రదేశ్ పిన్:533005, ఆఫీస్ ల్యాండ్‌లైన్ నెం.08842945234, మరిన్ని వివరాల కోసం దయచేసి కాకినాడ లోని మేరా యువ భారత్ జిల్లా యువజన అధికారి టి గోపాల్ ను సంప్రదించండి.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

శుక్రవారం, 06 ఫిబ్రవరి 2026
www.viswamvoice.com





# భక్తుల భద్రతకు, సదుపాయాలకు ప్రాధాన్యం

- మహా శివరాత్రి ఏర్పాట్లపై సమన్వయ శాఖలతో సమీక్ష సమావేశం - గుర్తించిన ఘాట్లలో మాత్రమే పుణ్యస్నానాలకు అనుమతి
- ఘాట్ మేనేజ్‌మెంట్, ఈతగాళ్లు, బోట్లు, ఎస్డీఆర్ఎఫ్ బృందం - ట్రాఫిక్ రద్దీ కంట్రోల్‌పై కఠిన చర్యలు
- అనుమతులు లేకుండా టెంట్లు, అన్నదానం నిషేధం - భద్రత, అత్యవసర సేవలు, సమన్వయ వ్యవస్థ

జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి - ఎస్పీ డి.నరసింహ కిషోర్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహా శివరాత్రి సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి అధ్యక్షతన సమన్వయ శాఖల అధికారులతో కలెక్టరేట్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్, మునిసిపల్ కమిషనర్ రాహుల్ మీనా, రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, వైద్య, అగ్నిమాపక, ఎండౌమెంట్, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ఈనెల 15న జరిగే మహా శివరాత్రి సందర్భంగా లక్షలాది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో భక్తుల భద్రత, సౌకర్యాలే ప్రధాన లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ల పరిధిలో గుర్తించిన ప్రధాన ఘాట్లలో మాత్రమే పుణ్యస్నానాలకు అనుమతి ఇవ్వాలని, అనధికార ఘాట్ల వద్ద భక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని కలెక్టర్ ఆదేశించారు. గతంలో చోటుచేసుకున్న దుర్ఘటనలను దృష్టిలో ఉంచుకుని మునిసిపల్, మండల అధికారులు టామ్‌టామ్, మైక్ అనౌన్స్మెంట్ల ద్వారా గ్రామాలు, వార్డుల్లో ఇప్పటి నుంచే విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహించే సంస్థలతో ముందస్తు సమావేశాలు నిర్వహించి స్పష్టమైన మార్గదర్శకాలు అందించాలని సూచించారు. ఘాట్ల నిర్వహణ బాధ్యతలను శాఖల వారీగా స్పష్టంగా కేటాయించారు. మునిసిపల్ శాఖలు పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే గదులు, లైటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, రెవెన్యూ శాఖ ఘాట్ల వద్ద క్రమబద్ధమైన నిర్వహణ, బారికేడింగ్, చెక్‌పోస్టుల ఏర్పాటు పర్యవేక్షించాలని ఆదేశించారు. మత్స్యశాఖ, ఫైర్, టూరిజం శాఖల సమన్వయంతో ప్రతి ఘాట్ వద్ద షిఫ్ట్‌ల వారీగా ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లు అందుబాటులో ఉంచాలని, హాజరు ఖచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు. అందుకు అనుగుణంగా ప్రతిపాదన అందచేయాలని స్పష్టం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రధాన ఘాట్ల వద్ద అంబులెన్సులు, వైద్య బృందాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఎండౌమెంట్ శాఖ దేవాలయాల్లో క్యూ లైన్ నిర్వహణ, అభిషేకాలు, హారతులపై నియంత్రణ విధించి గుంపుల నియంత్రణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రాజమహేంద్రవరం-కొవ్వూరు డివిజన్లకు రెండు ఎస్డీఆర్ఎఫ్ బృందాల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, శివరాత్రి ఏర్పాట్లను 2027 గోదావరి పుష్కరాలకు రోల్ మోడల్‌గా తీసుకుని సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు.

**భద్రత, ట్రాఫిక్, సీసీ కెమెరాలపై జిల్లా ఎస్పీ ఆదేశాలు**

జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ మాట్లాడుతూ, మహా శివరాత్రి సందర్భంగా అన్ని ఘాట్లు, దేవాలయాలు, రహదారి మార్గాల్లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలు, డ్రోన్ పర్యవేక్షణ, ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతర మానిటరింగ్ చేపడతామని, గ్రామ స్థాయిలో విలేజ్ మానిటరింగ్ టీమ్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ జామ్‌లు తలెత్తకుండా ముందస్తు ట్రాఫిక్ డైవర్షన్ ప్లాన్, నో పార్కింగ్ జోన్లు, పార్కింగ్ ప్రాంతాల గుర్తింపు, సరైన లైటింగ్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అనధికార ఘాట్ల వద్ద ప్రజలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని, మైక్ అనౌన్స్మెంట్లు ఐదు, ఆరు రోజుల ముందే ప్రారంభించాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

**మునిసిపల్ ఏర్పాట్లపై కమిషనర్ రాహుల్ మీనా**

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, నగర పరిధిలోని ఘాట్లు, దేవాలయాల వద్ద పారిశుధ్యం, తాగునీరు, మరుగుదొడ్లు, బ్రెస్ట్‌ఫీడింగ్ షెల్టర్లు, సీనియర్ సిటిజన్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా టెంట్లు, ఆహార పంపిణీ జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలతో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి టి సీతారామ మూర్తి, రాజమండ్రి ఇంచార్జి ఆర్డీవో కె భాస్కర్ రెడ్డి, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత , డీఎస్పీ లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బైకు దొంగ అరెస్టు

రూ.23 లక్షలు విలువ చేసే 28 బైకులు స్వాధీనం - వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీకాంత్



**రాజమహేద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జల్సాలకు అలవాటుపడి వరుస బైకు దొంగతనాలకు పాల్పడుతున్న బైకు దొంగను అరెస్టు చేసి రూ. 23 లక్షలు విలువ చేసే 28 బైకులు రికవరీ చశారు.నార్త్ జోన్ ఇన్చార్జి,సెంట్రల్ జోన్ డీఎస్పీ వై. శ్రీకాంత్ గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.నరసింహ కిషోర్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వై. శ్రీకాంత్ ఆదేశాల ప్రకారం ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనాలు చేసే వ్యక్తుల మీద ప్రకాష్ నగర్ సిఐ ఆర్.ఎస్.కె.బాజీలాల్ ఆధ్వర్యంలో ఎస్.ఐలు జి.సతీష్,కె.నవీన్ కుమార్,హెడ్ కానిస్టేబుళ్ళు వి.నాగరాజు, కె.ప్రదీప్ కుమార్,కానిస్టేబుల్ ఎస్..వీరబాబు ప్రత్యేక నిఘా పెట్టారు..దీనిలో భాగంగా బుధవారంరాజమహేంద్రవరం, జాగృతి బ్లడ్ బ్యాంకు వద్ద వెహికిల్ చెకింగ్ చేస్తుండగా బైక్ దొంగతనాలు చేసే పసుపులేటి సీతారామలింగేశ్వరరావును అరెస్టు చేశారు. ముద్దాయి సీతా రామలింగేశ్వరరావు గతంలో పిఠాపురంలో బంగారు షాప్ పెట్టుకుని ఆ వ్యాపారంలో నష్టాలు రావటంతో కొంతకాలం కార్ ట్రావెల్స్ పెట్టి అందులో కూడా నష్టాలు రావటంతో , అప్పటినుంచి రాజమహేంద్రవరం చుట్టుపక్కల పలుచోట్ల బైక్ దొంగతనాలు చేస్తూ జల్సాలు చేస్తున్నాడు.ఖరీదైన యునికార్న్ లు, సుజుకి ఆక్సిస్ లు, హీరో గ్లామర్లు, స్ప్లెండర్ ప్లస్ లను దొంగతనాలు చేస్తూ పోలీస్ లకు పట్టుబడకుండా తిరుగుతున్నాడు.ఎట్టకేలకు ముద్దాయి మీద ప్రత్యేక నిఘా పెట్టి అరెస్ట్ చేసి, అతనివద్ద నుండి మొత్తం 28 బైక్లు రికవరీ చేశారు.అందులో రాజమండ్రి ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో 12 బైక్లు, రాజమండ్రి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో 11 బైక్లు , రాజమండ్రి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లిమిట్స్‌లో 3 బైక్లు, తాళ్ళపూడి పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో 1 బైక్, సర్పవరం పోలీస్ స్టేషన్ లిమిట్స్ లో 1 బైక్ , మొత్తం 28 బైక్లను రికవరీ చేయటం జరిగింది. వీటిలో 6 యునికార్న్ బైక్లు , 8 హోండా ఆక్టివ బైక్లు , 6 సుజుకి ఆక్సిస్ బైక్లు, 5 హీరో గ్లామర్ బైక్లు, 3 స్ప్లెండర్ ప్లస్ బైక్లు రికవరీ చేశారు. పై కేసులో ప్రతిభ కనపరిచిన, ప్రకాష్ నగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఆర్.ఎస్.కె.బాజీలాల్,ని, ఎస్.ఐలు జి. సతీష్,ని, కె. నవీన్ కుమార్ ని, హెడ్ కానిస్టేబుళ్ళు ఎం..దుర్గారావు,వి.నాగరాజు,క్రైమ్ కానిస్టేబుళ్ళు కె.ప్రదీప్ కుమార్, ఎస్..వీరబాబు, వి.దుర్గాప్రసాద్, వి.శివ ప్రసాద్ ను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు తమ బైక్లకు డిజిటల్ లాక్లు, వీల్ లాక్లు, జిపిఎస్, లు పెట్టుకోవాలని మరియు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై అధికారులతో

# ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సమీక్ష సమావేశం

**భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మెరుగైన ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు**

**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహా శివరాత్రి పర్వదినాన వంగలపూడి, పట్టిసీమలో ఫిబ్రవరి 15 వ ఆదివారం జరగబోయే మహాశివరాత్రి మహోత్సవ ఏర్పాట్లకు సంబంధించి రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ సీతానగరం ఎంపీడీఓ,ఎం. ఆర్.ఓ మరియు ఇతర డిపార్ట్మెంట్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు లేకుండా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ మహా శివరాత్రి పర్వదినం ప్రజలకు అత్యంత ప్రీతిప్రదమైనదని ఈ పండుగను అత్యంత వైభవంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారని తెలియజేసారు. అలాంటి ఈ మహా పర్వదినం ఆదివారం రోజున రావడంతో భక్తులు మరింత ఎక్కువగా ఆ శివ పార్వతులను దర్శించేందుకు సుదూర ప్రాంతాల నుండి ప్రజలు భారీగా తరలి వస్తారని వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వంగలపూడి



నుండి పట్టిసీమ వెళ్లేందుకు రోడ్డు మార్గం పొడువునా మంచి నీటి సౌకర్యం, ప్రథమ చికిత్స కేంద్రాలు, భక్తులకు వసతి మరియు భోజన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# ఏటిగట్టు రహదారి పనులు నిలిపివేత

**నాసిరకం పనులపై వంగలపూడి గ్రామస్థుల ఆగ్రహం**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం వంగలపూడి పరిధిలోని ఏటిగట్టు రహదారి నిర్మాణ పనుల్లో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని నాణ్యతా ప్రమాణాలు పాటించ కుండా ఇష్టానుసారంగా రోడ్డు నిర్మిస్తున్నారనే ఆరోప ణలతో టిడిపి సీనియర్ నాయకుడు గద్దె సురేష్ ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, రైతులు బుధవారం రాత్రి నిర్మాణ పనులను అడ్డుకుని, నిలిపివేశారు. రహదారి నిర్మాణంలో వాడాల్సిన మెటీరియల్ పరిమాణం సరిగ్గా లేదని, కేవలం మట్టి పూడ్చి మమ అనిపిస్తున్నారని గద్దె సురేష్ విమర్శించారు. ఇలాంటి నాసిరకం రోడ్డు కొన్ని రోజులకే పాడైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత శాఖా అధికారులు క్షేత్రస్థాయిలో ఉండటం లేదని, దీనివల్ల కాంట్రాక్టర్లు తమకు నచ్చినట్లుగా పనులు చేస్తున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని నాసిరకం పనులతో వృధా చేస్తున్నారని, తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మాణం జరగాలి. నాణ్యతను పరిశీలించే వరకు వంగలపూడి ఏటిగట్టు మీద పనులు జరగనివ్వమని గ్రామస్థులు తేల్చి చెప్పారు.సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు వెంటనే వచ్చి నాణ్యత పరీక్షలు ను నిర్వహించాలనీ నిబంధనలు ఉల్లంఘించి నాసిరకంగా పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని,రహదారి నిర్మాణానికి సంబంధించిన బోర్డును ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి గ్రామానికి చెందిన పలువురు ప్రముఖులు, రైతులు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# ఉగాది నాటికి జిల్లాలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

**హౌసింగ్ ప్రగతిపై సమీక్ష నిర్వహించిన పీడీ హౌసింగ్ నాతి బుజ్జి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లాలో హౌసింగ్ పథకాల ప్రగతిపై గురువారం జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా హౌసింగ్ ప్రధాన అధికారి కార్యాలయంలో క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హౌసింగ్ పిడి నాతి బుజ్జి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిన ఉగాది-2026 నాటికి 5 లక్షల గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా తూర్పు గోదావరి జిల్లాకు కేటాయించిన 8,378 ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాల్సిన లక్ష్యాన్ని వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు జిల్లా కలెక్టర్ సూచనల మేరకు మండల, సచివాలయ స్థాయిల్లో పనిచేస్తున్న మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమన్వయం చేసుకుంటూ నిర్ణీత కాలవ్యవధిలో ఇలా నిర్మాణాలు లక్ష్యాన్ని పూర్తిచేయాలని హౌసింగ్ సిబ్బందికి ఆదేశించారు. ఉగాది టార్గెట్ సాధనలో భాగంగా జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు వారానికి రెండు సార్లు మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంసీలు మరియు హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశాలు నిర్వహించ నున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్ (కొవ్వూరు డివిజన్), హెచ్. వేణు గోపాలస్వామి, కార్యనిర్వాహక ఇంజనీర్ (రాజమహేంద్రవరం డివిజన్) జి.రాజ్‌కుమార్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల

**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రూరల్ మండలం పిడింగొయ్యి పంచాయతీ నందు బుచ్చయ్య నగర్ నుండి పిట్ల వాని చెరువు వరకు 85 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మాణం జరుగుతున్న సి.సి రోడ్డు పనులను రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా అనుసరించాలని సూచించారు.



# పులి సంచారంపై ప్రభుత్వం, ఎమ్మెల్యేలు స్పందించాలి : పలివెల వీరబాబు




**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం రాజమండ్రి రూరల్ ప్రాంతాల్లో పులి సంచారం నేపథ్యంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యేలు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల భద్రత కోసం అటవీశాఖ గాలింపు చర్యలు వేగవంతం చేసి గ్రామాల్లో గస్తీ పెంచాలని సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఒంటరిగా బయటకు వెళ్లవద్దని ఆయన అన్నారు.

సివి రామన్ టాలెంట్ టెస్ట్లో సరస్వతీ విద్యానికేతన్‌కు

# జిల్లా ర్యాంకులు

**విజేతలకు పెనకటి అభినందనలు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ సరస్వతీ విద్యా నికేతన్ విద్యార్థులు సివి రామన్ టాలెంట్ టెస్టులో ప్రతిభ కనబరిచి జిల్లాలో ప్రథమ ర్యాంకులు సాధించిన విజేతలను కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ అభినందించారు. గురువారం కోరుకొండ సరస్వతి విద్యానికేతన్ లో సివి రామన్ విజేతలు ఎన్ మోక్ష,ఆర్ హాసినిలు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాలు కైవసం చేసుకున్నందుకు అభినందిస్తూ, ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కరస్పాండెంట్ పెనకటి గంగాధర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను, విజ్ఞానాన్ని వెలికితీయడంలో సివి రామన్ టాలెంట్ టెస్ట్ ఎంతగానో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువలో గుర్తు తెలియని

# వృద్ధురాలి మృతదేహం

**మండపేట సి.హెచ్.సి మార్చురిలో భద్రపరిచిన మృతదేహం**
**సమాచారం తెలిపిన వారు తమను సంప్రదించాలని ఎస్సై సురేష్ బాబు విజ్ఞప్తి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పంట కాలువలో గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం లభ్యమవడంతో వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని రాయవరం ఎస్సై డి.సురేష్ బాబు గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా మండల కేంద్రమైన రాయవరం శివారులో గల దుర్గమ్మ గుడి దగ్గర అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామం నుండి రాయవరం మీదుగా ప్రవహించే పంట కాలువలో సుమారు 60 నుండి 65 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళ మృతదేహం గురువారం సాయంత్రం గుర్తించామని, నారింజ రంగు జాకెట్, చింతపిక్క రంగు లంగా ధరించిన మృతురాలు సుమారు 5.2 ఎత్తు కలిగి చామన చాయ రంగులో ఉందని మృతదేహాన్ని మండపేట సి.హెచ్.సీ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు రాయవరం పోలీస్ స్టేషన్ లేదా 9440904843 నెంబర్ కి ఫోన్ చేసి సమాచారం అందించాలని రాయవరం ఎస్సై సురేష్ బాబు సూచించారు.

2029 ఎన్నికల్లో ఆర్పీసీ

# ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ కాబోతుంది : మేడా శ్రీనివాస్



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** 2029 ఎన్నికల్లో ఆర్పీసీ ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీ కాభోతుంది అని విజయవాడ స్థానిక గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో అర్పిసి వ్యవస్థాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేసారు. ఆంధ్రప్రదేశ్‌లో పాలకుల పనితీరు ఆంధ్రులను భయపెడున్నాయని, కక్షపూరిత రాజకీయాలు తప్ప ఆంధ్ర రాష్ట్ర ప్రయోజనాలకు ఏ మాత్రం ఉపయోగం లేకపోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గల 175 శాసన సభ,25 పార్లమెంట్ నియోజకవర్గాల్లో కమిటీలను ఏర్పాటు చేసే దిశగా అర్పిసి ఆంధ్రప్రదేశ్ శాఖ శ్రీకారం చుట్టిందన్నారు. ఓటును ఇవ్వండి - సంపదను ఇస్తాం అనే నినాదంతో పేదరికం లేని సంపన్న రాష్ట్రాన్ని సాధించి చింపిస్తాం అన్నారు.ప్రధానంగా ప్రైవేట్ విద్యా - వైద్య విధానాన్ని పూర్తిగా రద్దు చేసి అదునాతన విధానాలతో ఉచిత విద్యా - వైద్యాన్ని అమలు చేస్తాం . 200/- లకే వంటగ్యాస్ సిలెండర్ ను సరఫరా చేస్తాం . పరిశుభ్ర మైన త్రాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తాం అని ఈ దిగువ పేర్కొన్న 29 అంశాలతో కూడిన ప్రమాణ పత్రాన్ని మేడా శ్రీనివాస్ ప్రకటించారు. ప్రైయివేటు, కార్పొరేట్ విద్యా-వైద్యాన్ని పూర్తిగా రద్దు చేస్తాం. అధునాతన విధానాలతో ఉచిత విద్యా- అమలు చేస్తాం. బిడ్డల భవిష్యత్తుకు ఆదర్శంగా నిలుస్తాం. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ను సాధిద్దాం. రైతు జీవితానికి వెన్నుదన్నుగా నిలవటానికి 100/- రూ॥లకే ఎరువుల బస్తా సరఫరా చేస్తాం. రైతు సమస్యలకు అండగా నిలుస్తాం. రూ. 200/- లకే వంటగ్యాస్ సిలెండర్ సరఫరాను అమలు చేస్తాం. ప్రతి జిల్లాలోను మానవ హక్కుల సంఘాలను ప్రభుత్వ పరంగా నియమించి ప్రజల హక్కులకు బాధ్యతగా నిలుస్తాం. 2014 విభజన చట్టం అమలును సాధించి తీరుతాం. రాష్ట్ర ప్రగతికి, ఆత్మ గౌరవానికి పునాదులుగా నిలుస్తాం. మెరుగైన,శుభ్రమైన త్రాగునీరును ఉచితంగా సరఫరా జరిపిస్తాం. ప్రకృతిని, సహజ వనరులను కాపాడుతూ ప్రజలందరిని పూర్తి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే తరలిపోయిన కార్పొరేట్, ప్రైవేట్ సంస్థల స్థానంలో అందుకు ధీటైన సంస్థలను ఆంధ్రప్రదేశ్కు సాధించి ఉద్యోగ ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాం. వాల్తేరు (విశాఖ) డివిజన్తో కూడిన విశాఖ రైల్వే జోను, కాకినాడ పెట్రో కెమికల్ కాంప్లెక్సు ఆంధ్రప్రదేశ్ లోనే నెలకొల్పే విధంగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సాధించి తీరుతాం. విభజన చట్టంపై ఇరు తెలుగు రాష్ట్రాలకు అద్భుతమైన మంచి భవిష్యత్తు ఉండే విధంగా పార్లమెంట్లో పునర్ చర్చకు కృషి చేస్తాం. భవిష్యత్తులో ఇరు తెలుగు రాష్ట్ర ప్రజల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తని విధంగా భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాం. ఈ నూతన ప్రత్యామ్నాయ రాజకీయ మహోన్నత ఉద్యమంలో యువతీ యువకులు భాగస్వాములు కావాలని , ఆంధ్ర రాష్ట్రానికి భవిష్యత్ అంతా మంచి రోజులేనన్నారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ తలపెట్టిన ఈ ప్రజా ఉద్యమం మరో స్వాతంత్ర్య పోరాట ఉద్యమ స్ఫూర్తితో సమానమన్నారు. ఈ చారిత్రాత్మక మైన ఉద్యమ పోరులో ప్రతి ఆంధ్రుడు భాగస్వాములు కావాలని మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

సైనిక్ వెల్ఫేర్ నిధికి

# మెప్మా స్వయం సహాయక సంఘాలు విరాళం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా సైనిక్ వెల్ఫేర్ నిధికి జిల్లాలోని 2 మునిసిపాలిటీలు, 1 నగర పాలక సంస్థ పరిధిలోని మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళలు తమ వంతు సహకారంగా రూ.5,85,288 విరాళాన్ని కలెక్టర్ కీర్తి చేకూరి వారి చేతుల మీదుగా సైనిక్ వెల్ఫేర్ అధికారులకు అందజేశారు. మెప్మా పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతి ఒక్కరూ రూ.10 చొప్పున స్వచ్ఛందంగా విరాళం అందించి దేశ రక్షణ కోసం విధులు నిర్వహిస్తున్న సైనికుల సంక్షేమానికి తమ మద్దతు తెలియజేయడం అభినందనీయమని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. దేశ రక్షణ కోసం సేవలందిస్తున్న సైనికుల సంక్షేమం మనందరి మీద ఉన్న గురుతరమైన బాధ్యత అని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సైనిక్ వెల్ఫేర్ నిధికి విశేష సహకారం అందించిన మెప్మా పిడి టి. కనకరాజు, మెప్మా జిల్లా సమాఖ్య సభ్యులు, సిబ్బంది మరియు స్వయం సహాయక సంఘాల మహిళలను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. బుధవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్‌లో మెప్మా పిడి టి. కనక రాజు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఫ్లాగ్ డే కాంట్రిబ్యూషన్ చెక్‌ను గౌరవ కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమములో మెప్మా, ప్రాజెక్ట్ డైరెక్టర్ టి కనకరాజు,జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ యస్. బాల సరస్వతి మరియు సభ్యులు, జిల్లా సిబ్బంది పి. శ్రీ దేవి, యమ్.ఇ ఫణి కుమార్, ఎస్ హెచ్ జీ మహిళలుఇతర సిబ్బంది పాల్గొన్నారు.

### భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద

# ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తోంది : ప్రధాని మోదీ



ప్రపంచం కొత్త ఆధునిక యుగం వైపు పయనిస్తోందని ప్రధానమంత్ర నరేంద్ర మోదీ అన్నారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న మార్గంలో మనం చాలా ముఖ్యమైన దశకు చేరుకున్నాము. ప్రపంచం మన ప్రతిభ, ప్రాముఖ్యతను గుర్తిస్తోంది. భారతదేశం తొమ్మిది ప్రధాన దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసింది. భారత్ అనేక దేశాలకు విశ్వసనీయ భాగస్వామి. మనం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో ఉన్నామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రపంచం కొత్త ఆధునిక యుగం వైపు పయనిస్తోందని ప్రధానమంత్ర నరేంద్ర మోదీ అన్నారు. కొత్త శిఖరాలను అధిరోహిస్తున్న మార్గంలో మనం చాలా ముఖ్యమైన దశకు చేరుకున్నాము. ప్రపంచం మన ప్రతిభ, ప్రాముఖ్యతను గుర్తిస్తోంది. భారతదేశం తొమ్మిది ప్రధాన దేశాలతో వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసింది. భారత్ అనేక దేశాలకు విశ్వసనీయ భాగస్వామి. మనం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే మార్గంలో ఉన్నాము. భారత్ తన సామర్థ్యాన్ని, సత్తాను ప్రదర్శిస్తోందని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. రాజ్యసభలో గురువారం (ఫిబ్రవరి 05) రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాలు సభలో గందరగోళం సృష్టించాయి. ప్రతిపక్షాల నినాదాల మధ్య, దేశం నేడు వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రతిపక్షాల నిరసన మధ్య, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు, "ఖర్గే జీ వయస్సును పరిగణనలోకి తీసుకుని కూర్చుని నినాదాలు చేయాలి" అని సూచించారు. ఎన్డీయే ప్రభుత్వం సమాజంలోని ప్రతి వర్గానికి పని చేసిందని ప్రధాని అన్నారు. బుధవారం (ఫిబ్రవరి 04) లోక్ సభలో గందరగోళం కారణంగా ఆయన ప్రసంగానికి అంతరాయం కలిగింది. ఆ తర్వాత, ప్రధానమంత్రి సమాధానం చెప్పకుండానే ధన్యవాద తీర్మానాన్ని లోక్ సభ ఆమోదించింది.

**సభ నుంచి ప్రతిపక్షం వాకౌట్**

ప్రధాని మోదీ ప్రసంగిస్తున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. "ఓటమి వదులుకుని వెళ్లిపోయిన వారు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కాంగ్రెస్ కారణంగా దేశం బాధపడుతోంది. కాంగ్రెస్‌కు దార్శనికత, సంకల్ప శక్తి లేదు. తమను తాము రాజులుగా భావించే వారు కూడా ఆర్థిక సమానత్వం గురించి మాట్లాడుతారు. మనం చూడాల్సిన రోజులు ఇవేనా?" అని ప్రధాని మోదీ ప్రశ్నించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగాన్ని ప్రశంసిస్తూ, ఆమె సమాజంలోని ప్రతి వర్గాన్ని ఉద్దేశించి ప్రసంగించారని అన్నారు.

**మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్: ప్రధాని**

అభివృద్ధి చెందిన భారతదేశంపై ప్రసంగిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, "దేశం విధానాల ఆధారంగా నడుస్తోంది. నేడు దేశం సంస్కరణల దిశగా పయనిస్తోంది. భారతదేశం ప్రపంచంతో పోటీ పడటానికి సిద్ధంగా ఉంది. ప్రధాన దేశాలు భారతదేశంతో వ్యాపారం చేయడానికి ఆసక్తిగా ఉన్నాయి. మేము అన్ని ఒప్పందాలకు తల్లి అయిన యూరోపియన్ యూనియన్ (ఐఈయు)తో సంతకం చేసాము. నేడు దేశం ఉత్తమ సంస్కరణల ఆధారంగా నడుస్తోంది" అని ప్రధాని మోదీ అన్నారు.

**ఆర్థిక పురోగతి**

"21వ శతాబ్దం మొదటి త్రైమాసికం ముగిసింది. రెండవ త్రైమాసికం చాలా కీలకం. ఈ రెండవ త్రైమాసికం అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించే దిశగా వేగవంతమైన పురోగతి సాధించే కాలం అవుతుంది. దేశంలోని ప్రతి వ్యక్తి.. మనం కీలకమైన మైలురాయిని చేరుకున్నామని భావిస్తున్నారు. ఇప్పుడు మనం ఆగకూడదు, వెనక్కి తిరిగి చూడకూడదు. మన లక్ష్యాన్ని సాధించిన తర్వాతే మనం ముందుకు సాగాలి. అప్పుడే ఊపిరి పీల్చుకోవాలి" అని ప్రధాని మోదీ అన్నారు.

రైతు సంక్షేమం

గత 10 సంవత్సరాలలో దేశ పని సంస్కృతి మారిపోయిందని అన్నారు. 250 మిలియన్ల మందిని పేదరికం నుండి విముక్తి పొందారు. రైతుల పరిస్థితి మారిపోయింది. నేడు 250 మిలియన్ల మంది దారిద్ర్యరేఖకు ఎగువన పెరిగారు. గతంలో, పేదరిక నిర్మూలన గురించి మాత్రమే చర్చ జరిగేది. ఆయుష్మాన్ భారత్ పథకం పేదలకు ఉచిత వైద్య చికిత్సను అందిస్తుంది. కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు ఆర్థిక సహాయం అందిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తిలో స్వావలంబన పెరిగిందని ఆయన అన్నారు.

### రష్యా నుంచి భారత్

# చమురు కొనుగోలు ఆపేస్తుందా?

**విదేశాంగ శాఖ కీలక వ్యాఖ్యలు**



రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ప్రధాని మోదీ అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ చెప్పారనే అమెరికా వాదనలను భారత్ తోసిపుచ్చింది. 1.4 బిలియన్ల భారతీయులకు ఇంధన భద్రతను కల్పించడమే అత్యంత ప్రాధాన్యత అని భారత్ పదే పదే బహిరంగంగా ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదని ప్రధాని మోదీ అంగీకరించారని డోనాల్డ్ ట్రంప్ చెప్పారనే అమెరికా వాదనలను భారత్ తోసిపుచ్చింది. 1.4 బిలియన్ల భారతీయులకు ఇంధన భద్రతను కల్పించడమే అత్యంత ప్రాధాన్యత అని భారత్ పదే పదే బహిరంగంగా ప్రకటించిందని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ అన్నారు. మార్కెట్ పరిస్థితులు, మారుతున్న అంతర్జాతీయ పరిస్థితుల ఆధారంగా భారతదేశం తన ఇంధన కొనుగోళ్లను వైవిధ్యపరుస్తుందని ఆయన అన్నారు. "మన అవసరాలకు అనుగుణంగా ప్రపంచంలోని ఏ దేశం నుండైనా చమురు కొనుగోలు చేయవచ్చు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం ఉంటుంది. భారత ప్రభుత్వం తీసుకునే అన్ని నిర్ణయాలు దేశప్రజలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవడం జరుగుతుంది." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది. భారతదేశంతో ఇంధన సహకారం కొనసాగుతుందని రష్యా కూడా పేర్కొంది. "భారతదేశం వైఖరిలో ఎటువంటి మార్పు లేదు. మా వాణిజ్యం రెండు దేశాలకు ప్రయోజనకరంగా ఉంటుంది" అని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. వెనిజులా నుండి చమురు కొనుగోలుకు సంబంధించి, విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ.. వెనిజులా ఇంధనం, వాణిజ్యం, పెట్టుబడి రంగాలలో దీర్ఘకాల భాగస్వామిగా ఉందని పేర్కొంది. "మేము 2019-20 వరకు వెనిజులా నుండి ఇంధనం, ముడి చమురును దిగుమతి చేసుకున్నాము, ఆ తర్వాత ఆపాల్సి వచ్చింది. అనంతరం 2023-24లో వెనిజులా నుండి చమురు కొనుగోలు చేయడం ప్రారంభించాము, కానీ ఆంక్షలు విధించిన తర్వాత ఆపాల్సి వచ్చింది" అని రణధీర్ జైస్వాల్ అన్నారు. "ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడి, సుంకాల తగ్గింపుకు అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. మేడ్-ఇన్-ఇండియా ఉత్పత్తులు ఇప్పుడు 18% తక్కువ సుంకంతో అమెరికాకు ఎగుమతి చేయబడతాయని ప్రధాని అన్నారు. ఈ వాణిజ్య ఒప్పందం మన ఎగుమతులను పెంచుతుంది. ఇది భారతదేశంలో శ్రమతో కూడిన పరిశ్రమలకు పెద్ద ప్రోత్సాహాన్ని అందిస్తుంది. కొత్త ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మన ప్రజలకు వృద్ధి, శ్రేయస్సు సాధిస్తారు." అని విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. ఇదిలావుంటే, ఇరాన్‌లో బందీలుగా ఉన్న 16 మంది భారతీయుల గురించి విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది. "ఇరాన్‌లోని 16 మంది నావికులను కలవడానికి మాకు అనుమతి లభించింది. మా అధికారులు బందర్ అబ్బాస్‌లో వారిని కలిశారు. 16 మందిలో ఎనిమిది మంది విడుదలై స్వదేశానికి తిరిగి వస్తున్నారు. మిగిలిన ఎనిమిది మంది గురించి మేము ఇరాన్ అధికారులతో సంప్రదిస్తున్నాము. వారికి ఎలా సహాయం చేయవచ్చో చూస్తున్నాము." అని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ పేర్కొంది.

# మొగుడొద్దు.. ప్రియుడే ముద్దు..!

## హనీమూన్ మర్డర్‌ను మించి.. భర్తను ఎలా లేపేసిందో తెలిస్తే నోరెళ్లబెట్టాల్సిందే!

సమాజంలో జరుగుతున్న సంఘటను చూస్తుంటే జనాల్లో పెళ్లి చేసుకోవాలనే ఆశ రోజురోజుకూ మరింత చచ్చిపోతుంది. ఈ మధ్య కాలంలోనే భర్తను హనీమూన్ పేరిట రాష్ట్రంకాని రాష్ట్రానికి తీసుకెళ్లి ఓ భార్య హత్య చేయగా.. ఆ ఘటన జరిగిన నెల వ్యవధిలోనే అచ్చం అలాంటి ఘటన మన తెలంగాణలోని గద్వాలా జిల్లాలో వెలుగు చూసింది. ఈ రెండు ఘటనల నుంచి జనాలు తేలుకోకముందే మళ్లీ అలాంటి ఘటనే రాజస్థాన్‌లో జరిగింది. వాళ్లకు ఇటీవలే కొత్తగా పెళ్లైంది. సాయంత్రం అలా సరదాగా బయటకు వెళ్దామని భార్య భర్తను అడిగింది. దీంతో భార్యను తీసుకొని భర్త బయటకు బయల్దేరారు. హైవే పక్కన వాహనం ఆపి అలా వాకింగ్ చేస్తూ ఉన్నారు. ఇంతో వేగంగా దూసుకొచ్చిన ఓ వాహనం వారిని ఢీకొట్టింది. ఆ ప్రమాదంతో భర్త మృతి చెందగా భార్య గాయాలతో బయటపడింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాళ్లను హాస్పిటల్‌కు తరలించారు. అయితే హాస్పిటల్‌లో స్ట్రెచ్చర్‌పై భర్త అశీశ్ మృతదేహాన్ని చూసిన అంజూ కన్నీరుమున్నీరుగా విలపించింది. ఆమెను చూసి అక్కడున్న వాళ్లంతా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇక ఘటనపై తొలుత హిట్ అండ్ రన్ కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు. మొదటగా భార్య అంజూ ప్రశ్నించగా ఆమె పొంతలేని సమాధానాలు చెప్పింది. అలానే తన బంగారు నగలు ఎవరో ఎత్తుకెళ్లారని చెప్పుకొచ్చింది. దీంతో పోలీసులకు డౌట్ వచ్చి అన్ని కోణాల్లో విచారించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్



శ్రీగంగానగర్ జిల్లాకు చెందిన అంజూ, ఆశీశ్‌కు గత మూడు నెలల క్రితం వివాహం జరిగింది. అయితే ఈ పెళ్లి ఇష్టం లేని మంజూ తన ప్రియుడు, అతని స్నేహితులతో కలిసి భర్తను అతి కిరాతకంగా హత్య చేయించింది. అనంతరం దాన్ని ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. కానీ చివరకు పోలీసులకు అడ్డంగా దొరికిపోయింది. కేసు స్టేట్‌మెంట్ తీసుకునే సమయంలో అంజూ ఒక్కోసారి ఒక్కోలా వాంగ్మూలం ఇవ్వడంతో పోలీసులకు అనుమానం వచ్చి ఆమె కాల్ హిస్టరీ చెక్ చేశారు. అప్పుడే ఆమె సంజూ అనే వ్యక్తితో ఎక్కువ మాట్లాడినట్టు తెలుసుకున్నారు. అయితే ఆశీశ్‌తో వివాహం జరిగాక ఆ కాల్స్ మరింత పెరిగాయని.. అందుకే అంజూనే తన ప్రియుడితో కలిసి ఇదందతా చేసి ఉంటుందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఇద్దరిని అదుపులోకి తీసుకొని తమదైన స్టైల్‌లో విచారించగా అసలు విషయం ఒప్పుకున్నారు. తాను-సంజూ ప్రేమించుకున్నామని.. తన ఇంట్లో వాళ్లు ఆశీశ్‌తో ఇష్టం లేకుండా పెళ్లి చేశారని అంజూ చెప్పుకొచ్చింది. అందుకే సంజూ ఇంటికి వెళ్లి ఆశీశ్‌ను అడ్డుతొలగించుకునేందుకు ప్లాన్ చేసుకున్నామని.. అందుకు సంజూ స్నేహితులు కూడా సహకరించడంతో సక్సెస్‌ఫుల్‌గా ఆశీశ్‌ను హత్య చేసి.. ప్రమాదంగా చిత్రీకరించినట్టు పేర్కొంది. కానీ దొంగతనం చేసినట్టు నాటకం ఆడేందుకు ప్రయత్నిస్తే.. పోలీసులే హిట్ అండ్ రన్ కేసు నమోదు చేయడంతో తమ పని మరింత ఈజీ అయింది అనుకునే లోపే.. పోలీసుల విచారణతో తడబాటు కారణంగా దొరిపోయామని ఆమె చెప్పుకొచ్చింది. అంజూ వాంగ్మూలంతో హిట్ రన్ కేసు కాస్తా హత్య కేసుగా మార్చుకున్న పోలీసులు అశీశ్ భార్య అంజుతో పాటు ఆమె ప్రియడు సంజు, అతని స్నేహితులు రాకీ, బాదల్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

# ఆరేళ్లుగా మైనర్ బాలికతో వెట్టిచాకిరీ..

## అధికారులు వచ్చేసరికి బెడ్ బాక్స్‌లో దాచిన కుటుంబం..!



అస్సాం రాజధాని గౌహతిలోని పంజాబరి ప్రాంతంలో అమానుష ఘటన ఒకటి చోటు చేసుకుంది. 13 ఏళ్ల మైనర్ బాలిక బెడ్ బాక్స్‌లో దాచిన దిగ్భ్రాంతికరమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పంజాబరిలోని జురిపార్‌లోని ఇంటి నంబర్ 69 వద్ద ఈ సంఘటన జరిగింది. అస్సాం రాజధాని గౌహతిలోని పంజాబరి ప్రాంతంలో అమానుష ఘటన ఒకటి చోటు చేసుకుంది. 13 ఏళ్ల మైనర్ బాలిక బెడ్ బాక్స్‌లో దాచిన దిగ్భ్రాంతికరమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పంజాబరిలోని జురిపార్‌లోని ఇంటి నంబర్ 69 వద్ద ఈ సంఘటన జరిగింది. జిల్లా కార్మిక శాఖ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీలు చేపట్టింది. దీంతో అమీన్ అక్తర్ లస్కర్ అనే మహిళ ఇంటిపై దాడి చేసింది. స్థానిక నివాసితుల ఫిర్యాదు మేరకు మేజిస్ట్రేట్ సమక్షంలో సోదాలు నిర్వహించారు. దీంతో మైనర్ బాలికకు విముక్తి కల్పించారు. అరీనా లస్కర్ ఖాతున్ ఇంట్లో 13 ఏళ్ల బాలిక పనిమనిషిగా ఉన్నది. ఆ మైనర్ బాలికతో ఆరేళ్లుగా ఇంటి పనులు చేయిస్తున్నారు. ఆమెను చిత్రహింసలకు గురి చేసి శారీరకంగా హింసిస్తున్నారు. ఇది గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారంతో బాల కార్మిక వ్యతిరేక టాస్క్‌ఫోర్స్ అప్రమత్తమైంది. ఫిబ్రవరి 1న మేజిస్ట్రేట్ సమక్షంలో జిల్లా కార్మిక అధికారులు, పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. అయితే తమ ఇంట్లో బాలిక పని చేయడం లేదని, నాలుగు రోజుల కిందటే ఆమెను తండ్రి తీసుకెళ్లినట్లు ఇంటి యజమాని తెలిపారు. మరోవైపు అధికారులు దీనిని నమ్మలేదు. ఆ ఇంట్లోని అన్ని గదులు, అన్ని చోట్ల వెతికారు. ఒక రూమ్‌లో వ్యక్తి నిద్రిస్తున్న బెడ్‌ను తనిఖీ చేశారు. ఆ బెడ్ బాక్స్‌ను తెరిచి చూడగా, లోపల దాచిన బాలిక బయటకు వచ్చింది. సుమారు 25 నిమిషాల పాటు ఆ బెడ్ బాక్స్‌లో ఆమెను దాచినట్లు తెలుసుకున్నారు. మైనర్ బాలికను రక్షించారు. అయితే, అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారని తెలిసి, ఆ ఇంటి వారు మైనర్ బాలికను బెడ్ బాక్స్‌లో దాచినట్లు కుటుంబసభ్యులు ఒప్పుకున్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా బాల కార్మికులతో ఇంటి పనులు చేయిస్తున్న ఆ ఇంటి యజమానిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. బెడ్ బాక్స్‌లో దాచిన మైనర్ బాలికను రెస్క్యూ చేసిన అధికారులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది. తదుపరి చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతున్నారు అధికారులు.

# డిగ్రీ అర్హతతో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్..

టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ లో 2026 సంవత్సరానికి సంబంధించి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 120 సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాలను భర్తీ చేయనుంది. మొత్తం పోస్టుల్లో టెలికాం స్ట్రీమ్ పోస్టులు 95, ఫైనాన్స్ స్ట్రీమ్ పోస్టులు 25 వరకు ఉన్నాయి..కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్.. 2026 సంవత్సరానికి సంబంధించి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ పోస్టుల భర్తీ కార్యక్రమాన్ని ప్రకటించింది. ఈ నోటిఫికేషన్ కింద మొత్తం 120 సీనియర్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ ఉద్యోగాలను భర్తీ చేయనుంది. మొత్తం పోస్టుల్లో టెలికాం స్ట్రీమ్ పోస్టులు 95, ఫైనాన్స్ స్ట్రీమ్ పోస్టులు 25 వరకు ఉన్నాయి. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజనీరింగ్, ఫైనాన్స్‌లో అర్హత కలిగిన యువత ఈ ప్రభుత్వ రంగ సంస్థలో కెరీర్‌ను నిర్మించుకోవడానికి ఇదొక అద్భుతమైన అవకాశం. అధికారిక నోటిఫికేషన్ ప్రకారం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఈ రోజు నుంచి (ఫిబ్రవరి 5, 2026) ప్రారంభమవుతుంది. మార్చి 7, 2026వ తేదీ వరకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తారు. టెలికాం స్ట్రీమ్ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎలక్ట్రానిక్స్, టెలీకమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఎలక్ట్రికల్ లేదా ఇన్స్ట్రుమెంటేషన్ విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ డిగ్రీలో ఉత్తీర్ణత పొంది ఉండాలి. ఇక ఫైనాన్స్ స్ట్రీమ్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు జూా (చార్టర్డ్ అకౌంటెంట్) లేదా జహీూ (కాస్ట్ ‌ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్)లో అర్హత అవసరం. అభ్యర్థుల కనీస వయస్సు 21 సంవత్సరాలు, గరిష్ట వయస్సు 30 సంవత్సరాలుగా నిర్ణయించారు. ూదీజ అభ్యర్థులకు 3 సంవత్సరాలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, వికలాంగ అభ్యర్థులకు నిబంధనల మేరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. ఈ అర్హతలు కలిగిన వారు ఆన్‌లైన్ విధానంలో మార్చి 7 తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తును సమర్పించిన తర్వాత మార్చి 8 నుంచి 15 వరకు అప్లికేషన్ సవరణ విండో అందుబాటులో ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఎంపిక జరుగుతుంది. ఈ పరీక్ష మార్చి 29, 2026న నిర్వహిస్తారు. దరఖాస్తు రుసుము కింద జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ. 2,500, ఎస్సీ, ఎస్టీ, పిడిడబ్ల్యుబి అభ్యర్థులు రూ. 1250 చొప్పున చెల్లించవల్సి ఉంటుంది. ఎంపికైన వారికి నెలకు రూ. 24,900 నుంచి రూ.50,500 వరకు జీతంగా చెల్లిస్తారు. ప్రొబేషన్ పూర్తయిన వారికి పదోన్నతితోపాటు ప్రభుత్వ నిబంధనల మేరకు అలవెన్సులు, ఇతర ప్రయోజనాలు లభిస్తాయి. ప్రభుత్వ ఉద్యోగం కావాలని కలలు కంటున్న ఇంజనీరింగ్. ఫైనాన్స్ నేపథ్యం ఉన్న అభ్యర్థులకు దీూచీూ ూజు చేపట్టిన ఈ నియామకాలు ఒక గొప్ప అవకాశం. మంచి జీతం, స్థిరమైన ఉపాధి, వృద్ధి అవకాశాలను అందించే ఈ పోస్టుకు అర్హత కలిగిన అభ్యర్థులు వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిచారు.

## బిజినెస్ వాయిస్

### గోల్డ్, సిల్వర్ రెండింటిలోనూ

# ఒకేసారి ఇన్వెస్ట్‌మెంట్ మంచిదేనా.?

### నిపుణులు ఏమన్నారంటే.?



అస్థిర మార్కెట్లలో పెట్టుబడులను సురక్షితంగా ఉంచడానికి బంగారం, వెండి మంచి ఆప్షన్లుగా మారాయి. ఈ రెండింటిలో ఏది మెరుగైన ఆప్షన్ అనేది చాలామందిలో మెదులుతున్న ప్రశ్న. ఈ క్రమంలోనే గోల్డ్ అండ్ సిల్వర్ ఫండ్ ఆఫ్ ఫండ్స్(ఎఫ్ఓఎఫ్) ఒక సమాధానంతో వచ్చేసింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. బంగారం, వెండి మధ్య పోటీ శతాబ్దాలుగా కొనసాగుతున్నప్పటికీ, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు వాటి ప్రాధాన్యతను మరింత పెంచాయి. యుద్ధ భయాలు, రాజకీయ అస్థిరత, స్టాక్ మార్కెట్లలో హెచ్చుతగ్గులు, ద్రవ్యోల్బణం పెట్టుబడిదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, తమ సంపాదనను సురక్షితంగా కాపాడుకుంటూ వృద్ధిని సాధించాలనే లక్ష్యంతో పెట్టుబడిదారులు బంగారం, వెండి వైపు చూస్తున్నారు. గోల్డ్ అండ్ సిల్వర్ ఫండ్ ఆఫ్ ఫండ్స్(ఎఫ్ఓఎఫ్) ఇదొక మ్యూచువల్ ఫండ్ మోడల్. ఇందులో పెట్టుబడిదారులు భౌతికంగా బంగారం లేదా వెండిని కొనుగోలు చేయకుండా, బంగారు, వెండి ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెడతారు. సాధారణంగా ఈ ఎఫ్ఓఎఫ్‌లు బంగారం, వెండిని 50:50 నిష్పత్తిలో కేటాయించి, పోర్ట్‌ఫోలియోలో సమతుల్యతను తీసుకువస్తాయి. బంగారం ఎప్పుడూ సేఫ్ హెవెన్‌గా ఉంటుంది, స్టాక్ మార్కెట్లు క్షీణించినప్పుడు లేదా కరెన్సీ విలువలు పడిపోయినప్పుడు బలంగా నిలుస్తుంది. వెండికి ఇండస్ట్రీ అవసరాల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది(సౌర విద్యుత్, ఎలక్ట్రిక్ వాహనాలు). ఆర్థిక పునరుద్ధరణ దశల్లో వెండి అధిక రాబడిని ఇవ్వగలదు, అయితే అధిక అస్థిరతకు లోబడి ఉంటుంది. ఎఫ్ఓఎఫ్‌ల ద్వారా ఈటీఎఫ్‌లలో పెట్టుబడి పెట్టడం వల్ల పారదర్శకత, ద్రవ్యత లభిస్తాయి. భౌతిక లోహాల కొనుగోలుకు సంబంధించిన నిల్వ సమస్యలు, స్వచ్ఛతపై అనుమానాలు, బీమా ఖర్చులు వంటి ఇబ్బందులు ఉండవు. ఆర్థిక నిపుణుల సూచనల ప్రకారం, మొత్తం పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలో 10 నుంచి 15 శాతం వరకు విలువైన లోహాలకు కేటాయించడం సమతుల్య వ్యూహం అని అంటున్నారు.

# అప్పుడు రూ.700కి 1900 షేర్లు..

### ఇప్పుడు వాటి ధర తెలిస్తే టైమ్ మిషిన్ కావాలంటారు



ఓ పెద్దాయన 2002లో రూ. 700 చొప్పున 1900 ఎంఆర్ఎఫ్ షేర్లు కొన్నారు. ఇప్పుడు అవి ఒక్కొక్కటి రూ. 1.35 లక్షలకు చేరాయి. ఈ సందర్భంగా బిజినెస్ నిపుణులు దీర్ఘకాలిక పెట్టుబడుల గురించి కీలక విషయాలు చెబుతున్నారు. ఆ స్టోరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందామా.. స్టాక్ మార్కెట్ అంటే వైకుంఠపాళీ. ఇది కచ్చితంగా నిజమే.. కానీ పాములు దాటుకుంటూ.. నిచ్చెనలు ఎక్కుతూ గమ్యానికి చేరుకున్నవాడే మొనగాడు. ఇక ఇటీవల కాలంలో చాలామంది స్టాక్ మార్కెట్‌లోకి హర్షద్ మెహతా కథలు విని వచ్చి ఉంటారు. అయితే స్టాక్ మార్కెట్ అనేది భయపడాల్సింది. అందులో సరైన పద్ధతిలో పెట్టుబడులు పెడితే.. దీర్ఘకాలికంగా అత్యధిక రాబడులు మనం చూడొచ్చు. ఓ పెద్దాయన 2002లో వీ=ళీకి సంబంధించి 1900 షేర్లను రూ. 700 చొప్పున కొనుగోలు చేశారు. ఇప్పుడు ఈ షేర్లలో ఒక్కొక్కటి రూ. 1.35 లక్షలకుపైగా ఉన్నాయి. ఈ అద్భుతమైన వృద్ధి స్టాక్ మార్కెట్‌లో దీర్ఘకాలిక పెట్టుబడి గొప్పతనాన్ని చూపిస్తుంది. **MRF** (మద్రాస్ రబ్బర్ ఫ్యాక్టరీ) అనేది దేశంలోని ఒక ప్రముఖ టైర్ల తయారీ సంస్థ. దీనిని 1946లో స్థాపించారు. కంపెనీ తన **IPO**ని 1993లో ప్రకటించింది. ఆ సమయంలో ఒక్కో షేరు ధర రూ. 11 మాత్రమే. 2002లో రూ. 700కి కొనుగోలు చేసిన షేరు విలువ రెండు దశాబ్దాల తర్వాత రూ. 1.35 లక్షలపైగా ఉండటం ఆ సంస్థ వృద్ధికి నిదర్శనం. ఆ పెద్దాయన డబ్బు అవసరం లేదు, ఈ షేర్లను ఇప్పుడు అమ్మే ఆలోచన లేదు. భవిష్యత్తులో మరింతగా పెరుగుతుందని.. కనీసం రూ. 2 లక్షలు చేరే అవకాశం ఉందని అంటున్నారు. ఇక దీనిపై బిజినెస్ నిపుణులు మాట్లాడుతూ.. మంచి డివిడెండ్, అలాగే అధిక రాబడి ఇచ్చే ఇలాంటి స్టాక్స్ పోర్ట్‌ఫోలియోలో ఉంటే.. కచ్చితంగా అమ్మకూడదని అంటున్నారు. ప్రస్తుతం ఈ షేర్ రూ. 3 డివిడెండ్ ఇస్తుంది. భవిష్యత్తులో ఈ షేరు విలువ రూ. 1.50 లక్షల నుంచి రూ. 2 లక్షల వరకు కూడా చేరవచ్చని అంచనా వేశారు. ఇలాంటి బలమైన షేర్స్ సామాన్య వ్యక్తికి కేవలం ఆర్థికంగా లాభం చూపించడమే కాదు.. జీవితంలో ఒక రకమైన ఆర్థిక భద్రతను అందిస్తాయని నిపుణులు వివరించారు. కాగా, స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులకు కచ్చితంగా ఓపిక, సరైన ఎంపిక అవసరం అని స్పష్టం చేశారు.

### అమెరికా నుంచి మరో గుడ్‌న్యూస్..

# గ్లోబల్ హబ్‌గా భారత్.. చైనా గుత్తాధిపత్యానికి చెక్..!

ఇప్పటి వరకు ప్రపంచ శక్తి చమురు ద్వారా మాత్రమే నిర్ణయించేవారు. అయితే మారుతున్న కాలానుగుణం అధునిక సంతరించుకుంది. దీంతో ఇకపై కీలకమైన ఖనిజాల ద్వారా ప్రపంచ శక్తిని నిర్ణయిస్తారు. ఈ దిశలో ఒక పెద్ద మార్పు ఉద్భవించింది. భారతదేశంతో సహా 54 దేశాలతో కలిసి యునైటెడ్ స్టేట్స్ ఒక కొత్త అంతర్జాతీయ ఖనిజ సమూహాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. ఇప్పటి వరకు ప్రపంచ శక్తి చమురు ద్వారా మాత్రమే నిర్ణయించేవారు. అయితే మారుతున్న కాలానుగుణం అధునిక సంతరించుకుంది. దీంతో ఇకపై కీలకమైన ఖనిజాల ద్వారా ప్రపంచ శక్తిని నిర్ణయిస్తారు. ఈ దిశలో ఒక పెద్ద మార్పు ఉద్భవించింది. భారతదేశంతో సహా 54 దేశాలతో కలిసి యునైటెడ్ స్టేట్స్ ఒక కొత్త అంతర్జాతీయ ఖనిజ సమూహాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధమైంది. అరుదైన ఖనిజాలు, ముఖ్యమైన ఖనిజాల భద్రత, సరఫరాపై చైనా పట్టును విచ్ఛిన్నం చేయడమే దీని లక్ష్యం. ప్రస్తుతం ఈ రంగంలో దాదాపు 90 శాతం చైనా ఆధిపత్యం చెలాయిస్తుంది. వాషింగ్టన్‌లో జరిగిన 2026 క్రిటికల్ మినరల్స్ మినిస్టీరియల్ సమావేశంలో ఈ ప్రకటన చేశారు. ఈ సమావేశానికి అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, ఉపాధ్యక్షుడు జె.డి. వాన్స్, ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ హాజరయ్యారు. ఈ కొత్త ఖనిజ కూటమిలో




భారతదేశం కీలక పాత్ర పోషిస్తుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ భారతదేశం వైపు ఉండటం స్పష్టం చేసింది. ఇందు కోసం రెండు ప్రధాన వేదికలు సృష్టించారు. మొదటిది **FORGE**, ఇది మునుపటి ఖనిజ భద్రతా భాగస్వామ్యాన్ని భర్తీ చేస్తుంది. దీని లక్ష్యం ఖనిజాల ధర, సరఫరాను భద్రపరచడంతోపాటు స్థిరీకరించడం. ప్రస్తుతం, దక్షిణ కొరియాకు ఈ బాధ్యత అప్పగించారు. రెండవ వేదిక పాక్స్ సిలికా, ఇది సెమీకండక్టర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, హైటెక్ పరిశ్రమలకు అవసరమైన ఖనిజాల సరఫరాను చైనా నుండి విశ్వసనీయ దేశాలకు మార్చడానికి పనిచేస్తుంది. ఇందులో భారతదేశం బలమైన మూల స్తంభంగా భావిస్తున్నారు.

**భారతదేశానికి ఉన్న గొప్ప అవకాశం ఏమిటి?**

ఇది భారతదేశానికి ఒక ప్రధాన అవకాశం. భారతదేశం ఇకపై ఖనిజాల కొనుగోలుదారుగా మాత్రమే ఉండదు. కానీ వాటిని శుద్ధి చేయడానికి, ప్రాసెస్ చేయడానికి ప్రపంచ కేంద్రంగా మారుతుంది. చైనా కంటే భారతదేశం వంటి విశ్వసనీయ భాగస్వాములలో ఖనిజ తవ్వకాలు, శుద్ధిలో సుమారు 30 బిలియన్ డాలర్లను పెట్టుబడి పెడతామని అమెరికా స్పష్టంగా పేర్కొంది.

### బంగారం, వెండి మాత్రమే కాదు..

# ఈ మెటల్‌లో పెట్టుబడి పెడితే డబ్బులే.. డబ్బులు..




ప్రస్తుతం బంగారం, వెండి ధరలు పెరుగుతుండగా.. భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశం ఉన్న క్రమంలో వాటిల్లోకి పెట్టుబడులు పెరుగుతున్నాయి. డిజిటల్ రూపంలో గోల్డ్‌ను కొనుగోలు చేసేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు. అయితే వీటితో పాటు ఇటీవల కాపర్‌లో కూడా ఇన్వెస్ట్‌మెంట్స్ పెరుగుతున్నాయి. బంగారం, వెండి ధరలు భారీగా పెరుగుతుండటం, హెచ్చుతగ్గులకు లోనవుతుండటంతో డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు చాలామంది భయపడుతున్నారు. ఎప్పుడు తగ్గుతుందో.. ఎప్పుడు పెరుగుతుందో అర్థం కాకపోవడంతో వీటిల్లో ఇన్వెస్ట్ చేస్తే నష్టమొస్తుందనే ఆందోళనతో వెనక్కి తగ్గుతున్నారు. ఇక కొంతమంది భవిష్యత్తులో పెరుగుతుందనే ఆశతో తగ్గినప్పుడు కొనుగోలు చేసి పెరిగినప్పుడు సేల్ చేసి లాభాలు పెడుతున్నారు. అయితే పసిడి ధరలు పెరుగుతుండటంతో మరికొంతమంది ప్రత్యామ్నాయ మెటల్స్ వైపు చూస్తున్నారు. ముఖ్యంగా రాగిలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో గత ఏడాదిగా కాపర్ ధరలు ఆమాంతం పెరుగుతూ వస్తోన్నాయి. 2025లో కాపర్ ధరలు భారీగా పెరిగాయి. మల్టీ కమెడిటీ ఎక్స్ఛేంజ్(వీజశ)లో ఏకంగా 50 శాతం నుంచి 63 శాతం వరకు పెరిగాయి.

**కిలో ఎంత పెరిగిందంటే..?**

2016 ప్రారంభంలో కిలో రాగి రూ.316గా ఉండగా.. జనవరి 1,2026 నాటికి కిలో రూ.1292.50కి పెరిగింది. లండన్ మెటల్ ఎక్స్ఛేంజ్‌తో పాటు ప్రపంచ మార్కెట్లలో ఈ ఎర్ర లోహం ధర 35 నుంచి 40 శాతం పెరిగి టన్నుకు 12 వేల డాలర్లకుపైగా పెరిగి రికార్డ్ నమోదు చేసింది. రాగి ఈటీఎఫ్, కంపెనీలలో పెట్టుబడులు పెరగడంతో పాటు గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఇతర తయారీ రంగాల్లో కాపర్‌ను ఎక్కువగా ఉపయోగిస్తుండటంతో వీటి ధరలు పెరుగుతున్నాయి. దీంతో రాగిలో పెట్టుబడులు పెట్టేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తున్నారు.

**ఎలా పెట్టుబడులు పెట్టాలి..?**

గోల్డ్, వెండి ఈటీఎఫ్(ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లు తరహాలోనే అమెరికా, యూరోపియన్ దేశాల్లో కాపర్ ఈటీఎఫ్‌లు ఉన్నాయి. కానీ భారత్‌లో ఇలాంటి ఈటీఎఫ్ ఫండ్స్ ఇంకా మొదలుకాలేదు. దీంతో భారతీయులు కాపర్‌లో పెట్టుబడులు పెట్టాలంటే ఎంసీఎక్స్ కమోడిటీ ఫ్యూచర్స్‌లో ఇన్వెస్ట్ చేయొచ్చు. ఇక ఇంటర్నేషనల్ ఈటీఎఫ్‌లలో పెట్టుబడులు పెట్టవచ్చు. ఇక కాపర్ మైనింగ్, మ్యాన్యూఫాక్చరింగ్ కంపెనీల షేర్లను కొనుగోలు చేయవచ్చు. హిందూస్థాన్ కాపర్, వేదాంత హిందాల్కో లాంటి కంపెనీల్లో పెట్టుబడులు పెట్టవచ్చు. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ కమోడిటీస్ ఫండ్, డీఎస్పీ నేచురల్ రిసోర్సెస్, న్యూ ఎనర్జీ ఫండ్ లాంటి మైనింగ్ లేదా తయారీలో పాల్గొన్న కంపెనీలను కలిగి ఉన్న ఫండ్లలో ఇన్వెస్ట్ చేయవచ్చు. బంగారం, వెండిని బార్లు లేదా కాయిన్స్ రూపంలో కొనుగోలు చేయవచ్చు. కానీ రాగిని అలా కొనుగోలు చేయడానికి కుదరదు. దీంతో భారత్‌లో కూడా కాపర్ ఈటీఎఫ్‌లను తీసుకురావాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. దీని వల్ల కాపర్‌లో పెట్టుబడులు పెట్టే అవకాశం లభిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా రాగికి డిమాండ్ పెరుగుతుండటంతో.. భారత్‌లో కూడా దానికి ఇక ఇన్వెస్ట్‌మెంట్ సాధనంగా మారిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఆఫీస్ లేదు.. బాస్ అనే బాధ అస్సలు ఉండదు..

### తిరుగులేని బిజినెస్ ఇది.. స్టార్ట్ చేస్తే నెలకు రూ. 1 లక్ష!

పేపర్ ప్లేట్ తయారీ వ్యాపారం తక్కువ పెట్టుబడితో ప్రారంభించి లాభదాయకమైన అవకాశంగా నిలుస్తోంది. ఈ వ్యాపారంలో పెట్టుబడి, రాబడి ఎలా ఉండనున్నాయంటే.. ఒక పేపర్ ప్లేట్ తయారీ మెషిన్ ధర రూ. 1,50,000. ఈ మెషిన్ ద్వారా రోజుకు సుమారు 5,000 ప్లేట్లు తయారు చేయవచ్చు. పేపర్ ప్లేట్ తయారీ వ్యాపారం లెక్కలు చూస్తే.. రూ. 1,50,000 మెషిన్ ధరతో రోజుకు 5,000 ప్లేట్లు ఉత్పత్తి చేయవచ్చు. రోజువారీ ఆదాయం రూ. 10,000 అంచనా వేస్తే నెలవారీ లాభం రూ. 1 లక్ష వరకు ఉండవచ్చు. అయితే, ఇవి కేవలం అంచనాలు మాత్రమే. వాస్తవ ఆదాయం



కృషి, మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. వివరాల్లోకి వెళ్తే.. పేపర్ ప్లేట్ తయారీ వ్యాపారం తక్కువ పెట్టుబడితో ప్రారంభించే లాభదాయకమైన అవకాశంగా నిలుస్తోంది. ఈ వ్యాపారంలో పెట్టుబడి, రాబడి ఎలా ఉండనున్నాయంటే.. ఒక పేపర్ ప్లేట్ తయారీ మెషిన్ ధర రూ. 1,50,000. ఈ మెషిన్ ద్వారా రోజుకు సుమారు 5,000 ప్లేట్లు తయారు చేయవచ్చు. ఒక్కో ప్లేట్ ధర రూ. 2గా అంచనా వేస్తే, రోజువారీ ఆదాయం రూ. 10,000 వరకు ఉంటుంది. దీని ఆధారంగా, నెలవారీ మొత్తం ఆదాయం రూ. 3 లక్షలుగా ఉండొచ్చు. నెలవారీ ఖర్చులు రూ. 2 లక్షలుగా ఉండగా, నెలకు రూ. 1 లక్ష నికర లాభం సంపాదించే అవకాశం ఉంది. ఇవి కేవలం అంచనా లెక్కలు మాత్రమే.. వాస్తవ ఆదాయం వ్యక్తిగత కృషి, మార్కెట్ పరిస్థితులు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఈ వ్యాపారాన్ని ప్రారంభించే ముందు లోకల్ గా ఉన్న పరిస్థితులు కచ్చితంగా పరిగణనలోకి తీసుకోండి.

# ఓరి పిచ్చోడా.. చేతులారా ప్రాణాలు పోగొట్టుకున్నావ్..

## రీల్స్ చేస్తుంటే యముడే షేక్ హ్యాండ్ ఇచ్చాడు..

ఈ మధ్యకాలంలో ప్రతి ఒక్కరికి రీల్స్ పిచ్చి పెరిగిపోయింది. ముఖ్యంగా యువత రీల్స్ చేసే పనిలో పడి వారి ప్రాణాలు కోల్పోతున్నారు.. బైక్ లను నడిపి భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు.. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయి కుటుంబానికి చేదు జ్ఞాపకాలు మిగుల్చుతున్నారు. తాజాగా అలాంటి సంఘటన ఒకటి.. ఏపీలో కలకలం రేపింది.. కడప నగరంలోని విమానాశ్రయం రోడ్డులో యువత బైక్ పై కళ్ళు గగుర్పొడిచే స్టంట్లను చేస్తూ రోడ్లపై వెళ్ళే ప్రయాణికులను కూడా భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. స్పీడ్ గా వెళ్ళడం ముందు టైర్ ను గాలిలోకి లేపడం.. ర్యాష్ డ్రైవింగ్.. భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.. విజువల్స్ చూస్తే ఎంత భయంకరంగా ఉన్నాయంటే యువతను వారి తల్లిదండ్రులు రోడ్డుపైకి పంపాలంటేనే ప్రాణాలు అరచేతులో పెట్టుకొని పంపించాల్సి వస్తుంది. కడప నగరంలోని ముబారక్ అనే యువకుడు మరో యువకుడితో కలిసి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో రీల్స్ కోసం బైక్ రైడ్స్ చేస్తూ డివైడర్ ను ఢీకొని చనిపోయాడు.. బైక్ పై నుండి కిందపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మరో యువకుడి





పరిస్థితి విషమంగా ఉండటంతో అతనిని మెరుగైన వైద్యం కోసం బెంగుళూరు తరలించి నట్టు సమాచారం .. పోలీసులు నిత్యం నిఘా పెట్టినా.. డ్రోన్ లతో సెర్చ్ చేస్తున్నా.. ఇలాంటి వారు మాత్రం.. రోడ్లపై హల్ చల్ చేస్తూనే ఉన్నారు. అయితే, తల్లి దండ్రులు తమ పిల్లలప దృష్టి పెట్టాలని.. అలాగే.. పోలీసులు రీల్స్ చేసే యువతకు కౌన్సిలింగ్ ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

# పులి సంచారంతో వణుకుతున్న తూర్పుగోదావరి




తూర్పుగోదావరి జిల్లా గాడాల , కోలమూరు సమీపంలోని పంటపొలాల్లో పులి సంచారం అక్కడి ప్రజలను కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. పొలాలకు వెళ్లాలంటే రైతులు, రైతు కూలీలు భయపడుతున్నారు. పులి జాడను కనిపెట్టేందుకు రంగంలోకి దిగిన అటవీశాఖ అధికారులు పంట పొలాల మధ్య పెద్దపులి పాదముద్రలను గుర్తించారు . గత మూడు రోజులుగా తొర్రేడు పంట పొలాల మధ్య ఉన్న పెద్దపులి... మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోలమూరు సమీప పంట పొలాల వైపు వచ్చినట్టు గుర్తించిన అధికారులు ప్రజలను రైతులను అప్రమత్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రజలను ఒంటరిగా పొలాలకు వెళ్లవద్దని సూచించారు. అంతేకాదు, పెద్దపులి సంచారంతో సమీప స్కూళ్లకు సెలవులు ప్రకటించారు అధికారులు. సాధారణంగా పెద్దపులి పగటిపూట బయటకు రాదని ప్రజలు భయపడవద్దని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం కోలమూరు చెరువు సమీపంలో ఒక కొబ్బరి చెట్టు కింద పెద్ద పులి పాదముద్రలను గుర్తించారు. రైతులు ఎవరు పంట పొలాల వైపు వెళ్ళవద్దని హెచ్చరిస్తున్నారు ఫారెస్ట్ అధికారులు.

### మహిళలకు గుడ్‌న్యూస్..

# ప్రభుత్వం మరో కొత్త పథకం ప్రారంభం..



ఏపీలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ అందించింది. మహిళలు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం తోడ్పాటు అందించనుంది. ఇందుకోసం మరో పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఎగ్ మార్ట్‌లు కేటాయించనుంది. దీనికి మహిళలు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఏపీలోని మహిళల కోసం కూటమి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఉచిత బస్సు ప్రయాణంతో పాటు మహిళలకు వడ్డీ లేని బ్యాంక్ రుణాలు అందిస్తోంది. ఈ క్రమంలో మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చు. రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా సొంతగా వ్యాపారం మొదలుపెట్టవచ్చు. రూ.50 వేల విలువైన సమాగ్రిని కూడా ఉచితంగా అందించనునున్నారు. అలాగే వ్యాపారం ఎలా చేయాలనే దానిపై పాటు ఆదాయం ఎలా పొందాలనే విషయాలపై మహిళలకు ఉచితంగా ప్రభుత్వం ట్రైనింగ్ ఇవ్వనుంది. ఇందకోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు ఏంటో ఇప్పుడు చూద్దాం.

**ఎగ్ మార్ట్‌ల ఏర్పాటు**

మహిళలకు ప్రభుత్వం ఎగ్ మార్ట్‌లు కేటాయించనుంది. వీటి ద్వారా గుడ్లను విక్రయించి మహిళలు ఆదాయం పొందవచ్చు. ఇందుకు కావాల్సిన కార్ట్, సామాగ్రి మొత్తం ప్రభుత్వమే అందించనుంది. మార్ట్ కోసం అవసరమయ్యే రూ.50 వేలు విలువ చేసే బండి, సామాగ్రి మొత్తం ఉచితంగా ఇవ్వనున్నారు. రాష్ట్రంలో రద్దీగా ఉండే మెయిన్ రోడ్డు, ప్రధానమైన కూడళ్ల వద్ద ఈ ఎగ్ మార్ట్‌లను ఏర్పాటు చేస్తారు. దీని వల్ల మహిళలకు సేల్స్ పెరిగి అధిక ఆదాయం లభిస్తుంది. ఈ ప్రభుత్వ పథకంతో రూపాయి కూడా ఖర్చు చేయకుండా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చు. ఈ వ్యాపారం ఎలా చేయాలి..? అనే దానిపై మహిళలకు ఉచితంగా ట్రైనింగ్ కూడా కల్పిస్తారు. అనంతరం మహిళలను ఎంపిక చేసి ఎగ్ మార్ట్‌లు కేటాయిస్తారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో వీటిని ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం నెక్ సంస్థతో మెప్మా ఒప్పందం కుదుర్చుకుంది.

**దరఖాస్తు చేసుకోవడమెలా..?**

ఆసక్తికర మహిళలు సమీపంలోని మెప్మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు పరిశీలించి లబ్దిదారులను ఎంపిక చేశారు. వారికి శిక్షణ అందించి ఎగ్ మార్ట్‌లను కేటాయిస్తారు. డ్వాక్రా గ్రూపుల్లోని ఒంటరి మహిళలకు ఈ కార్యక్రమం అమల్లో ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అయితే ఎగ్ మార్ట్ ఏర్పాటు చేసుకునే మహిళలు వ్యాపారానికి సంబంధించి స్వీయ ధృవీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది.. వ్యాపార అనుభవం, ట్రైనింగ్ అంగీకారానికి సంబంధించి ధృవీకరిస్తూ ఓ పత్రం అందించాలి. స్టోర్ శుభ్రంగా ఎలా పెట్టుకోవాలి..? ఎలా విక్రయించాలి..? వ్యాపారం ఎలా పెంచుకోవాలి? అనే విషయాలపై మహిళలకు శిక్షణ అందించనున్నారు. ఈ ఎగ్ మార్ట్‌ల ఏర్పాటుతో మహిళలు ఎక్కువగా ఆదాయం పొందవచ్చని మెప్మా అధికారులను చెబుతున్నారు. మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సూచిస్తున్నారు.

### తిరుమల భక్తులకు

# ఇకపై నాణ్యమైన ఆహారం..

## టీటీడీ కీలక నిర్ణయం.. మార్చి నుంచే..



తిరుమల లడ్డూ కల్తీ అంశం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపుతూనే ఉంది. ఇటీవల కేబినెట్ సమావేశంలో కూడా దీనిపై కీలక చర్చ జరిగింది. ఈ క్రమంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. భక్తులకు కల్తీ లేని ఆహారం అందించేందుకు త్వరలో ల్యాబ్ ఏర్పాటుకు సిద్దమవుతోంది. కలియుగ ప్రత్యక్ష దైవంగా అందరూ భావించే తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు రోజూ లక్షలాది మంది భక్తులు కోండపైకి చేరుకుంటూ ఉంటారు. ప్రస్తుతం రోజూ 70 వేల మంది భక్తులకు స్వామివారి దర్శనం టీటీడీ కల్పిస్తుండగా.. హుండీ ఆదాయం పెరుగుతూనే ఉంటుంది. తిరుమలలో భక్తులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు టీటీడీ చర్యలు చేపడుతోంది. కల్తీ లేని ఆహార పదార్థాలు భక్తులకు అందేలా కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో తిరుమలలో భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ(ఖీూూా×) ల్యాబ్ ఏర్పాటు చేయనుంది. కేంద్రంతో పాటు ఏపీ ఆరోగ్య భద్రతా విభాగంతో కలిసి టీటీడీ ఈ ల్యాబ్ ఏర్పాటుకు రెడీ అయింది. ఈ ల్యాబ్ ద్వారా కల్తీ లేని నాణ్యమైన ఆహారం భక్తులకు అందేలా చేయనుంది.

**మార్చిలో ల్యాబ్ ప్రారంభం**

అతి తక్కువ మోతాదులో ఆహారం కల్తీ జరిగినా ఈ ల్యాబ్ ద్వారా తెలుసుకోవచ్చు. అతి సౌక్ష్మస్థాయిలోని కల్తీని కూడా గుర్తించే అవకాశం లభించనుంది. మొత్తం 15 పరికరాలు ఈ ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌లో అందుబాటులో ఉంటాయి. హై ఫర్‌ఫార్మెన్స్ లిక్విడ్ క్రమోగ్రాఫ్, గ్యాస్ క్రొమటోగ్రాప్, ఐసీపీఎంసీ వంటి 15 రకాల పరికరాలు అమర్చనున్నారు. ఈ పరికరాల ద్వారా ఆహార కల్తీని ఈజీగా గుర్తించవచ్చు. మార్చి నుంచి ఈ ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్ అందుబాటులోకి వస్తుందని తెలుస్తోంది. టీటీడీ ఇప్పటికే తిరుమలలో నీరు, ఆహార పదార్థాల నాణ్యత తెలుసుకునేందుకు ల్యాబ్ ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌కు సమీపంలోనే కేంద్ర ప్రభుత్వ సహకరాంతో ఈ కొత్త ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. కేంద్ర కొత్త ల్యాబ్ కోసం రూ.20 కోట్లతో కొత్త పరికరాలను ఇప్పటికే కొనుగోలు చేసింది. వీటిని ఈ ల్యాబ్‌లో అమర్చుతున్నారు.

**ప్రారంభంపై టీటీడీ ఈవో సమీక్ష**

తాజాగా ఈ ల్యాబ్‌ను టీటీడీ ఇంచార్జ్ ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. ల్యాబ్ పనులు త్వరగా పూర్తి చేయాలని, ప్రారంభించేందుకు అన్నీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తిరుమల లడ్డూ కల్తీ అంశం రాష్ట్రంలో సంచలనంగా మారింది. గత కొద్ది నెలలుగా ఈ అంశంపై రాజకీయ రచ్చ నడుస్తోంది. ఇప్పటికే సిట్ విచారణ చేపడుతోంది. తిరుమలకే కాకుండా శ్రీశైలం ఆలయానికి కూడా కల్తీ నెయ్యి సరఫరా జరిగిందని సిట్ గుర్తించింది. 2022 నుంచి 2023 వరకు కల్తీ నెయ్యి సరఫరా అయినట్లు సిట్ చెబుతోంది. అప్పటివరకు శ్రీశైలంకు విజయ డెయిరీ నెయ్యిని సరఫరా చేసింది. కానీ ఆ తర్వాత తిరుపతికి చెందిన రాజేశ్ కార్పొరేషన్ నుంచి నెయ్యి సరఫరా అవుతోంది. అయితే ఈ నెయ్యిలో కొన్ని రసాయనాలు కలిసినట్లు సిట్ చెబుతోంది.

### ఆటో.. అటో.. ఇటో..

# నడిరోడ్డుపై విన్యాసాలు..

## కట్‌చేస్తే.. ఏం జరిగిందో తెలుసా..?



హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి 44పై కర్నూలు శివారులో ఆటోలతో విన్యాసం చేసిన దృశ్యాలు అందరిని భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. సమాచారం తెలుసుకున్న కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ట్రాఫిక్ పోలీసులను అలర్ట్ చేశారు. హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారి 44పై కర్నూలు శివారులో ఆటోలతో విన్యాసం చేసిన దృశ్యాలు అందరిని భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. సమాచారం తెలుసుకున్న కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ట్రాఫిక్ పోలీసులను అలర్ట్ చేశారు. వీటిని చూసి పోలీసులు కూడా షాక్ అయ్యారు. వెంటనే చర్యలు ప్రారంభించారు. కర్నూలు మమతా నగర్ కు చెందిన శివ మల్లేష్, అఖిల్, అశోక్ నగర్ లోని శ్రీకృష్ణ కాలనీకి చెందిన ఘనమురు జయసింహాలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పించారు. అసలేం జరిగిందంటే.. ఈనెల 1వ తేదీ రాత్రి పదిన్నర గంటల సమయంలో ముగ్గురు కలిసి పంచలింగాల సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఆటోలు నడుపుతూ ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురి చేశారు. రోడ్డు మీద ఒక టైర్ తగలకుండా డ్రైవింగ్ చేస్తున్న దృశ్యాలు నిజంగా ఆందోళనకు గురిచేశాయి. స్థానికుల ఫిర్యాదుతో బుధవారం వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి ఆటోలను రవాణా శాఖకు అప్పగించారు. ముగ్గురు యువకులను అరెస్టు చేసినట్లు ప్రకటించారు పోలీసులు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ సరదా కోసం రోడ్లపై వాహనాలతో విన్యాసాలు చేస్తే జైలు శిక్షతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ శాశ్వతంగా రద్దు చేస్తామని హెచ్చరించారు.

# మేం రెడీ.. వాళ్లే వణుకుతున్నారు..

క్రీడా వాయిస్

# వయసు పెరిగిందనుంటే పొరపాటే..

## పాక్ ప్లాన్ రివర్స్.. సూర్య ఇచ్చిన దెబ్బకు పీసీబీ షాక్



టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందే భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య నెలకొన్న బాయ్ కాట్ వివాదం ముదురుతోంది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన హై-ప్రొఫైల్ మ్యాచ్‌ను తాము ఆడబోమని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించగా, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన మౌనాన్ని వీడుతూ దీనిపై క్లారిటీ ఇచ్చారు. టీ20 వరల్డ్ కప్ 2026 ప్రారంభానికి ముందే భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య నెలకొన్న బాయ్ కాట్ వివాదం ముదురుతోంది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా జరగాల్సిన హై-ప్రొఫైల్ మ్యాచ్‌ను తాము ఆడబోమని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించగా, టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన మౌనాన్ని వీడుతూ దీనిపై క్లారిటీ ఇచ్చారు. ముంబైలో జరిగిన కెప్టెన్ల ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సూర్యకుమార్ యాదవ్ ఈ వివాదంపై స్పష్టతనిచ్చారు. "మా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. మేం మ్యాచ్ ఆడబోమని ఎప్పుడూ చెప్పలేదు. నిరాకరించింది అవతలి పక్షం (పాకిస్థాన్) వారే. ఐసీసీ షెడ్యూల్ ఇచ్చింది, భారత్-పాక్ ప్రభుత్వాలు తటస్థ వేదికపై (కొలంబో) ఆడాలని నిర్ణయించాయి. మా ఫ్లైట్ టికెట్లు బుక్ అయ్యాయి, మేం కచ్చితంగా కొలంబో వెళ్తున్నాం" అని సూర్య ధీమా వ్యక్తం చేశారు. ఫిబ్రవరి 15న మైదానంలోకి రావాలా వద్దా అనేది పాకిస్థాన్ నిర్ణయమని, తాము మాత్రం మ్యాచుకు పూర్తి సిద్ధంగా ఉన్నామని సూర్య స్పష్టం చేశారు.పాకిస్థాన్ ఎందుకు బహిష్కరిస్తోంది? బంగ్లాదేశ్‌ను వరల్డ్ కప్ నుంచి తప్పించి స్కాట్లాండ్‌ను చేర్చడాన్ని నిరసిస్తూ పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా భారత్‌తో మ్యాచ్ ఆడబోమని ఆయన ప్రకటించారు. అయితే కేవలం భారత్‌తో మ్యాచ్ మాత్రమే ఆడమని చెప్పడంపై ఐసీసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఇలా సెలెక్టివ్ పార్టిసిపేషన్ చేయడం క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని, దీనివల్ల పాక్ క్రికెట్ బోర్డు భారీ ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

**ఫోర్స్ మెజూర్ క్లాజ్ అంటే ఏమిటి?**

ఐసీసీ విధించబోయే కఠినమైన జరిమానాల నుంచి తప్పించుకోవడానికి పీసీబీ ఒక కొత్త ఎత్తుగడ వేస్తోంది. ఫోర్స్ మెజూర్ అనే క్లాజ్‌ను తెరపైకి తెస్తోంది. అంటే, "అనుకోని విపత్కర పరిస్థితుల వల్ల మేము ఒప్పందాన్ని నెరవేర్చలేకపోతున్నాం" అని వాదించే ప్రయత్నం చేస్తోంది. తమ ప్రభుత్వం ఆడవద్దని ఆదేశించిందని, ఇది తాము ఊహించని పరిణామమని ఐసీసీకి చెప్పాలని చూస్తోంది. కానీ, బీసీసీఐ, ఇతర బోర్డులు మాత్రం ఇది కేవలం రాజకీయ కారణమే తప్ప, అనివార్య పరిస్థితి కాదని వాదిస్తున్నాయి.

**భారీ జరిమానాలు, న్యాయపరమైన చిక్కులు**

ఒకవేళ పాకిస్థాన్ ఫిబ్రవరి 15న మైదానంలోకి రాకపోతే, భారత్‌కు నేరుగా రెండు పాయింట్లు లభిస్తాయి. కానీ సమస్య అక్కడితో ఆగదు. పాకిస్థాన్ బోర్డుకు ఏడాదికి వచ్చే సుమారు 35-38 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.300 కోట్లు) ఆదాయాన్ని ఐసీసీ నిలిపివేసే అవకాశం ఉంది. అలాగే అధికారిక బ్రాడ్‌కాస్టర్లు కూడా భారీ నష్టపరిహారం కోరుతూ కోర్టుకు వెళ్ళే ఛాన్స్ ఉంది. ఇప్పటికే ఐసీసీ డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజాను పీసీబీతో చర్చల కోసం పంపింది. మరి ఫిబ్రవరి 15 నాటికి పాక్ తన నిర్ణయాన్ని మార్చుకుంటుందో లేదో చూడాలి.

## పట్టపగలే చుక్కలు చూపించే హార్డ్ హిట్టర్లు.. మెగా ఈవెంట్ బరిలో ఐదుగురు..!




2026 టీ20 ప్రపంచ కప్‌లో వయస్సు కేవలం ఒక సంఖ్య అని నిరూపితం కానుంది. ఎందుకంటే, ఈ ఏడాది ఐసీసీ మెగా ఈవెంట్ లో 40 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల ఐదుగురు దిగ్గజాలు బరిలోకి దిగి సంచనాలు సృష్టించేందుకు సిద్ధమయ్యారు. వయస్సు అనేది కేవలం ఒక సంఖ్య అని అప్పుడప్పుడు నిరూపితమవుతూనే ఉంటుంది. ముఖ్యంగా క్రికెట్ లో ఇది తప్పని తేలుతూనే ఉంది. ప్రస్తుతం టీ20 ప్రపంచకప్ 2026లో కొందరు ప్లేయర్లు తమ వయసుతో సంచలనంగా మారారు. టీ20 ఫార్మాట్ అంటే యువ ఆటగాళ్ల దూకుడు అనే నానుడికి, ఈ సీనియర్ ప్లేయర్లు కూడా తమ సత్తా చాటుతూ ఆకట్టుకుంటున్నారు. 40 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు గల ఐదుగురు స్టార్లు తమ అనుభవంతో సంచలనంగా మారారు. టీ20 ప్రపంచ కప్ 2026లో ఆడుతున్న టాప్ ఐదుగురు సీనియర్ ప్లేయర్ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.. మొహమ్మద్ నదీమ్: 2026 టీ20 ప్రపంచ కప్‌లో ఆడనున్న అతి పెద్ద వయసు ఆటగాళ్ల జాబితాలో మహ్మద్ నదీమ్ అగ్రస్థానంలో ఉన్నాడు. ఓమన్ ఆల్ రౌండర్ నదీమ్ వయసు 43 సంవత్సరాలు. అతను 70 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో ఆడి 768 పరుగులు చేసి 40 వికెట్లు పడగొట్టాడు.

**వాన్ మాడ్సెన్:** ఈ జాబితాలో రెండవ ఆటగాడు ఇటలీ కెప్టెన్ వాన్ మాడ్సెన్. అతని వయసు 42 సంవత్సరాలు. క్రికెట్ ఆడటానికి ముందు, అతను దక్షిణాఫ్రికా తరపున అంతర్జాతీయంగా హాకీ కూడా ఆడాడు. మాడ్సెన్ దక్షిణాఫ్రికాలో జన్మించాడు. ఇంగ్లాండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడాడు. అతను 253 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లలో 17,067 పరుగులు చేశాడు. అయితే అతను ఏడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 205 పరుగులు చేశాడు.

**మహ్మద్ నబీ:** ఆఫ్ఘనిస్తాన్ స్టార్ స్పిన్-బౌలింగ్ ఆల్ రౌండర్ మహ్మద్ నబీ దేశీయ క్రికెట్‌లో తన కొడుకుతో కలిసి ఆడుతూ.. వార్తల్లో నిలుస్తున్నాడు. 41 ఏళ్ల నబీ ప్రపంచ కప్‌లో ఆడనున్న అతి పెద్ద వయసు ఆటగాళ్లలో ఒకడిగా నిలిచాడు. నబీ ఇప్పటివరకు 148 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 2,430 పరుగులు చేశాడు. తన బౌలింగ్‌తో 104 వికెట్లు పడగొట్టాడు.

**రోలోఫ్ వాన్ డెర్ మెర్వే:** నెదర్లాండ్స్‌కు చెందిన రోలోఫ్ వాన్ డెర్ మెర్వే నాలుగో స్థానంలో నిలిచాడు. 41 ఏళ్ల అతను 67 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 561 పరుగులు చేసి 74 వికెట్లు పడగొట్టాడు. భారత పిచ్‌లపై తన బౌలింగ్‌తో మెర్వే తన సత్తా చాటాలని చూస్తున్నాడు.

**బ్రాండన్ టేలర్:** ఈ జాబితాలో జింబాబ్వేకు చెందిన బ్రెండన్ టేలర్ అగ్రస్థానంలో ఉన్నాడు. టేలర్ 2004 నుంఎతీ జింబాబ్వే తరపున అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నాడు. గత రెండు దశాబ్దాలుగా జట్టులో కీలక సభ్యుడిగా ఉన్నాడు. ఫిబ్రవరి 6న టేలర్ 40 ఏళ్లు పూర్తి చేసుకుంటాడు. ఇప్పటివరకు 58 ఓఙ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అతను 1,185 పరుగులు చేశాడు.

# స్మృతి మంధాన విశ్వరూపం..

### ఫైనల్లో ఆ 53 పరుగులు చేస్తే చాలు.. స్టార్ ప్లేయర్ రికార్డు హుష్ కాకి



మహిళల ప్రీమియర్ లీగ్ ముగింపు దశకు చేరుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరుగుతున్న ఈ ఫైనల్ పోరులో అందరి కళ్లు ఆర్‌సీబీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన పైనే ఉన్నాయి. ఈ ఒక్క మ్యాచ్‌తో ఆమె ఏకంగా ట్రిపుల్ మిషన్?ను పూర్తి చేసే అవకాశం ఉంది. మహిళల ప్రీమియర్ లీగ్ ముగింపు దశకు చేరుకుంది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరుగుతున్న ఈ ఫైనల్ పోరులో అందరి కళ్లు ఆర్‌సీబీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన పైనే ఉన్నాయి. ఈ ఒక్క మ్యాచ్‌తో ఆమె ఏకంగా ట్రిపుల్ మిషన్?ను పూర్తి చేసే అవకాశం ఉంది. డబ్ల్యూపీఎల్ 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో ప్రస్తుతం స్మృతి మంధాన మూడో స్థానంలో ఉంది. అయితే నంబర్ 1 స్థానానికి ఆమెకు పెద్ద దూరం ఏమీ లేదు.ముంబై ఇండియన్స్ కెప్టెన్ హర్మన్ ప్రీత్ కౌర్ 8 మ్యాచ్‌ల్లో 342 పరుగులతో అగ్రస్థానంలో ఉండగా, స్మృతి 8 మ్యాచ్‌ల్లో 290 పరుగులతో ఉంది. అంటే, నేడు ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే ఫైనల్లో స్మృతి కేవలం 53 పరుగులు చేస్తే చాలు.. హర్మన్‌ను వెనక్కి నెట్టి ఈ సీజన్ టాప్ స్కోరర్?గా నిలుస్తుంది. మధ్యలో నాట్ సీవర్ (321 రన్స్) ఉన్నప్పటికీ, స్మృతి మంచి ఫామ్‌లో ఉండటంతో ఈ మార్కును దాటడం సులువే అనిపిస్తోంది. హర్మన్ రికార్డును దాటడమే కాకుండా, తన ఇన్నింగ్స్‌ను మరో 11 పరుగులు (మొత్తం 64) ముందుకు తీసుకెళ్తే.. డబ్ల్యూపీఎల్ చరిత్రలో 1000 పరుగులు పూర్తి చేసిన 5వ బ్యాటర్‌గా స్మృతి రికార్డు సృష్టిస్తుంది. అంతేకాకుండా, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున ఈ వెయ్యి పరుగుల మైలురాయిని అందుకున్న మొట్టమొదటి బ్యాటర్‌గా ఆమె చరిత్ర పుటల్లోకెక్కుతుంది. ప్రస్తుతం ఆమె ఖాతాలో 34 మ్యాచ్‌ల్లో 936 పరుగులు ఉన్నాయి.

**ఏమిటా ట్రిపుల్ మిషన్?**

స్మృతి మంధాన ఈ ఫైనల్ మ్యాచ్‌లో మూడు ప్రధాన లక్ష్యాలను పెట్టుకుంది.

ఆరెంజ్ క్యాప్: ఈ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి నంబర్ 1 గా నిలవడం.

వెయ్యి పరుగులు: ఆర్‌సీబీ తరపున డబ్ల్యూపీఎల్లో 1000 పరుగుల మార్కును అందుకోవడం.

రెండోసారి టైటిల్: జట్టుకు వరుసగా రెండోసారి డబ్ల్యూపీఎల్ ట్రోఫీని అందించి, రెండు టైటిళ్లు గెలిచిన రెండో కెప్టెన్‌గా నిలవడం.

నేటి ఫైనల్లో స్మృతి మంధాన ఈ రికార్డులను అందుకుంటే, ఆర్‌సీబీ అభిమానుల ఆనందానికి అవధులు ఉండవు.

# 300 మంది యోధుల్లో అతడే స్పెషల్..

### 19 ఏళ్ల రికార్డును మోస్తున్న క్రికెట్ భీష్ముడు



టీ20 వరల్డ్ కప్ 2026 సమరానికి తెరలేచింది. మొత్తం 20 దేశాల నుంచి దాదాపు 300 మంది మేటి ఆటగాళ్లు ఈ మెగా టోర్నీలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అయితే ఈ 300 మందిలో ఒకే ఒక్కడు చాలా స్పెషల్. 39 ఏళ్ల వయసులోనూ కుర్రాళ్లకు పోటీనిస్తూ, రికార్డుల వేటలో దూసుకుపోతున్న ఆ క్రికెటర్ ఎవరో కాదు.. జింబాబ్వే స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ బ్రెండన్ టేలర్. ప్రస్తుతం జరుగుతున్న టీ20 వరల్డ్ కప్ 2026లో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి. ప్రతి జట్టులో 15 మంది ఆటగాళ్ల చొప్పున మొత్తం 300 మంది బరిలో ఉన్నారు. కానీ ఈ 300 మందిలో బ్రెండన్ టేలర్ ఎందుకు ప్రత్యేకం అంటే.. 2007లో జరిగిన మొట్టమొదటి టీ20 వరల్డ్ కప్‌లో ఆడిన ఆటగాళ్లలో, ఇప్పుడు 2026 వరల్డ్ కప్‌లో ఆడుతున్న ఏకైక ఆటగాడు ఇతనే కావడం విశేషం. అంటే దాదాపు 19 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు టీ20 ఫార్మాట్‌లో నిలకడగా రాణిస్తూ, తన ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొంటున్నాడు. ఇది ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే ఒక అరుదైన గౌరవం.

**టేలర్ వరల్డ్ కప్ రికార్డులు**

జింబాబ్వే జట్టు ఇప్పటివరకు జరిగిన 10 టీ20 వరల్డ్ కప్ ఎడిషన్లలో 7 సార్లు పాల్గొనగా, టేలర్ అందులో 5 సార్లు జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఇందులో రెండుసార్లు కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించాడు. వయసు మీద పడుతున్నా అతని బ్యాటింగ్ పవర్‌లో ఏమాత్రం మార్పు రాలేదు. గత 4 వరల్డ్ కప్‌లలో ఆడిన 8 మ్యాచ్‌లలో 40.83 సగటుతో 245 పరుగులు చేశాడు. విశేషమేమిటంటే.. ఆడిన 8 మ్యాచ్‌ల్లోనే 4 హాఫ్ సెంచరీలు బాదాడు. అత్యధిక స్కోరు 60 నాటౌట్. ఈ గణాంకాలను చూస్తుంటే టేలర్ కేవలం అనుభవం కోసమే కాదు, పక్కా పర్ఫార్మెన్స్ కోసమే జట్టులో ఉన్నాడని స్పష్టమవుతోంది.

**చివరి ప్రపంచకప్ కానుందా?**

39 ఏళ్ల ఈ వికెట్ కీపర్ బ్యాటర్ బహుశా తన కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ ఆడుతున్నాడని విశ్లేషకులు భావిస్తున్నారు. జింబాబ్వే వంటి జట్టుకు టేలర్ లాంటి సీనియర్ ఆటగాడి అనుభవం ఈసారి చాలా కీలకం కానుంది. యువ ఆటగాళ్లతో నిండిన ప్రస్తుత క్రికెట్ ప్రపంచంలో, 19 ఏళ్ల క్రితం నాటి క్రికెట్ జ్ఞాపకాలను, ఇప్పటి ఆధునిక టెక్నిక్స్‌ను కలగలిపి ఆడుతున్న టేలర్ ప్రదర్శన చూడటం ఒక అద్భుతం. ఈ టోర్నీలో అతను మరిన్ని రికార్డులు సృష్టించి తన కెరీర్‌కు ఘనమైన వీడ్కోలు పలకాలని అభిమానులు కోరుకుంటున్నారు.



### వార్మప్ మ్యాచులో అభిషేక్ శర్మ

# మధ్యలోనే ఎందుకు వెనుదిరిగాడు?

టీ20 వరల్డ్ కప్ 2026 సమరం మొదలవ్వకముందే టీమిండియా తన పదును చూపిస్తోంది. ఫిబ్రవరి 4వ తేదీ రాత్రి సౌతాఫ్రికాతో జరిగిన ఏకైక వార్మప్ మ్యాచ్‌లో భారత్ ఘనవిజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్‌లో యువ ఓపెనర్లు అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026 వేటను టీమిండియా ఘనంగా ప్రారంభించింది. సౌతాఫ్రికాతో జరిగిన ఏకైక వార్మప్ మ్యాచ్‌లో భారత్ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా జట్టును 210 పరుగులకే కట్టడి చేసి విజయాన్ని అందుకుంది. ఈ మ్యాచ్‌లో ఫలితం కంటే కూడా భారత ఓపెనర్ల ప్రదర్శన, వారు తీసుకున్న నిర్ణయాలు అందరినీ ఆశ్చర్యపరిచాయి. భారత ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఇషాన్ కిషన్ సిక్సర్ల వర్షం కురిపించాడు. కేవలం 20 బంతుల్లోనే 2 ఫోర్లు, 7 భారీ సిక్సర్ల సాయంతో 53 పరుగులు చేసి హాఫ్ సెంచరీ మార్కును అందుకున్నాడు. అయితే తను మంచి ఫామ్‌లో ఉన్నప్పటికీ, జట్టులోని ఇతర ఆటగాళ్లకు కూడా ప్రాక్టీస్ లభించాలనే ఉద్దేశంతో 5.4 ఓవర్ల వద్దే రిటైర్డ్ అవుట్?గా వెనుదిరిగాడు. సాధారణంగా వార్మప్ మ్యాచ్‌లలో బ్యాటర్లు తమ ప్రాక్టీస్ పూర్తయినట్లు భావిస్తే ఇతరులకు అవకాశం ఇచ్చేందుకు ఇలా చేస్తారు. ఇషాన్ ఇన్నింగ్స్ చూస్తుంటే వరల్డ్ కప్‌లో అతను సృష్టించబోయే విధ్వంసం ఎలా ఉండబోతుందో క్లియర్‌గా అర్థమవుతోంది.

**అభిషేక్ శర్మకు ఏమైంది? 18 బంతుల్లో 24 పరుగులేనా?**

మరోవైపు, పవర్ హిట్టర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్‌లో కాస్త తడబడ్డాడు. సాధారణంగా తొలి బంతి నుంచే విరుచుకుపడే అభిషేక్, ఈ మ్యాచ్‌లో బంతిని సరిగ్గా టైమ్ చేయలేకపోయాడు. ఒకవైపు ఇషాన్ కిషన్ బౌలర్లను చీల్చిచెండాడుతుంటే, అభిషేక్ మాత్రం పరుగులు తీయడానికి ఇబ్బంది పడ్డాడు. కేవలం 18 బంతుల్లో 24 పరుగులు (3 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే చేసిన తర్వాత, తను అనవసరంగా బంతులను వృథా చేస్తున్నానని భావించిన అభిషేక్ శర్మ, పెవిలియన్ వైపు అడుగులు వేశాడు. తన వల్ల మిగతా బ్యాటర్లకు సమయం తక్కువ కాకూడదనే ఉద్దేశంతో అతను ఈ నిర్ణయం తీసుకున్నాడు.

సినీ వాయిస్ CINEMA

### 25 ఏళ్ల క్రితం ప్రకాశ్ రాజ్ ఇంటి నుంచి

# మందు బాటిళ్లు ఎత్తుకెళ్లారు..

### ఇప్పుడు ఒకరు బిగ్ డైరెక్టర్.. మరొకరు



నువ్వే నువ్వే 20 ఏళ్ల వేడుకలలో దర్శకుడు త్రివిక్రమ్ తన ప్రయాణాన్ని పంచుకున్నారు. నిర్మాత రవికిషోర్ తనను ఎంతగా ప్రోత్సహించారో, సినిమా పట్ల వారిద్దరి అనుబంధం ఎలాంటిదో వివరించారు. ప్రకాష్ రాజ్, సీతారామశాస్త్రి వంటివారితో తనకున్న అనుభవాలను ఆయన గుర్తుచేసుకున్నారు. నువ్వే నువ్వే చిత్రం 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన వేడుకలలో దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ తన సినీ ప్రయాణం, చిత్ర నిర్మాణ విశేషాలను హాస్యభరితంగా, భావోద్వేగంగా పంచుకున్నారు. నువ్వే కావాలి చిత్ర షూటింగ్ వనమాలి హౌస్‌లో జరుగుతున్నప్పుడు, పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో రవికిషోర్‌తో సరదాగా మాట్లాడుతూ నువ్వే నువ్వే కథను చెప్పడం మొదలుపెట్టానని త్రివిక్రమ్ గుర్తుచేసుకున్నారు. కేవలం నాలుగు సిగరెట్లు కాల్చేంత సమయంలో కథ చెప్పడం పూర్తి చేయగా, రవికిషోర్ వెంటనే కారులోంచి చెక్ బుక్ తీసి నువ్వే కావాలికి ఇచ్చిన రెమ్యూనరేషన్‌కు దాదాపు సమానమైన మొత్తాన్ని అడ్వాన్స్‌గా ఇచ్చారని త్రివిక్రమ్ తెలిపారు. ఆ నమ్మకానికి, ధైర్యానికి ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా సరిపోదని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. అప్పటికి తాను రాసిన నువ్వే కావాలి ఇంకా విడుదల కాకపోయినా, తనలోని రచయితను, దర్శకుడిని భయం లేకుండా నమ్మిన వ్యక్తి రవికిషోర్ అని ప్రశంసించారు. రవికిషోర్ తరచుగా అర్ధరాత్రి తన స్క్రిప్ట్ చదివి, డైలాగులు నచ్చితే రాత్రి 12 లేదా 1 గంటలకు ఫోన్ చేసి ఏడ్చేవారని, ఒక్కోసారి పంజాగుట్టలోని తమ రూమ్‌కు వచ్చి హార్న్ కొట్టి సునీల్‌తో కలిసి తనను కిందకు పిలిచి, కౌగిలించుకుని ఏడ్చేవారని త్రివిక్రమ్ వివరించారు. ప్రకాష్ రాజ్‌తో తనకున్న ప్రత్యేకమైన, హాస్యభరితమైన అనుబంధాన్ని కూడా త్రివిక్రమ్ వెల్లడించారు. తనను చూస్తే ప్రకాష్ రాజ్ భయపడేవారని, తాను వచ్చినప్పుడల్లా ఇంట్లోంచి ఏదో ఒకటి పట్టుకుపోతానని ఆయన భావించేవారని సరదాగా చెప్పారు. రచయిత కాకముందే అర్ధరాత్రి 11-12 గంటలకు ప్రకాష్ రాజ్ ఇంటికి వెళ్లి తలుపు కొట్టి తినడానికి ఏమైనా ఉందా అని అడిగి, మందు బాటిళ్లు, చేతి వాచీలు కూడా తెలియకుండా తీసుకెళ్లేవాడినని త్రివిక్రమ్ సరదాగా చెప్పుకొచ్చారు. ప్రకాష్ రాజ్ తనను, సునీల్‌ను ఎంతో భరించారని, తమ చిన్న చిన్న ఊళ్ల నుంచి వచ్చిన అమాయకత్వాన్ని ఆయన ఎంజాయ్ చేసి ఉండవచ్చని పేర్కొన్నారు. ప్రకాష్ రాజ్‌తో తనకు ఎప్పుడూ పెద్ద గొడవలు రాలేదని, ఆయనపై బ్యాన్ ఎందుకు వచ్చిందో అర్థం కాదని త్రివిక్రమ్ అన్నారు. సినిమాటోగ్రాఫర్ హరి అనుమోలును ప్రశంసిస్తూ, శ్రీయ, తరుణ్‌ల బిగినింగ్ షాట్స్ చాలా అద్భుతంగా చిత్రీకరించారని త్రివిక్రమ్ చెప్పారు. అబ్బూరి రవి తన దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన విధానాన్ని, ఆ తర్వాత రచయితగా మారిన తీరును సరదాగా గుర్తుచేసుకున్నారు. గీత రచయిత సీతారామశాస్త్రి అద్భుతమైన సాహిత్యాన్ని త్రివిక్రమ్ కొనియాడారు.

# నాకు అలవాటు ఉంది.. కానీ ఇంట్లోనే ఎంజాయ్ చేస్తా..!

### షాకింగ్ విషయం చెప్పిన దివి

బిగ్ బాస్ గేమ్ షో ద్వారా పాపులర్ అయినా ముద్దుగుమ్మల్లో దివి ఒకరు. ఈ అందాల భామ పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రల్లో నటించింది. తన అందంతో ప్రేక్షకులను ఆకట్టుకుంది దివి. ఆ క్రేజ్ తోనే ఈ చిన్నది బిగ్ బాస్ షోలో ఛాన్స్ అందుకుంది. సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకొని ఆతర్వాత క్రేజ్ తెచ్చుకుంది అందాల భామ దివి వాద్యా. సినిమాల్లో చిన్న పాత్రలు చేసిన ఈ అమ్మడు ఆతర్వాత బిగ్ బాస్ గేమ్ షోలో అవకాశం అందుకుంది. బిగ్ బాస్ గేమ్ షోలో తన ఆటతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈముద్దుగుమ్మ తన అందంతోనూ కవ్వించింది. బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోయింది. ఇప్పుడిప్పుడే ఈ చిన్నది ఆఫర్స్ అందుకుంటుంది. ప్రస్తుతం నవీన్ చంద్ర హీరోగా నటిస్తున్న హనీ సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా దివి రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దివి ఓ పాడ్‌కాస్ట్‌లో అనేక ఆసక్తికరమైన అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంది. అలాగే తన వ్యక్తిగత అలవాట్లపై దివి మాట్లాడింది. అబ్బాయిలు, అమ్మాయిల డ్రింకింగ్, స్మోకింగ్ అలవాట్ల గురించి మాట్లాడుతూ.. ఈ విషయంలో లింగ సమానత్వాన్ని దివి వ్యతిరేకించింది. సమానత్వం మంచి విషయాలలో.. ముఖ్యంగా కెరీర్, ఉన్నత విషయాలలో.. ఉండాలని.. డ్రింకింగ్, స్మోకింగ్ వంటి ఆరోగ్యానికి హానికరం కాని విషయాలలో కాదని చెప్పుకొచ్చింది. ధూమపానం వల్ల ఆరోగ్యం, ముఖ్యంగా చర్మం త్వరగా పాడైపోతుందని... స్మోక్ చేసే అమ్మాయిలు 25 ఏళ్ల వయసులో 35 ఏళ్లలా కనిపిస్తారని, చర్మంపై ప్రేమ ఉంటే ధూమపానానికి దూరంగా ఉండాలని దివి సలహా ఇచ్చింది. తన వ్యక్తిగత అలవాట్ల గురించి అడగగా.., తాను అప్పుడప్పుడు స్నేహితులతో కలిసి డ్రింక్ చేస్తానని తెలిపింది. డాన్ హులియో టెకీలా తనకిష్టమైన బ్రాండ్ అని తెలిపింది దివి. డ్రింక్ చేసిన తర్వాత తాను చాలా చిల్‌గా, హైపర్‌గా ఉంటానని, తన స్నేహితులు తనతో పార్టీలను ఎంజాయ్ చేస్తానని తెలిపింది. పబ్స్‌లో అంతగా ఎంజాయ్ చేయనని, అక్కడ కేవలం వాటర్ మాత్రమే తాగుతానని.. ఇంట్లోనే ఎక్కువగా పార్టీలు చేసుకుంటా అని తెలిపింది. తన పుట్టినరోజులు, న్యూ ఇయర్‌కు కచ్చితంగా ఇంట్లోనే హౌస్ పార్టీలు ఉంటాయని, అక్కడ తాను మనసు విప్పి డ్యాన్స్ చేస్తానని చెప్పుకొచ్చింది. ఈ పార్టీలలో సినిమా రంగానికి చెందిన వారెవరూ ఉండరని, సినిమాకు సంబంధించిన టాపిక్స్ కూడా మాట్లాడుకోము అని దివి తెలిపింది. పార్టీకి వచ్చిన అందరినీ బాగా చూసుకోవడం, వారిని సంతోషంగా ఉంచడమే తన లక్ష్యమని, డ్రింక్ చేసిన తర్వాత తనకు ఎలాంటి నెగటివ్ ఆలోచనలు రావని దివి చెప్పుకొచ్చింది.





# మూడు నెలలు నరకం.. ఆరుసార్లు రక్తం మార్పిడి..

### భయంగా బ్రతికామన్న స్టార్ హీరోయిన్

సినిమా ఇండస్ట్రీలో ఆమె ఓ తిరుగులేని హీరోయిన్.. ఎన్నో సూపర్ హిట్ సినిమాల్లో నటించి మెప్పించింది ఆమె.. హీరోయిన్ గా గ్లోబల్ రేంజ్ లో క్రేజ్ సొంతం చేసుకుంది. ప్రస్తుతం హీరోలకు సమానంగా రెమ్యునరేషన్ తీసుకుంటూ దూసుకుపోతుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఎమోషనల్ కామెంట్స్ చేసింది. ఆమె ఓ స్టార్ హీరోయిన్.. సినిమా ఇండస్ట్రీలో తిరుగులేని హీరోయిన్ గా రాణిస్తుంది. హీరోలకు సమానంగా సినిమాలే కాదు రెమ్యునరేషన్ కూడా అందుకుంటూ దూసుకుపోతుంది. కేవలం మన ఇండస్ట్రీలోనే కాదు ఆమె గ్లోబల్ వైడ్ గా పాపులర్ అయ్యింది. 25 ఏళ్లుగా ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్ గా రాణిస్తుంది ఆ ముద్దుగుమ్మ.. అలాగే ఇప్పటికీ పాన్ ఇండియా సినిమాలతో దూసుకుపోతుంది ఈ ముద్దుగుమ్మ. ఇక వయసులో తనకన్నా చిన్నవాడిని పెళ్లి చేసుకొని వార్తల్లో నిలిచింది ఈ చిన్నది. ఈ అమ్మడి పెళ్లి సమయంలో చాలా విమర్శలు వచ్చాయి. అవేమి పట్టించుకోకుండా ఇష్టపడిన వాడిని పెళ్లి చేసుకొని ఫ్యామిలీ లైఫ్ ను ఎంజాయ్ చేస్తుంది. ఇదిలా ఉంటే తాజాగా ఆమె కూతురి గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? పైన మనం మాట్లాడుకున్న హీరోయిన్ ఎవరో కాదు గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా. ఈ ముద్దుగుమ్మ బాలీవుడ్ లో చాలా పాపులర్ హీరోయిన్. అక్కడ స్టార్ డమ్ తెచ్చుకున్న ఆమె హాలీవుడ్ లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పిస్తుంది. ప్రస్తుతం సూపర్ స్టార్ మహేష్ బాబు నటిస్తున్న వారణాసి సినిమా చేస్తుంది. ఈ సినిమా పాన్ వరల్డ్ మూవీగా తెరకెక్కుతుంది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. ఇదిలా ఉంటే ప్రియాంక చోప్రా తన కూతురి గురించి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. కూతురు పుట్టిన సమయంలో మూడు నెలలు నరకం చూశా అని తెలిపింది ప్రియాంక. ప్రియాంక నిక్ జోనస్ ను పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే.. ప్రియాంక కంటే అతను 10ఏళ్లు చిన్నవాడు. వీరికి ఒక పాప కూడా ఉంది. ఈ చిన్నారి సరోగసి ద్వారా జన్మించిన సంగతి తెలిసిందే. ఆ చిన్నారి పేరు మాల్తీ మేరీ. అయితే ఆ పాప నెలలు నిండకుండానే పుట్టిందట.. మూడు నెలలు ముందుగానే పాప జన్మించిందని.. తమ కుమార్తె పుట్టిన సమయంలో 765 గ్రాముల బరువు మాత్రమే ఉందని తెలిపింది ప్రియాంక. అప్పుడు కొన్ని నెలలపాటు హాస్పిటల్లోనే ఉండాల్సి వచ్చిందని. పైగా అప్పుడు కరోనా సమయం కావడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం అని తెలిపింది ప్రియాంక. చావు బతుకల మధ్య తన కుమార్తె హాస్పిటల్ లో పోరాటం చేసిందని.. ఆ సమయంలో చాలా భయంగా బ్రతికామని చెప్పుకొచ్చింది ప్రియాంక. మూడు నెలల్లో తన కూతురికి ఆరు సార్లు రక్తం మార్చారని తెలిపింది ప్రియాంక. ఎన్నో ఇబ్బందులు ఎదుర్కుని తన కూతురు క్షేమంగా బయటపడిందని ప్రియాంక దంపతులు ఓ ఇంటర్వ్యూలో తెలిపారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్ CINEMA
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com